
ఆంధ్రసచిత్రవార
పత్రిక



22-9-67
40 పైసలు


డి.బి.యస్.ఫిలిమ్స్
ప్రైవేటుమాష్టారు
డైరెక్షన్ కె. విశ్వనాథ్ బి.ఎస్‌సి
రచన ముళ్ళపూడి వెంకటరమణ
సంగీతం కె.వి. మహదేవన్
శ్రీ ఫిలింస్ విడుదల

LitQuiz No. 22

Rs. 25,000

FIRST PRIZE Rs. 12,500

RUNNERS-UP (UPTO 4 ERRORS) Rs 6,500

MINIQUIZ (UPTO 2 ERRORS) Rs. 4,000

ATTRACTION Rs 1,000

FAMINE RELIEF FUND: Rs 1,000

— లిట్ క్విజ్ నెం. 22 అధికార ఎంట్రీఫారము —

ADDRESS

LITQUIZ No 22, ALANKAR, BALARAM ST, BOMBAY-7(WB)

షరా:- (1) ఒక్కొక్క కాలంలో మీరు వద్దనే పదమును కొట్టివేయండి. (2) ఒక కూపన్‌మాత్రం పంపినచో రెండవకూపన్ కొట్టివేయండి. (3) ఎంట్రీరుసుము M.O. ద్వారా పంపినచో, పోస్టాఫీసునుండిపొందిన M.O రసీదును ఎంట్రీఫారమునకు జతపరచవలెను. M O రసీదు లేని ఎంట్రీ నిరాకరింపబడును. (4) I.P.O. క్రాస్ చేయవద్దు. అది లిట్‌క్విజ్ నెం. 22, బొంబాయి–7 వారికి చెల్లించునట్లు ఉండవలెను.

1	Re. 1		2	Re 1	
1	ART	RELIGION	1	ART	RELIGION
2	CREATES	EXISTS	2	CREATES	EXISTS
3	CREATIVE	IMITATIVE	3	CREATIVE	IMITATIVE
4	CULTURAL	MENTAL	4	CULTURAL	MENTAL
5	CURIOUS	RELIGIOUS	5	CURIOUS	RELIGIOUS
6	DEMOCRACY	LIBERTY	6	DEMOCRACY	LIBERTY
7	ENTITY	REALITY	7	ENTITY	REALITY
8	EQUALITY	UNITY	8	EQUALITY	UNITY
9	HELPLESSNESS	HOLLOWNESS	9	HELPLESSNESS	HOLLOWNESS
10	HUMILITY	SINCERITY	10	HUMILITY	SINCERITY
11	IDEAL	SOUL	11	IDEAL	SOUL
12	IDEALS	VALUES	12	IDEALS	VALUES
13	MORALITY	PHILOSOPHY	13	MORALITY	PHILOSOPHY
14	PENANCE	SILENCE	14	PENANCE	SILENCE
15	POLITICAL	SOCIAL	15	POLITICAL	SOCIAL
16	PROGRESS	SUCCESS	16	PROGRESS	SUCCESS
17	RACES	RULES	17	RACES	RULES

SEND THESE 2 COUPONS & ENTER MINIQUIZ FREE [22]

MINIQUIZ

10 Clues FREE coupon

ART	RELIGION	IDEAL	SOUL
CREATIVE	IMITATIVE	IDEALS	VALUES
CURIOUS	RELIGIOUS	MORALITY	PHILOSOPHY
DEMOCRACY	LIBERTY	POLITICAL	SOCIAL
ENTITY	REALITY	RACES	RULES

22 (ASVP)

ఈ క్విజ్ ప్రవేశమునకు చెందిన నిబంధనలను షరతులను పాటించుటకు అంగీకరిస్తున్నాను. మరియు కాంపిటీషన్ ఎడిటరు గారి నిర్ణయమును తుది నిర్ణయముగాను, న్యాయబద్ధమైనదిగాను అంగీకరించుటకు ఆమోదిస్తున్నాను. ప్రతి కూపనుకు ఎంట్రీ ఫీజు రు. 1/- ఈ పూర్తి ఎంట్రీ ఫారం ఎంట్రీ ఫీజు రు. 2/- M.O. రసీదు/ I.P.O./లిట్‌క్విజ్ క్యాష్ రసీదు/ప్రైజు కార్డు జతపరుస్తున్నాను.

వాటి నెం. ....

CAPITAL LETTERS

NAME...

ADDRESS...

....

— ఈ పూర్తి ఫారమును కత్తిరించి పంపవలెను —

ఆఖరు ముగింపు తేది: 21—9—67.

సొల్యూషన్ భారత్ జ్యోతిలో: 24-9-67.

ఫలితాలు భారత్ జ్యోతిలో : 8—10—67.

* సొల్యూషన్ వెంటనే పొందుటకు 6 పైసల స్టాంపు, స్వంత అడ్రసుగల కార్డును వెంటనే పంపవలెను *లిట్ క్విజ్ వీక్లీ 10సంచికలకు రు 2 పంపవలెను * మీ ఎంట్రీలను 20-9-67 బుధవారమునాడు కూడా పంపవచ్చును. కాని వాటిని ఎక్స్‌ప్రెస్ డెలివరీలో పంపవలెను.

17 CLUES

1. It is a sad commentary on our present system of Education that **Art/Religion** has either no place or plays a very minor role in our General Education.
2. For us to question why the absolute **Creates / Exists** is as meaningless as to question why the world is as it is.
3. We are **Creative / Imitative** by nature.
4. The history of civilisation shows that even **Cultural / Mental** and moral development rests on a material basis, and presupposes economic activity and progress.
5. The more the scientists gain knowledge about the expanding universe the more they are filled with wonder and appreciation about the universe and the more **Curious / Religious** they become.
6. **Democracy / Liberty** does not believe in suppression of thought
7. What science does is to see and observe but the **Entity / Reality** remains unknown
8. The spirit of the age is in favour of **Equality / Unity**, though practice denies it almost everywhere.
9. If you will analyse your own life, you will find its utter **Helplessness / Hollowness**,
10. **Humility / Sincerity** especially is indispensable to the spiritual endeavour, and crookedness a constant obstacle.
11. Space divides, but the **Ideal / Soul** unites!
12. The essence of all existence is evolution or a constant realisation of new **Ideals / Values.**
13. If there were no thinking beings in the world, there would be no **Morality / Philosophy**.
14. Sages always glorify the power of **Penance / Silence**, too difficult to be appreciated by the westerner
15. Discords, both economic and **Political / Social** can end only if the importance of ethics is recognised and practised by the people.
16. Holy men, even more than famous captains, Discoverers or inventors Show us the way to the **Progress / Success** that matters
17. No People, No **Races / Rules** remain unchanged.

గమనిక : పై క్లూలు గ్రంథకర్తలు, రచయితల పుస్తకముల నుండి తీసుకొనబడినవి. అవి పూర్తి వాక్యములు మరియు వేరువేరుగా పూర్తి అర్థవంతమైనవి. గ్రంథకర్తలు రచయితల పేర్లు, వారి పుస్తకముల పేర్లు అఫిషియల్ సొల్యూషన్‌తోపాటు లిట్ క్విజ్ వీక్లీలో ప్రచురించబడును.

క థ లు

గత సంచికలో (26—8—67) సి పుల్లారావు గారు రచించిన 'ఎదురు చూసిన క్షణం' చాలా బాగున్నది. కాని, నా కొక సందేహము వచ్చినది. అందులో ప్రసాదు బి. కాం చదువు చుండగా ఇందిర బి. ఎస్సి చదువుచుండును. ''ఒకరోజు వారిద్దరు లేబరేటరీలో కలుసుకున్నట్లు'' 33వ పేజీ, 2వ కలంలో వ్రాయబడియున్నది ఇది అచ్చు పొరపాటా, లేక రచయిత పొరపాటా!

చంద్రమోహన్, (గుంటూరు

*　　*　　*

''పరివృతం'', ''ఎదురు చూసిన క్షణం'' కథలు చాలా బాగున్నవి ఇందిర పాత్రల సన్నాకర్షించి

గ మ ని క

ఆం ధ్ర స చి త్ర వా ర ప త్రి క 25—8—67 సంచికలో ప్రచురించిన 'అరవిందస్వామి' వ్యాస ర చ యి త్రి 'సూర్యాన్నపూర్ణ' 1—9—67 సంచికలో ప్రచురించిన 'సాగుతున్నయాత్ర' కథ రచయిత్రి 'సౌభాగ్యవతి' తమ చిరునామాలను తెలియపరచవలసినదిగా కోరుచున్నాము

-సం



ఉత్తరాలు

నది. రచయితలకు ధన్యవాదాలు తెలియజేయవలసినది

పాఠక సోదరుడు బులుసు వెంకటేశ్వర్లు వ్రాసిన విధముగా 'రేగింగ్' అనునది అవసరమా అని అడుగుచున్నాను దాని వలన కలిగే లాభనష్టాలు తెలిసి ఉండవచ్చునేమో దానివలన లాభం కేవలం మన సంతోషం. దానిని గురించే మనము ఆలోచించిన అదితరులకు కంటకప్రాయం కాకూడదు కారణం ఇటీవలనే జరిగిన సంఘటనే నిదర్శనం ఎంత విద్యార్థులైనప్పటికి ఈ యొక్క రేగింగ్ అవసరమని తలచినచో మాటలలోనే తప్ప చేతలలో చూపించరాదని నా అభిప్రాయము దీనిని అపార్థం చేసికొనకూడదు.

పి బద్రీనాథ్, (మద్రాసు)

*　　*　　*

ఈ వారం ఆంధ్రసచిత్ర వారపత్రికలో వెలువడిన ''ఎదురు చూసిన క్షణం'' కథ చదివాక ఈ అనుమానం కలిగింది రచయిత కథలో ప్రసాద్ ఫైనల్ బి. కాం, ఇందిర పి యు సీ అని తెల్పివేరొకచోట ప్రసాద్, ఇందిర లేబరేటరిలో కలుసుకొనెడి వారని వ్రాసినారు ఇది అసంభవం ఫైనల్ బి కాం చదువుతున్న ప్రసాద్‌కు లేబరేటరిలోనికి వెళ్ళు అధికారము లేదు (క్లాసు జరుగుతుండగా) కామర్సు విద్యార్థులకు లేబరేటరీతో నిమిత్తము లేదు! కాబట్టి ఈ తప్పు రచయితదా లేక ప్రచురణలోదా

కందుకూరి రంగనాథకుమార్, (శ్రీకాకుళం

*　　*　　*

1—9—67 సంచిక ఆంధ్రసచిత్ర వారపత్రికలో శ్రీ సి. పుల్లారావుగారు రచించిన 'ఎదురు చూసిన క్షణం' కథ చాలా బాగుంది పాల పొంగులాంటి యవ్వనములో జరిగే సంఘటనలు రచయితగారు చక్కగా వర్ణించారు. ముఖ్యముగా 'ఇందిర' పాత్ర పాఠకుల హృదయాలను కదిలించి వేస్తుంది.

తేజోవతిగారి 'పూర్వా సంధ్యాప్రవర్తతే' రానురాను క్రొత్త క్రొత్త సొంపులతో, వంపులతో పాఠకుల హృదయాలను ఉద్వేగముతో ఊగిస్తున్నది. ఇటువంటి నవల వ్రాసిన తేజోవతిగార్కి, ప్రచురించిన మీకు హృదయపూర్వక అభివందనములు

కె శంకరరావు, (బెంగుళూరు)

ఒకవారం విపరీతం

ఈ వారం అనగా ది 1—9—67 ఆంధ్ర సచిత్రవారపత్రికలో తిరుపతిలో దుర్మరణాలు చూచి చాలా బాధపడినాను అందు చిన్నపిల్లలను చూస్తే కన్నీరు ఆగలేదు ఆ స్వామికి తలనీలములు ఇచ్చి స్వామిని దర్శించే భాగ్యము పొందలేకపోయినారు మానవులము మాకే ఇన్ని వుంటే ఆస్వామికి వారిపై ఎంత దయ కలుగలేదో అనుకుంటాను. ఇక పరివృతం కథ బాగుంది ముందు కూడా ఇటువంటి కథలే వేస్తుంటే బాగుంటుందని తలుస్తాను.

ఎం. ఆర్. దేవి, (రాయవరం)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 22—9—'67
ప్లవంగనామ సం॥ భాద్రపద మాసం బ॥ నవమి
సంపుటము : 60 సంచిక : 3

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
1, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	22 40
6 మాసముల చందా	11.20
3 మాసముల చందా	5 60

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	42 00
అర్ధసంవత్సర చందా	21.00

విషయానుక్రమణిక


అగ్ని మాపక దళం!
భాషా ఉద్యమం
ఉత్తర ప్రదేశ్‌లో వరద భీభత్సం!
చరణ్ సింగ్
యు.పి. మంత్రి వర్గం
ప్రధాని మరికొన్ని బాధ్యతల్ని స్వీకరిస్తున్నారు!
ప్రధాని పదవి
విదేశీయాంగ శాఖ
హంతకుల మధ్యలో శాంతి దూత!
విజ్ఞానాత్మకమైన భాషావిధానాన్ని అవలంభించండి!
ఉన్మత్తులు
భాషావాదులు
OOMMEN

మొరార్జీ దేశాయ్ హిందీ వ్యామోహం!

కార్యసాధకుడికి అడ్డు నిలిచే దంటూ ఏమీ వుండదు దానికి ఈ వారం విషయాలు దృష్టాంతాలు. మన దేశీయాంగ మంత్రి శ్రీయుత యశ్వంతరావ్ చవాన్ గారు. ఆయన గబగబా మెట్లన్నీ ఎక్కేసి విజయ ఢంకా మోగించారు. అదే సమయంలో మొరార్జీ దేశాయ్ గారు పాకుతూ దేకుతూ ఆపసోపాలు పడిపోతున్నారు. శ్రీనగర్ లో రేకొన్న మత సంబంధమైన అగ్నిని చల్లార్చేందుకు చవాన్ గారు హుటాహుటి బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం ఆయన పోక లోని ఉద్దేశం. ఆయన రంగంలో అడుగు పెట్టీ పెట్టగానే కాశ్మీరు పండితులు తమ ఆందోళనని విరమింపచేసుకున్నారు. అంతే, చవాన్ గారి విజయఢంకా దేశమంతా మోగింది!

ఉపప్రధాని అనబడే ఆర్థిక మంత్రిగారు మొరార్జీ దేశాయ్ గారు ఆయనకు ఈ వారం రెండు తంటాలు తెచ్చిపెట్టింది వీటిని పరిష్కరించడం దేశాయ్‌గారి శక్తికి మించిన పనేమీకాదు గాని, అవి బొత్తిగా మాట వినకుండా మొండికేశాయి.

హైకోర్టులలోను, సుప్రీంకోర్టులోను ఉపయోగించే భాష గురించి చర్చించడానికి రాష్ట్ర న్యాయమంత్రులందరూ ఒకచోట సమావేశమయ్యారు. ఈ సమావేశాన్ని ఆవిష్కరించినవారు శ్రీ మొరార్జీ దేశాయ్. ఆయన రాజ్యాంగం గురించి మాట్లాడారు. హిందీ అధికార భాషగా ఒప్పుకోవడం చట్ట సమ్మతం అన్నారు రాజ్యాంగాన్ని తలదాల్చని మంత్రులు వెంటనే రాజీనామాను ఇవ్వడం ఉత్తమం అని బోధించారు. ఏతావాతా తేలిందేమిటయ్యా అంటే హైకోర్టుల్లో హిందీ ఉపయోగించాలి అని!

ఆర్టికల్ 348 కింద భారత రాజ్యాంగంలో ఒక ముఖ్యమైన ఏర్పాటు వుంది అది, పదిహేనేళ్ల తర్వాత కూడా ఇంగ్లీషును ఎలా ఉపయోగించుకో వచ్చునో సూచించింది.

1 సుప్రీం కోర్టు, హైకోర్టుకు సంబంధించిన వ్యవహారాలన్నీ;

2 అధికారయుతమైన బిల్లులు, చట్టాలు, ఆర్డినెన్సులు, ఆర్డర్లు, నియమ నిబంధనలు, రాజ్యాంగానికి సంబంధించినటువంటి ఏర్పాట్లలో గాని, న్యాయ సూత్రాల ననుసరించిన ఏ నిబంధనలలో నయినా సరే ఇంగ్లీషును ఉపయోగించ వచ్చును, అని ఆర్టికల్ 348 అర్థం చెబుతుంది.

కోర్టుల భాషలో నుంచి అధికార భాషను రాజ్యాంగం వేరుచేసి వుందన్నమాట అందరికీ తెలుసు. అలావే 'లింక్ భాష గురించి కూడా రాజ్యాంగం ఏమీ చెప్పలేదు 'హిందీని కోర్టుల్లో ప్రవేశపెట్టి, తద్వారా దేశవ్యాప్తం చేస్తూ దక్షిణాది వారి మీద రుద్దడానికి చూస్తున్నార'ని దేశాయ్ గారి మీద మద్రాసు న్యాయశాఖ మంత్రి ఒక అభియోగం తీసుకు వచ్చారు. ఒక విధంగా మద్రాసు న్యాయమంత్రి వాదమే న్యాయం దానికి దేశాయ్‌గారిచ్చిన సమాధానం అందులో అనుమానం ఏమైనా వుంటే దాన్ని తీర్చి పారేస్తుంది 'దొడ్డిదారి మహాదొడ్డదారి సుమా' అన్నారాయన!

రాజ్యాంగాన్ని సవరిస్తా మన్నప్పుడల్లా దేశాయ్‌గారి కోపం అరికాలి నుంచి నెత్తికెక్కుతుంది. రాజ్యాంగాన్ని సవరించడంతో పాటు నా రాజీనామాను కూడ అంగీకరించండి అంటారాయన. అన్న మాట మీద నిలబడితే 'కామరాజ్' ప్లాను తర్వాత ఆయనకు, బాబూ జగ్‌జీవన్‌రాం గారికీ ఉద్యోగాలుండేవి కావు. ప్రతి సంవత్సరం యిష్టం వచ్చినట్టుగా మార్చుకునేందుకు రాజ్యాంగం అనేది పరిష్కార వ్యాయం లాంటిది కాదు. కాని, ప్రజల సౌకర్యం కోసం ఒక్కొక్కప్పుడు విధిగా మార్చవలసి వుంటుంది హిందీ భాషేతర ప్రాంతాల వారిమీద హిందీని రుద్దడాన్ని అనుసరించి రాజ్యాంగాన్ని మార్చక తప్పదు!

కాంగ్రెసు కార్యవర్గ సమావేశంలో మద్యనిషేధం మీద చర్చ దేశాయ్‌గారికి రెండో ప్రతిఘటన అని చెప్పాలి. కామరాజ్ గారు ఒక ప్లానువేసి, దాని ప్రకారం గుజరాత్ ముఖ్యమంత్రి జీవ్‌రాజ్ మెహతా గారిని, మద్యనిషేధ సంఘం అధ్యక్షులు టేక్‌చంద్‌గార్ని, దివాకర్‌గారిని పిలిచి సమావేశపరచి, దేశాయ్‌గారికి ధైర్యం చెప్పండి అన్నారు. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఒకటి బయల్పడుతోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగారిని మినహాయిస్తే మరి ఏ యితర కాంగ్రెసు ముఖ్యమంత్రీ మద్యనిషేధానికి ఒప్పడం లేదు కాంగ్రెసు కార్య నిర్వాహక సంఘం టేక్‌చంద్ రిపోర్టు ప్రకారం నడుచుకోవలసిందని రాష్ట్రాలకు ఆజ్ఞాపించింది. 'కాని, తప్పనిసరి మాత్రం కాదు' అంటూ ముఖ్యమంత్రిగారు వ్యాఖ్యానమిచ్చారు!

ఈ కాంగ్రెసు కార్యనిర్వాహక సంఘం, భాషా విషయాన్ని కూడా చర్చించింది. వచ్చేవారం పార్లమెంటు సమావేశంలో అధికార భాషా బిల్లును ప్రవేశపెట్టి ఆ తర్వాత అందరికీ తెలియజేస్తామని కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజ్ అన్నారు. అంతవరకు అధికారభాషగాను, లింకు భాషగాను ఇంగ్లీషే వుంటుందన్నారు. అలా, శ్రీ దేశాయ్‌గారు రెండు సరదా గుర్రాల్ని స్వారీ చేశారన్నమాట!

పర్షియాలో ఒక సామెత వుంది. 'కాబాలో విగ్రహారాధన మొదలు పెట్టినట్టయితే ఇస్లాం ఏమయిపోతుంది' అని. దానికి సమాధానం ఏమిటీ అంటే ఇస్లాముకు అవే కడపటి రోజులు!

ఒక దేశం యొక్క ఆర్థిక పరిస్థితికి కూడా అదే ఇబ్బంది. ఇప్పటి భారత

దేశంగా అది దివాలా ఎత్తుతుంది. ఆర్థిక మంత్రి ఆశయాలు, ఆదర్శాలమీద నిలబడితే ప్రజల సొమ్ము కోట్లకు కోట్లు కొట్టుకుపోతాయి.

ముఖ్యమయిన ప్రాజెక్టుల అభివృద్ధి కోసం డబ్బులేదని దేశాయ్‌గారు ఒకవైపు చెబుతున్నారు. మరోవైపున రాష్ట్రాల్లో విద్యావ్యాప్తికోసం వినియోగించమని విద్యామంత్రికి 42 కోట్లు అప్పగించారు. ఇందులో అంతరార్థం వేరు. విద్యావ్యాప్తి పేరుతో హిందీని అందరికీ ఉపదేశించడం. న్యాయమంత్రుల సమావేశంలో మరో విషయం ఆయన సెలవిచ్చారు. 150 సంవత్సరాల వయసున్న న్యాయశాస్త్రాన్ని పునరుద్ధరించడంకోసం ఆర్థిక ఇబ్బంది ఉండదులెండి అన్నారాయన. మద్యనిషేధానికి కూడా డబ్బు ప్రశ్న రాదన్నారు. కోట్లకొద్దీ రూపాయల్ని ఖాదీని ఉద్ధరించడానికి కేటాయించారు. భారత ప్రభుత్వంలోని ప్యూన్‌లకి ఈ ఖద్దరు బాగా ఉపయోగపడుతున్నది!

మహాత్మాగాంధీగారు ప్రేమించినది ఒక్క మద్యనిషేధాన్నేకాదు ఖాదీ, హిందుస్థానీని కూడా అంతగానూ అభిమానించారు అని మాటీవలనే తెలిసింది! సత్యము, శాంతి ఆయన ఉపన్యాస సారాంశాలు. మొరార్జీ దేశాయ్‌గారు అవలంబిస్తున్న పారిశ్రామికీకరణ సిద్ధాంతాల్ని మహాత్ముడు మెచ్చలేదు. లూప్‌తో కుటుంబ నియంత్రణ అనేదాన్ని మహాత్ముడు ఆక్షేపించి వుండేవారు. ఇక్కడ ఒక సమాధానం రాని ప్రశ్న వుంది. గాంధీ ఆదర్శంలో ఇటువంటి విధానాలు కాంగ్రెసు వారికి ఎలా కనిపించాయో తెలియదు. ఇవన్నీ ఇతరుల డబ్బును దండగపరచే పనులు!

న్యాయమంత్రుల సమావేశంలో దేశాయ్‌గారు ఒక చక్కని ఉపన్యాసం ఇచ్చారు. 'ప్రజల్లో నూటికి తొంభయ్యొనిమిది మందికి అర్థంకాని భాషలో మన ప్రభుత్వ వ్యవహారాలు నడుస్తున్నాయి.' అన్నారు! మొరార్జీగారు వెనక్కి తిరిగి భారతదేశ చరిత్రను అవలోకించినట్టయితే మన పూర్వులయిన హైందవులు సంస్కృతాన్ని ఉపయోగించారు. ముసల్మానుల కాలంలో పర్షియా నుపయోగించారు. ఇవి రెండూ నూటికి తొంబయ్యొనిమిది మందికి అర్థంకానివే కదా!

హిందీవారిలో వెనకబడిన వారు హిందీయేతరుల్లో ముందున్నవాళ్లను వెనక్కి నెట్టడానికి చూస్తున్నారు. తెలుగు, బెంగాలీ,

న్యూఢిల్లీ లేఖ

అరవ, మలయాళభాషలకున్న సాహిత్య చరిత్ర హిందీకి లేదు. అది 'బ్రజ్' వాసుల వాడుక భాష. తులసీదాసు రామాయణాన్ని రచించినప్పటి నుంచి దానికి ఒక సాహిత్యం ఏర్పడింది. దీనిని పూర్వం 'బ్రజ్ భాష' అనేవారు. మధుర ప్రాంతంలోను, బ్రజ్‌లోను ఈ భాష వాడుకలో వుండేది.

ఆర్థిక రోగానికి మొరార్జీగారి మందు!

మరోచోట మొరార్జీగారు మెట్టు జారారు. ఆయన, ముప్ఫయినాలుగు కోట్ల రూపాయల్ని ప్రభుత్వోద్యోగుల జేబుల్లో కుక్కారు. ధరల్ని స్థిరపరుస్తామనే ఆయన సంకల్పం స్థిరపరచడం మాట దేవుడెరుగు. ధరలతోపాటు కరువుభత్యం కూడా గగన విహారం చేస్తోంది!

కేంద్ర మంత్రివర్గంలో గూడుపుఠాణీలు జరుగుతున్నాయి. వారం వారం ఎక్కడో చోట మంత్రులు గుమిగూడుతూనే వున్నారు. ఇవన్నీ దేశాయ్‌గార్ని కోలు వేయడనికే. ప్రాథమిక చర్యలు దేశాయ్‌గారికి అంత లాభదాయకంగా లేనట్లు తెలుస్తున్నది. ప్రభుత్వోద్యోగులకి కరువుభత్యాన్ని పంచడంతో ఆయన వేతన స్తంభనమీద ధరల స్తంభనమీద కబుర్లపై కామరాజ్‌గార్కి విశ్వాసం పోయింది.

కేంద్ర ఉద్యోగులతో దేశాయ్‌గారు నెగ్గుకు రాలేక పోయారా అంటే అందుకు సహమంత్రుల సహాయ నిరాకరణే కారణం. ప్రధానమంత్రి వాగ్దానం తర్వాత కొన్ని రోజులు ఆయన ఓపిక పట్టి వుండవలసింది! ఇక 'దేశాయ్‌గారి పునర్నిర్ణయ సూత్రం ధరల్ని అదుపులో వుంచుతుందంటే ఎవరు నమ్ముతారు?


ధరలు ధన పరిమితిని బట్టి వుంటాయని అందరికీ తెలుసు. ప్రభుత్వం ఈ డబ్బును ఎలా వుపయోగిస్తున్నదో ఎవరికీ తెలియదు. దఫదఫాలుగా ప్రభుత్వ వ్యయాన్ని పరిశీలిస్తున్న ఆర్థిక మంత్రిగారికి దాన్ని అదుపులో పెట్టడం దుస్సాధ్యమవుతోంది. సంవత్సరసంవత్సరానికీ ప్రభుత్వం ఖర్చు పెరిగిపోతున్నదని 'ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' స్పష్టపరచింది.

మూడవతరగతి గుమస్తాలను పనిలోకి తీసుకోవడంలో ఎటువంటి జాగ్రత్తలూ వహించడం లేదు. ఈ తెగగుమస్తాలమీద వృధాగా ఖర్చు తగులుతున్నది. వారికి పనీ వుండదు పాటూ వుండదు. ఆఫీసులకోసమనీ, ఉద్యోగస్థుల ఇళ్లకనీ బోల్డంత ఖర్చు వుండనే వుంటుంది.

ప్రధాన మంత్రి 'కుంభమేలా' మంత్రివర్గాన్ని నియమించడంతో ఇది తప్పనిసరి అయిపోయింది. వారిమీద దేశాయ్‌గారి పెత్తనం చెల్లదు. బ్రిటిషు భాషను తూలనాడుతున్నామేగాని, వారి మార్గంలోనే మనమూ నడుస్తున్నాము. ఒక్కో ఎగ్జిక్యూటివ్ కవున్సిలర్‌కి ఒకో పర్సనల్ అసిస్టెంటు, కదపరాని గృహోపకరణాలు వుంటున్నాయి. డిప్యూటీ మంత్రుల దగ్గర పెరేడ్ చేయడానికి పర్సనల్ ప్రయివేట్ సెక్రటరీ లుంటున్నారు. ప్రయివేట్ సెక్రటరీలకి అసిస్టెంటులు. వారికి టైపిస్టులు గుమస్తాలు. ఇలా చాంతాడులా పెరిగి పోయాయి ఉద్యోగాలు, వారి వారి కుటుంబ సమేతంగా సినిమాలు చూడ్డానికి కార్లు ఉపయోగపడుతున్నాయి. టెలిఫోన్లు బంధుమిత్రుల క్షేమసమాచారాల కోసం వినియోగపడుతున్నాయి. పన్నులు కట్టేవారి డబ్బుతో చిన్న మంత్రులయితే దేశంలోను, పలుకుబడి వున్న మంత్రులయితే విదేశాల్లోను పర్యటిస్తూ వున్నారు. కార్మిక మంత్రి జయ్ శుక్లాల్‌హాథీగారు రష్యా వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారు. ఆయన అక్కడి కార్మికుల యోగక్షేమాలు తెలుసుకుని దేశానికి తిరిగి వచ్చి కమ్యూనిస్టులకి సంతోషం కలిగించే పనులు కొన్ని చేస్తారు! పారిశ్రామిక అభివృద్ధి మంత్రిగారు మరో ఘనకార్యం నిర్వహిస్తారు. ఆయన శ్రీమతి గాంధీగారి స్నేహపాత్రులు గనక దారిలో నాసర్‌ని, మార్షల్ టిటోని కలుసుకుని పారిస్ చేరుకుంటారు. తిరిగి వచ్చేప్పుడు బ్రిటన్ సందర్శించి మాస్కో రూటులో ప్రేగ్ మీదుగా సంచారం చేస్తారు! కేంద్ర ఆరోగ్యమంత్రిగారి సంగతి సరేసరి. ఆయన రష్యాను ఎప్పుడో ప్రేమించారు! వాణిజ్య విదేశాంగశాఖామాత్యులయిన శ్రీయుత దినేష్‌సింగ్, చాగ్లా అండ్ కంపెనీవారికోర్కెల్ని ఎప్పుడో తీర్చుకున్నారు!

ప్రజలు వీటినన్నిటినీ కళ్ళారా చూస్తూనే వున్నారు. అయినా ప్రభుత్వం వెనక్కి తిరిగి తన ఖర్చును చూసుకోదు. పట్టించుకోదు! ●

మీతోపాటు మీ వెంటవచ్చేది



మీ యింటిలో మీతో వుండేది...



రెండూ హెచ్‌యంవి వారివే!
రెండూ దివ్యమైనవే!

హెచ్‌యంవి లేడీబర్డ్
సాటిలేని పోర్టబుల్ ట్రాన్సిస్టర్

10 ట్రాన్సిస్టరులు డయోడ్‌లు 3 వేవ్ బ్యాండులు శక్తి వంతమైన 5 అంగుళాల గుండ్రని హై ఫ్లెక్స్ లౌడ్‌స్పీకర్ సర్వసాధారణంగా లభ్యమయ్యే స్టాండర్డ్ బ్యాటరీలనే ఉపయోగించవచ్చు అందమైన ఆకృతి క్రోమ్ ఫినిష్ హేండిల్ మోడల్ 5765పై ధర రు 365/ ఎక్సైజు సుంకంతో సహా స్థానిక పన్నులు అదనం

హెచ్‌యంవి కాస్మోపాలిటన్
సూపర్ స్లిమ్‌లైన్ టేబుల్ ట్రాన్సిస్టర్

10 ట్రాన్సిస్టరులు డయోడ్‌లు 3 వేవ్ బ్యాండులు 7 అంగుళాల ఎలిప్టికల్, సూపర్ సెన్సిటివ్ హై-ఫ్లెక్స్ లౌడ్‌స్పీకర్. ప్రత్యేకంగా పిక్ అప్ కనెక్షన్ పుష్‌బటన్ వేవ్‌చేంజ్ ట్యూనింగ్/బ్యాటరీ ఇండికేటర్ ఇంటర్నల్ ఫెరైట్ ఏరియల్ మోడల్ 5766పై ధర రు 390/ ఎక్సైజు సుంకంతో సహా. స్థానిక పన్నులు అదనం

HIS MASTER'S VOICE

హెచ్‌యంవి ట్రాన్సిస్టర్‌లు

GC 207A TEL

విలియం మాంచెస్టర్

అధ్యక్షుని మరణం

16

'బెతెస్‌డా నావల్' ఆస్పత్రిలో ఒక గదిలో నుంచుని బయటి చీకటిలోకి చూస్తున్నది జీన్ కెన్నెడీ స్మిత్ పక్కన ఎవరో, 'ఆవిడ వచ్చింది,' అన్నారు నెమ్మదిగా తిరిగి చూడగా గది మధ్యలో జాక్వలీన్ కెన్నెడీ నుంచుని ఉన్నది

'ఈ దురదృష్టవంతురాలు, ఆ భయంకరమయిన పావడవేసుకుని మాటాడకుండా నుంచునిఉంది — సజీవంగా దహనమవుతున్నట్లు కనిపించింది,' అని వర్ణించాడు ఆ సంఘటనని 'న్యూస్ వీక్' పత్రిక విలేఖరి బెన్ బ్రాడ్లీ శ్రీమతి కెన్నెడీ ఏడుస్తూ వెళ్ళి అతని చేతుల్లో వాలిపోయింది అతను నెమ్మదిగా ఆమెని భార్య టోనీకి అప్పగించాడు టోనీ ఆమెని దగ్గరగా పొదివి పట్టుకుని, 'ఇదుగో వీ ఆమ్మ' అన్నది జాకీ దిగాలుపోయిన నవ్వుతో ఆమె వంక తిరిగి ఆమెని ముద్దుపెట్టుకుంది ఆవిడ, 'జాకీ! ఇంకా అతను కాలో చెయ్యో పోగొట్టుకుని పడిపోవటంకన్నా ఇలా అవటమే మంచిదేమో!' అన్నది

ఆ విధవ నాన్సీ టక్కర్‌మాన్‌ని కావలించుకుంది నాన్సీ టక్కర్‌మాన్ కొన్ని నెలల క్రితమే వయిట్‌హౌస్ సోషల్ సెక్రటరీగా నియమింపబడ్డది

'పాపం టక్కీ! న్యూయార్క్‌నుంచి ఇంతదూరం వచ్చావు, ఈ పనిలో చేరటానికి – ఇప్పుడంతా నాశనం అయింది ఏమిటో! అయినా నాతో కొంతకాలం ఉంటావు కదూ?' అన్నది నెమ్మదిగా శ్రీమతి కెన్నెడీ



జాన్ (జా), కరొలిన్ కెన్నడీలతో శ్రీమతి కెన్నడీ.

ఆమె వెనుక రాబర్ట్ కెన్నెడీ నుంచుని ఉన్నాడు 'ఎంతో దృఢంగా కనిపించాడతను. ఎంతో స్తబ్దుగా ఉన్నాడు జాకీని ఒక కంట కనిపెడుతూ ఉన్నాడు, అందరికీ ధయిర్యం చెపుతున్నాడు కాని తన పరిస్థితి మాత్రం ఏమి బాగున్నదని?.' అన్నాడు బ్రాడ్లీ తర్వాత

బాబ్ కెన్నెడీ జాకీని పిలిచాడు 'ఆపని చేసినవాడిని పట్టుకున్నారు కమ్యూనిస్టు అంటున్నారు'

ఆమె స్తంభించుకుపోయింది — అయ్యో భగవంతుడా అర్థంలేకుండా ఉందే? - అనుకున్నది తర్వాత డల్లాస్‌లోని ద్వేషం, ఆవేశం ఆమెకి జ్ఞాపకం వస్తాయి కాని అప్పుడు మాత్రం కడుపులో దేవినట్లయింది. మరణం కూడా అర్థరహితమయినదేనా? — అనుకున్నది బాధతో తల్లివయిపు తిరిగి, 'పౌర సామాజిక హక్కులకోసం అయినా హత్యచేస్తే కొంత సంతృప్తి మిగిలేదేమో?' అన్నది. 'ఎవరో కమ్యూనిస్టు చెయ్యాలా ఈ పని!'

జెనెట్ ఆకిన్‌క్లాస్ తన కూతురిని తనతోవచ్చి జార్జిటవున్‌లో ఉండమంది. కూతురు మాట్లాడలేదు శ్రీమతి ఆకిన్‌క్లాస్, 'పిల్లలు 'ఎన్' స్ట్రీట్‌లో ఉన్నారు తెలుసా?' అని అడిగింది

శ్రీమతి కెన్నెడీ ఆశ్చర్యపోయింది 'అక్కడెందుకున్నారు?'

'విమానంలోనుంచి కబురు పెట్టావుగా?'

'నేనేమీ కబురు పెట్టలేదే! ఈపాటికి వాళ్ళు పడుకుని ఉండాలి! ఇలా వాళ్ళ జీవితాలు నాశనమయితే ఎలా?'

శ్రీమతి ఆకిన్‌క్లాస్ మాడ్‌షాని పిలిచింది. కాని, ఆమె అప్పటికే సంగతి తెలుసుకుని తక్కినవాళ్ళకి కబురుపెట్టింది. సీక్రెట్ సర్వీస్ ఏజెంటు క్లింట్‌హిల్ టామ్‌వెల్స్ అనే ఏజెంట్‌కి టెలిఫోన్ చేశాడు.

'జాకీ పిల్లలకి నువ్వు చెప్తావా? లేనా లేకపోతే మిస్ షా చెప్పాలా?' మిసెస్ ఆకిన్‌క్లాస్ అడిగింది.

శ్రీమతి కెన్నెడీ తక్కినవాళ్ళని అడిగి చూసింది.

'జాన్‌కి తర్వాత చెప్పవచ్చులే . . కాని కారొలిన్‌కి మనమే ముందు చెప్పాలి, తర్వాత ఎవరో స్నేహితులు చెప్పటం కన్నా...' అన్నది శ్రీమతి ఆకిన్‌క్లాస్.

'అమ్మో! హఠాత్తుగా చెప్పేస్తే కారొలిన్ ఏమంటుందీ...' ఆమె ఒకక్షణం ఆలోచించింది. 'అమ్మో, నాకే చెప్పాలని ఉంది కాని మిస్ షా ఇష్టం!' ఈ విరయం మంచిదే అనుకున్నది శ్రీమతి ఆకెన్‌క్లాస్

నర్సుకి టెలిఫోన్ చేసింది. 'పిల్లలెలా ఉన్నారు?' అని అడిగింది,

'బాగానే ఉన్నారు, కొంచెం కంగారు పడినట్టున్నారు,' అన్నది 'కాని, ఆ వయస్సులో ఎటువంటి దెబ్బనయినా తట్టుకోగలరు. భోజనం అయింది కునికిపాట్లు పడుతున్నారు –' అన్నది

'కారొలిన్‌కి నువ్వే చెప్తే బాగుంటుందనుకుంటున్నది మిసెస్ కెన్నెడీ'

'వద్దండి! ఆ పనిమాత్రం నాకు పెట్టకండి,' అన్నది మిస్ షా బాధగా.

'గత్యంతరంలేదు. ఇంకెవరూ చెయ్యలేరు'

'అంత ధయిర్యంలేదు నాకు — ఆ అమ్మాయి మనస్సు పాడుచెయ్యలేను.'

'అవును, కాని చేసితీరాలి.'

'ప్లీస్, ప్లీస్ – ఇంకెవరినయినా అడగలేరూ?'

'లేదు, శ్రీమతి కెన్నెడీ మరీ దిగాలు పడిపోయిఉంది.' జాక్విలిన్ కెన్నెడీ తల్లికి తన కూతురిని ఇంకా కష్టపెట్టటం ఇష్టంలేదు. సంభాషణ అంతటితో ఆగిపోయింది. మిస్ షా జాన్‌ని పడుకోపెట్టింది.

ఇక కారొలిన్ మిగిలింది. మిస్ షా నెమ్మదిగా అన్నది, 'మీ నాన్నగారిని కాల్చేశారు ఆయనని ఆస్పత్రికి తీసుకువెళ్ళారు కాని డాక్టర్లు ఆయనకి నయం చెయ్యలేకపోయారు'


ఆ చిన్నపిల్ల ముఖాన్ని తలగడాలో దాచుకుని ఏడిచింది. మిస్ షా చేతులు నలుపుకుంటూ మంచం పక్కనే నుంచుంది పిల్ల నిద్రపోయేదాకా. తర్వాత కారొలిన్‌కి శాలువ కప్పి, జాన్ ఉయ్యాల మంచం దగ్గరికి వెళ్ళి అతనికీ శాలువ కప్పింది. ఈపని ముగిసిన పిదప తన గదిలోకివెళ్ళి ఒంటరిగా కూర్చుంది. (ఇంకా వుంది)



సొలిటెయిర్ దివ్యదృష్టితో నేను పెట్టిన బాంబు సంగతి కనుక్కొని పడవలో మిస్టర్ బిగ్‌తో చెప్తుందని భయపడ్డాను

'సొలిటెయిర్! నోరుమూసుకో! కంగారు పడకు!'


'త్వరలో రాబోయే మరణాన్ని గురించి ఆలోచిస్తూ ఉండండి నేను వెళుతున్నాను. ఎంతో సేపు కాకపోయినా, గుడ్‌నయిట్...'



'నన్ను గురించి దిగులుపడకు డార్లింగ్. నీతో ఉన్నాను, అదే చాలు. మరణం ఎంత దగ్గిరగా ఉన్నా నేనే భయపడను.'

మిస్టర్ బిగ్ మనిషి ఒకతను వచ్చి మా కాళ్ళ బందీలు తెగగొట్టాడు. మా చేతులింకా కట్టే ఉన్నాయి. కాని, వేళ సమీపించింది,

'నేనంటే ప్రేమేనా?'
తప్పకుండా, మన ప్రేమ వృధా కాదు...'



పొద్దు పొడిచే వేళకి మమ్మల్ని మిస్టర్ బిగ్ ద్వీపం మీద కొండ అంచుకి తీసుకు వెళ్ళారు...

కింద స్టీమరు బయలుదేరడానికి సిద్ధంగా ఉంది,

మిస్టర్ బిగ్ గడియారం వంక చూశాను, దొంగచాటుగా.
'వాళ్ళ బట్టలు కొన్ని విప్పెయ్యండి! సొర చేపలు వారి మాంసం చూడాలి!'



నన్నూ, సాలీటెయిర్‌నీ ఒక యాభయి అడుగుల తాడుకి కట్టారు. ఇద్దరినీ మిస్టర్ బిగ్ పడవకి కట్టి లాగుతారన్న మాట—చేపల గాలానికి ఎరలాగ

'వెళ్లండి!'

పడవ బయల్దేరగానే సాలిటెయిర్, నేనూ ఇద్దరం సముద్రంలోకి పడ్డాము.



'సాలిటెయిర్, గట్టిగా వూపిరి తియ్యి!'

సాలిటెయిర్‌ని నీటిలోకి తోసి నేను పయికి వచ్చాను, ఏమి జరుగుతోందో చూడడానికి...

అరవయి గజాల అవతల రాళ్లు — పడవ వెళ్లిపోతుంది కాని మమ్మల్ని పగడాల రాళ్ల మీదుగా లాగుతుంది. అవతల సొరచేపలు కాచుకుని ఉన్నాయి...



అనాలోచితంగా సాలిటెయిర్‌ని గట్టిగా పొదివి పట్టుకున్నాను. పగడాల రాళ్ల దగ్గిరకి వస్తున్నాము...

'సాలిటెయిర్! కాచుకో, రాళ్లొచ్చేశాయి...'

కాని, నేను పెట్టిన బాంబు ముందు పేలింది!

(ఇంకా ఉంది) ●

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

వై. జి, కడప

నాకు బద్ధకం జాస్తి. ఒక్కొక్కసారి చేయవలసినపని మించిపోతే, చేసి ఉంటే బాగుండును అని బాధపడతాను.

బద్ధకం మొద్దు నిద్దర వద్దు సుమీ అన్నది వినలేదా. కాలం బంగారు రెక్కలు కట్టుకు ఎగిరి పోతుంది. దాని వెనక పడ్డా మీరు అందుకో లేరు. అందుకే సకాలంలో పనులు చేయడం బద్ధకస్తులకి మొదట కష్టంగా తోచినా— అలవాటు చేసుకోండి.

వై. జి, కడప

నాకు బద్ధకంజాస్తి. ఏపనైనా చేయా లనుకొని వెంటనే కొంతసేపు ఉండి చేద్దాం అనుకొంటాను. ఈవాళకాదు రేపు అను కొంటాను. ఒక్కొక్కసారి చేయవలసినపని మించిపోతే చేసిఉంటే బాగుండును అని పిస్తుంది ఏంచేయను ?

సమయం మించిపోయాక బాధపడి ప్రయోజనం ఉండదని ఈపాటి గ్రహించే ఉంటారు. రేపు అను కోవడం మానేసి, కొంచెం బాధగా ఉన్న చేయవలసిన పని సకాలంలో చేయండి. మాట జారితే క్షమార్పణ చెప్పవచ్చు. కాలం చేతుల్లోంచి జారిపోతే ఏమీ చేయలేం

డి. ఎల్. ఎన్, తుమ్మిసి

ఏమంత్రి నేడు మన స్త్రీల ప్రవర్తనను గురించి మీ అభిప్రాయం ఏమిటి?

నేను దీనికి సమాధానం చెప్పనని భావించా రనుకుంటాను. నేటి స్త్రీల ప్రవర్తన కేం వచ్చింది? ఇంకా నిజం చెప్పాలంటే, కాలానికి తగినంత ధైర్యం చేయలేక పోతున్నారనే నా నమ్మకం.

పి. ఎ. ఎన్. పి, హైదరాబాద్

పదహారువందలమంది స్త్రీలతో కృష్ణుడు గడిపాడు అని చెప్పినందువలన మన పెద్దలు మనకు నేర్పిన నీతి ఏమిటో నాకు అంతు పట్టడం లేదు.

పదహారు వేలమంది గోపికా జనం శ్రీకృష్ణుణ్ణి తమ ధ్యేయం నుంచి మరలించలేక పోయారు. ఒక్క స్త్రీతోటి సంపర్కమే మానవుణ్ణి స్త్రీలోలు నిగా భార్యా విధేయునిగా చేసి స్వార్థపరునిగా మార్చే స్తుంది? అన్న నీతి బోధించడానికైనా, అయివుండాలి. లేదా, అధికస్య అధికం ఫలం, నవాబుగారిలా కాలం గడుపు అని తెలియచెప్పడానికైనా అయివుండాలి. ఏమంటారు ?

కె. ఎస్. కె, విజయనగరం

ఒక వ్యక్తి మంచి రచయితగా వెలుగొందా లంటే ముఖ్యంగా కావలసిన దేమిటి?

కృషి

ఎ. ఎస్. జి. భాన్స్వాడ

కుటుంబనియంత్రణ చేసుకొన్న ఎడల ట్రాన్సిస్టర్లు యిస్తున్నారని విన్నాను. నిజమేనా ?

ఉన్న పిల్లలకి సదుపాయాలు సమకూర్చి వృద్ధిలోకి తీసుకురావాలన్న కోర్కె కుటుంబ నియంత్రణకి పునాది కావాలి కాని ట్రాన్సిస్టరు కోసం కాదు తమ్ముడూ, అలా అయితే తరవాత బాటరీల కోసం ఏం చేయాలి?

ఎస్. ఎన్, బళ్ళారి

ఇటు పురాతన సంప్రదాయాలు కరడు కట్టుకొన్న తల్లి, అటు కొత్తగా కాపురాని కొచ్చిన భార్య. ఇద్దరికీ పొత్తు కుదరడం లేదు. ఏటూతేల్చి చెప్పలేని పరిస్థితిలో నేనున్నాను. ఏం చేయమంటారు ?

బాగుంది! ఇన్నాళ్ళూ 'అత్తింటి కాపురం కత్తి మీద సాము' అన్న సామెత కొత్త పెళ్లికూతురికే వర్తిస్తుంది అనుకున్నాను. కొత్త పెళ్లికొడుకులకి కూడానని మీ పరిస్థితి తెలియచేస్తోంది. విష్ యు గుడ్‌లక్!

ఎం. కె. ఆర్, కాకినాడ

మితభాషిగా ఉండుట మంచిదా ? చెడ్డదా?

వార్తలలో వనిత

మిస్ ఇండియా 1967 గా ఎన్నికై మియామిలో జరిగిన ప్రపంచ సుందరి పోటీలో పాల్గొనివచ్చిన కుమారి నయ్యరా మీర్జా ఈవారంలో మద్రాసు వచ్చింది. కల్చరల్ కంబైన్స్ వారు మద్రాసులో 'ఐబాంక్' స్థాపన



నిమిత్తం ఏర్పాటుచేసిన మ్యూజికల్ అండ్ స్టార్ నైట్ ప్రదర్శనలో కుమారి నయ్యరా మీర్జా పాల్గొన్నది.

లక్నోకి చెందిన కుమారి నయ్యరా మీర్జా తానింతకుముందు ఎప్పుడూ యిలాంటి పోటీలలో పాల్గొనలేదని మిస్ ఇండియాగా ఎన్నికవుతానని తాను కనీసం ఊహించనైనా లేదని అన్నది ఈమె వయస్సు 17 సంవత్సరాలు.

మిస్ ఇండియాగా ఎన్నికైన వ్యక్తి మద్రాసు రావటం యిదే ప్రప్రథమం. ప్రదర్శనలో 'ఇంతకుముందు మిస్ ఇండియాగా ఎన్నికైన, ప్రపంచ సుందరి పోటీలో నెగ్గిన కుమారి రీటా ఫరియాలా మీరుకూడా విదేశాలలో వివాహం నిశ్చయం చేసుకుని వచ్చారా?' అన్న అమీన్ సయానీ (రేడియో సిలోన్) ప్రశ్నకు సమాధానంగా 'నా కింతకుముందే శ్రీ వలీ బేగ్‌తో వివాహం నిశ్చయమైంది' అన్నది కుమారి నయ్యరా మీర్జా.

ప్రదర్శనలో ఆఖరిభాగంగా నిర్వహించిన సావనీర్ లాటరీలో గెలుపొందిన వారికి కుమారి నయ్యరా మీర్జా బహుమతులు పంచిపెట్టారు.

—తస్కర్

మితభాషిత్వం ఉత్తమోత్తమ గుణం తమ్ముడూ, చెడ్డదెలా అవుతుంది? మితభాషికి శత్రువులుండరు.

బి. ఎస్. ఆర్, అనకాపల్లి

నా తల్లితండ్రులు వివాహ విషయమై తొందరచేయకపోయినా నాకు వివాహం చేసుకోవాలని ఉంది .

ఆర్థికంగా ఇతరులపై ఆధారపడిన వ్యక్తికి వివాహానికి అర్హతలేదు. చదువు ముగిశాక సంపాదన ప్రారంభించాక తలపెట్టండి పెళ్లిమాట.

ఎస్. కె, హుజూర్‌నగర్

వ్యక్తుల మంచిచెడ్డలు గుర్తించకుండా అపవాదులు నెత్తిన రుద్దేవారిని ఏమనాలి ?

లోకం.

పి. ఎస్. కె. ఆర్, ఒంగోలు

తమ స్వార్థానికి ఎదుటివారి జీవితాన్ని బలిపెట్టుటకు వెనుదీయని ఆత్మీయులని విడనాడుట నేరమా?

మీ స్వార్థం కోసం ఆత్మీయులని ఎడచేసి తప్పించుకుపోవడం దోషం అవుతుంది గాని ఇది ఎందుకవుతుంది? బలి ఇస్తారని తెలిస్తే గొర్రె తాడు తెంచుకు పరుగెత్తదా?

ఎస్. ఎల్, అంగలూరు

నేటి యువతీయువకుల పాశ్చాత్యానుకరణపై మీ అభిప్రాయం?

తప్పేంలేదు అనుకరణ ఎప్పటికేనా ఒరిజినాలిటీకి దారి తీస్తుంది.

ఆర్. బి. యు, కొత్తపల్లి

నాగరికత అంటే ఏమిటి? నాగరికులకు సంఘంలోగల స్థానం ఏమిటి?

సభ్యమానవ జీవన విధానమే నాగరికత. సభ్యమానవులుగా గణన కెక్కడమే నాగరికులకు సంఘంలో గల స్థానం

వి. వి. ఆర్. ఆర్, ఖర్గపూరు

నన్నుచూసి అసూయపడేవారంటే నాకెందుకో జాలి. కారణం ఏమిటి అక్కయ్యా?

అది జాలికాదు తమ్ముడూ గర్వం అనాలి.

బి. హైదరాబాదు


అక్కయ్యా, స్త్రీ కన్నులలోగల ఆకర్షణ శక్తి పురుషుని కన్నులలోలేదు. ఎందుకు?

అది నువ్వెలా చెప్పకలవు భీమా !

ఎ. ఎ, గుంతకల్లు

జీవితాన్ని ఎంతో అందంగా ఆదర్శప్రాయంగా గడపాలంటే ఎలా? అందరికీ సాధ్యపడుతుందా?

ఆదర్శప్రాయంగా అంటే 'సినిమాలో లాగా' అనా మీ ఉద్దేశ్యం? అదయితే సాధ్యపడదను కుంటాను! ●



ఎవరు ఉత్తమ భక్తులు

బులుసు వేంకటరమణయ్య

తక్కిన మహామునులకంటె నారదుడికే భగవానుడైన శ్రీకృష్ణునిదగ్గర చనవు ఎక్కువ. నారదుడిమీద కృష్ణభగవానుడికీ అభిమానం ఎక్కువే!

తనమీద శ్రీకృష్ణునికి ఉండే యీ అభిమానానికి నారదుడు మనస్సులో పొంగిపోయేవాడు. తనను మించిన భగవద్భక్తులు ఎవ్వరూ లేరనే అభిప్రాయమున్నూ అతనికి కలిగింది

నారదుని అభిప్రాయం శ్రీకృష్ణునికి తెలియదా? తెలుసును తెలిసి, తన మనస్సులోనే ఆయన నవ్వుకున్నాడు.

ఏ బాదరబందీలేని మునులు తన్ను ధ్యానిస్తూ మహాభక్తులు కావడంలో ఆయనకు విశేషం కానరాలేదు సంసారంలో కొట్టుమిట్టాడుతున్నవారు ఏదో సమయం చూచుకుని తనను ధ్యానించడం గొప్ప విశేషంగా ఆయనకు తోచింది గృహస్థులైనవారే ఉత్తమ భక్తులని శ్రీకృష్ణుని అభిప్రాయం

ఒకసారి శ్రీకృష్ణుని దర్శించడానికి వచ్చినప్పుడు ఉండబట్టలేక నారదమహర్షి అడిగేశాడు—ఎవ్వరు ఉత్తమ భక్తులో చెప్పవలెనంటూ.

'ఎందుకీ ప్రశ్న? నీ కంటె ఉత్తమ భక్తులు ఎవరుంటారయ్యా? నువ్వే మూడు లోకాల్లోనూ ఉత్తమ భక్తుడవు—' అంటూ చిరునవ్వుతో శ్రీకృష్ణ పరమాత్మ దగ్గర నుంచి సమాధానం వస్తుందని నారద మహర్షి ఆశించాడు.

శ్రీకృష్ణుడు వెంటనే దీనికి జవాబు చెప్పలేదు.

'ఆ సంగతి తర్వాత చెప్తానుగాని, ఇప్పుడు నువ్వు ఒక చిన్నపని చెయ్యాలి అది యెంతో జాగ్రత్తగా జరగవలసినపని' అన్నాడు భగవానుడు.

'చిన్నపనేకాదు, ఎంత పెద్దపని చెప్పినా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను' అన్నాడు మహర్షి:

అప్పుడు శ్రీకృష్ణుడు ఒక చిన్న పాత్రను తెప్పించి, దాని నిండుగా — అంచుల మొయ్యా నూనె పోయించి, ఆ గిన్నెను నారదుడికి చూపి 'నువ్వు యీ పాత్రను పట్టుకొని, యీ వూళ్ళో నాలుగు వీధులూ తిరిగి రావాలి. తిరిగేటప్పుడు నూనె తొణికి ఒక బిందువైనా నేలమీద పడకూడదు. పాత్ర పైభాగంనుంచి జారకూడదు. ఈ పనిమాత్రం చేసిరా, తర్వాత సంగతి చెప్తాను' అన్నాడు.

'ఏదో అసాధ్యమైనపని చెప్తావని అనుకున్నాను. ఇదేనా చెయ్యవలసింది? చాలా సులభంగా ఊరు తిరిగి వస్తాను' అని నారదుడు పలికి ఆ పాత్రను తీసుకున్నాడు.

తీసుకుని అక్కడినుంచి బయలుదేరాడు.

అంచుల మొయ్యా తైలం ఉన్నందున— అది తొణకకుండా పట్టుకొని నడవడం కొంత కష్టమే అనిపించింది.

దారిలో మలుపులు తిరుగుతూ వుండాలి. దృష్టి అంతా పాత్రంమీదనే కేంద్రీకరించి ఉంచాలి. వచ్చేపోయే జనాన్ని తప్పించుకుంటూ వెళ్ళాలి ఎవరిదేహం అయినా తనకు తాకితే చాలు. నూనె ఒలికిపోతుంది. అడుగుల్లో అడుగులు వేసుకుంటూపోవాలే గాని, తొందరగా నడవకూడదు ఎదురుగా వచ్చే వాహనాలనూ, మనుషులనూ తప్పించుకొని నడవడంలోనే వున్నది శ్రమ అంతా. అతని మనస్సు నూనెమీదనే ఉంచవలసి వచ్చింది. ఎలాగయితే నేమి, ఎంతో శ్రమపడి, అనుకున్నదానికంటే ఎంతో ఎక్కువకాలమే ప్రయాణంచేసి తిరిగి శ్రీకృష్ణ భగవానుని సన్నిధి చేరుకున్నాడు, నారదుడు.

ఆ తైలపాత్రను ఒకచోట ఉంచి దీర్ఘ నిశ్వాసాన్ని విడుస్తూ, కృతకృత్యుడైనట్లు కూలబడ్డాడు.

శ్రీకృష్ణుడు నవ్వుతూ 'ఏమిటి, మహర్షీ! చాలా శ్రమపడినట్లున్నావే యీ పని చెయ్యడానికి!' అన్నాడు.

'ఏదో నబ్బా! ఇది చాలా చిన్నపనే అని అనుకున్నాను కాని నాతాడు తెంచిందనుకో. ఎంతో శ్రమ అయింది. చాలా మంచిపనే చెప్పావు' అన్నాడు.

'ఏమిటీ? అంతకష్టమని అనిపించినదా?'

'నువ్వు ఆగిన్నె పట్టుకుని నాలుగడుగులు వేస్తే నీకే తెలుస్తుంది నేను వివరించనక్కర్లేదు.'

'పోనీలే! ఆ సంగతి అలా వుండనీ! అసలు సంగతికి వద్దాం. ఉత్తమ భక్తుడు ఎలా ఉండాలని నీ అభిప్రాయం! సర్వకాల సర్వావస్థలయందూ భగన్నామ స్మరణచేస్తూ ఉండవలెననే కదా!'

'దానికి సందేహమేమీ?'

'నువ్వు సదా భగవన్నామ స్మరిస్తూ వుంటావు కదూ!'

'ఆ సంగతి నీకు తెలియదా, భగవన్! నన్నడగాలా?'

'ఇప్పుడు నీవు తైలపాత్రను పట్టుకుని ఊరు తిరుగుతున్నప్పుడు ఎన్నిమాట్లు స్మరించావు?'

నారదుడీమాటకు చకితుడైనాడు. నిజానికి అతడు ఒక్కసారి కూడా స్మరించలేదు.

'నాదృష్టి అంతా తైలపాత్రమీదనే కేంద్రీకరించబడింది. నూనె తొణకకుండా చూసుకోడంతోనే నాపని తీరింది. అప్పుడు నిన్ను స్మరించడానికి అవకాశం ఏదీ?'

(62 వ పేజీచూడండి)

శ్రీమతి పరిమళా సోమేశ్వర్

మీ భార్య ఎలా ఉండాలి?

పెళ్ళిచూపులకని వెళ్ళివచ్చిన అన్నయ్య చుట్టూ అంతా జేరాం 'అమ్మాయి ఎలా ఉంది? అందంగా ఉందా, యావరేజ్‌గా ఉందా? బి. ఏ. ప్యాసయింది కదా 'స్టైల్'గా ఉందా లేక హోమ్లీగా ఉందా?' లాటి అతి సామాన్యమైన ప్రశ్నలన్నీ వేస్తుంటే విసిగిపోయి 'అబ్బ! ముందో రెండుగ్లాసుల మంచినీళ్ళు తాగనీయండే. మీ రడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధాన మిస్తాను' అన్నాడు అన్నయ్య.

అందరికంటె చిన్నదైన సరళను మంచినీళ్ళు పట్రమ్మని ఆజ్ఞాపించింది అమ్మ.

అది ఏడ్చుకుంటూ, లోలోపల మమ్మల్నందరినీ తిట్టుకుంటూ వంటింట్లోకి పోయి జగ్గునిండా నీళ్ళు, గ్లాసుతెచ్చింది—మళ్ళీ ఎక్కువ నీళడిగితే ఎక్కడ పోవల్సి వస్తుందోనని.

మంచినీళ్ళు తాగి, చెప్పటం మొదలెట్టేడు అన్నయ్య దాని సారాంశం యిది. 'అమ్మాయి 'బాగా' ఫైర్‌గా లేదుట. ఓమాదిరిగా ఉంది. బి. ఏ. చదువుకున్నా అలంకరణవిషయంలో 'అమ్మమ్మ'లా ఉందిట. తను అడిగిన ప్రశ్నలకు మొదట్లో మంచిగానే సమాధానమిచ్చిందట గాని పోనుపోను తల తిక్కగా జవాబు చెప్ప సాగిందట. కట్నం కూడా ఆరువేలకంటె ఎక్కువిచ్చేట్టు లేరు.' ఇలా చెప్తూ తన అసంతృప్తిని వెల్లడించేడు అన్నయ్య ఇక మా అన్నయ్య క్వాలిఫికేషన్సు ఏమిటో చూడండి మా అన్నయ్యని నేనేం మొహమాటపడను. తను నల్లగా ఉంటారు. ముఖంలో కూడా కనీసం 'కళ' గాని ఏ రకమైన ప్రత్యేకత గాని లేదు. ఎత్తు ఐదడుగుల నాలుగంగుళాలు. ఉన్నది బీకాం డిగ్రీయే అయినా మా నాన్నగారి స్నేహితుడి కంపెనీలో ఓ మంచి ఉద్యోగం దొరకటంవలన నెలకు నాలుగువందలదాకా సంపాదిస్తున్నాడు. అడపాదడపా 'చెయ్యి తడి' అవుతూంటుందనుకోండి. అది వేరేవిషయం. ఇలాటి యువకునికి 'ఆరువేలు' ఏమాత్రం తృప్తి నివ్వటం లేదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు ఈ రోజులలా ఉన్నయ్.

మా అన్నయ్యే కాదు యీ రోజు వేలాది భారత యువకుల ధోరణి యీ రకంగానే ఉంటోంది. అమ్మాయి అందంగా ఉంటే చదువు తక్కువంటారు. అందం చదువు రెండూ ఉన్నా కట్నం చాలదు. అదృష్టవశాత్తూ యీ మూడు సమకూరినా ఆమె మనస్తత్వం తనకి పడదు. ఇలా ఆలోచించుకుపోతూ చివరికి తనకి నచ్చే స్త్రీ యీ భూప్రపంచంలో ఉండదనే నిశ్చయానికి వచ్చేస్తున్నారు. చివరికి ఇన్ని గొంతెమ్మకోరికలూ పెట్టుకుని యీ కోరికలకి విరుద్ధంగా మరొకామెను వివాహమాడి జీవితాంతం బాధపడుతూనే ఉంటారు.

అసలు సూక్ష్మంగా పరిశీలిస్తే వీళ్ళ కోరికలు ఎంత అర్థహీనమైనవో వాళ్ళకే తెలుస్తుంది. తన భార్య అందంగా ఉండాలని ప్రతి యువకుడూ కోరుకుంటాడు, అందులో తప్పేం లేదు. కాని అందానికి నిర్వచనం ఏమిటి? కొందరి దృష్టిలో అమ్మాయి తెల్లగా, సన్నగా పొడుగ్గా ఉంటే చాలు. ముఖం ఎంత కళాహీనంగా ఉన్నా అందంగానే ఉందంటారు. మరికొందరికి రంగు, ఎత్తు, లావు ఎలా ఉన్నా ముఖంలో అందమైన 'ఫీచర్సు' ఉంటే చాలనుకుంటారు. మరికొందరి దృష్టిలో యివేం

మందులు పడకపోతే?

కొన్ని మందులు మీకు పడకపోవచ్చు. అంతమాత్రాన అవి మీకు 'ఎల్లర్జీ' (ఇతర గుణాలు) వచ్చేట్టు చేస్తాయను కోవటం పొరపాటు.

విపరీతమైన ఎల్లర్జీ ఉంటే చర్మం మీద దురదలు, పొక్కులు, పగుళ్ళు రావచ్చు, లేదా ఉబ్బసం రావచ్చు.

ఎట్రోపిన్, బెల్లడోనా వంటి మందులు నాలుక ఎండిపోయేటట్టు చేస్తాయి. ఏంటీ హిస్టమిక్ మందులు వాడితే మత్తుగా ఉంటుంది. ఈ గుణాలని కూడా 'మన మేలు కొరకే' అనుకోవచ్చు. తల దిమ్ముగా ఉంటే ఏంటీ హిస్టమిక్ మాత్ర వాడవచ్చు. లేదా నిద్ర పట్టకపోతే వాడవచ్చు.

పెద్ద మోతాదులో ఏ మందు తీసుకున్నా విషమే. మామూలు ఉప్పు అయినా సరే. కాని ఎన్నోమందులు మనం గమనించే 'ఇబ్బంది' కలిగించే దాకా పని చెయ్యవు. ఉదాహరణకి ఏస్పిరిన్ తింటే చెవులకి గింగురుమనే దాకా గుణం కలగకపోవచ్చు. కొల్చిసీన్ పుచ్చుకున్న తర్వాత వికారం, విరేచనాలు రావాలి.

కొన్ని జంతువులు మందులు తిని ఆవేశం ప్రదర్శిస్తాయి. 'మార్ఫిన్' తింటే గుర్రాలు, పిల్లులు ఇంకా చురుకు అవుతాయి! కొందరు మనుషులు కూడా ఇంతే.



జి.

మీకు ఏదైనా మందు పడకపోతే జాగ్రత్తగా గమనించి గుర్తు ఉంచుకోండి. ఎప్పుడు ఏ డాక్టరు ఏ మందు ఇచ్చినా ఈ సమాచారం అవసరం అయితే అతనితో స్పష్టంగా చెప్పండి.

హెచ్. ఎల్. హెరన్‌సోన్ (కాపీరయిటు)

లేకపోయినా చూడగానే కళకళ లాడే ముఖం కనిపిస్తే చాలు. ఇంకా కొందరికి రూపం ఎంత సామాన్యంగా, ఉన్నా చురుకుదనం మంచితనం గల అమ్మాయి కావాలంటారు కాబట్టి వీటన్నిటినీ పరిశీలించి చూస్తే అందం అనే పదానికి 'మనసుకు నచ్చినది అనే నిర్వచనం తప్ప మరొకటి అతకదనిపిస్తోంది.

'జిహ్వకో రుచి' అన్నట్లు ఒక్కొక్క మనిషికి ఒకొరకమైన అందం నచ్చుతుంది ఇక పెళ్ళి చూపులకు వెళ్ళే యువకులు చూడగానే కొట్టవచ్చినట్లు కనపడే అమ్మాయిలే కావాలనుకోవటం అత్యాశేకాదు హాస్యాస్పదం కూడా అవుతుంది. అంతేకాక తమ భార్యలు ఎంత అందంగా ఉండాలో కోరుకునే ముందు తమ రూపం ఎలాటిదో కూడా కాస్త యువకులు ఆలోచిస్తే మంచిది. 'ఆ అమ్మాయి కూడా తనలాటిదే కదా తనకి ఆమె నచ్చినంతమాత్రాన ఆమెకు తను నచ్చవద్దా ?' అన్న యీ ప్రశ్నను పెళ్ళిచూపులకు వెళ్ళే యువకుల్లో ఎంతమంది వేసుకుంటున్నారు ?

ఇక చదువు సంగతి. ఈ రోజుల్లో చదువుకున్న అమ్మాయిని పెళ్ళాడటం ఒక 'గ్లామర్' అయిపోయింది చదువంటే వీళ్ళ దృష్టిలో పట్టి 'డిగ్రీలే' సుమండీ! ఈ డిగ్రీల 'మానియా' ఎంతవరకు పోతోందంటే ఆఖరికి 'పీయూసీ ఫైల్డ్' కూడా గ్రాడ్యుయేట్ అయిన భార్య లభిస్తే బాగుండునని కోరుకొంటున్నాడు. మనసులో

మీ భార్య లెలా ఉండాలి?


నేటి విద్యావిధానం ప్రకారం డిగ్రీలు అవసరమన్నమాట నిజమే. కాని ఏ మనిషికయినా కేవలం ఒక పుస్తకాలలోని అక్షరాలు చదవగలిగినంతమాత్రాన చాలదు. వాటిలోని అంతరార్థాన్ని గ్రహించే హృదయసంస్కారం కూడా ఉండాలి. అప్పుడే అతను నేర్చిన విద్య సార్థకత చెందుతుంది. ఇంగ్లీషు చదువులు వచ్చినంతమాత్రానే మీ భార్య చదువుకున్నదనుకోకండి. తెలుగులో భారత రామాయణాలు చదివి టీకా తాత్పర్యాలతో సహా మీకు వివరించగలిగినప్పుడు ఆమె విజ్ఞానం ముందు తెలుగు ఎం. ఏ. డిగ్రీలు కూడా వీగిపోవలసిందే. మరి కొంతమంది కట్నంకోసమో, మరే యితర కారణాల వల్లనో తక్కువ చదువుకున్న అమ్మాయిని చేసికొని ఆ తరువాత నలుగురికీ తన భార్య కూడా 'ఎడ్యుకేటెడ్' అని చెప్పుకోవటానికి ఆమెచేత ప్రైవేటుగా చదువులు చదివిస్తున్నారు. ఆ అమ్మాయికి చదువుమీద ఆ మాత్రం ఉత్సాహం, ఉంటే పెళ్ళి ముందే చదివేసి ఉండేది. తమ భర్త కోరికలను కాదనలేకో, లేదా వాళ్ళ మూలంగా నిజంగానే తమని చదువురాని వాళ్ళని జనం ఎక్కడనుకునిపోతారో నన్న భయంచేతనో నానా కష్టాలుపడి డిగ్రీలు సంపాదిస్తున్నారు.

పెళ్ళయిన తరువాత తమ భార్యలకు డిగ్రీలు తెప్పించాలని తాపత్రయ పడేవాళ్ళందరికీ ఒక చిన్న సలహా. మీ డిగ్రీల వ్యామోహంతో సున్నితమైన ఆమె శారీరకారోగ్యాన్ని, నిర్మలమైన ఆమె మనసును అనవసరంగా నొప్పించకండి. అంతగా డిగ్రీల మీద మోజు ఉంటే కాస్త ఆలస్యంగానైనా అవి ఉన్న స్త్రీనే వివాహమాడండి కాని మధురమైన ఊహలతో, ఏవేవో సుందర స్వప్నాలను కంటూవచ్చిన మీ వధువు ముందు అరకరాని కొయ్యలైన పాఠ్య గ్రంథాలను పడేసి ఆమెనో 'రుబ్బురోలు'గా మాత్రం తయారు చెయ్యకండి.

ఈ కాలం యువకుల మరో ముఖ్యమైన కోరిక 'కట్నం' అనాదిగా భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో యీ 'కట్నం' అనే రెండక్షరాల పదం వివిధ రకాలుగా ప్రజల నైతికజీవితాన్ని చీడపురుగులా తొలుస్తూనే ఉంది. ఇప్పుడే కాదు, మరికొన్ని యుగాలు గడిచినా యీ కట్న పిశాచం భారతీయులను వదిలిపెట్టదని ఘంటాపథంగా చెప్పవచ్చు. అంతగా అయితే యీ వరకట్నం అనేది 'కన్యాశుల్కం' లాగా రూపాంతరం చెందుతుందేమోగాని దీనికి నశింపనేది లేదు. ఎందుగల దండు లేదనే సందేహం కూడా లేదు.

దీనికి కారణా లెన్నైనా చెప్పుకోవచ్చు. మనది పేదదేశం కావటంవలన ప్రతివాడికీ డబ్బంటే ఆశ కాని యీ కారణం పూర్తిగా నిజం అనటానికి కూడా వీల్లేదు. ఎందుకంటే బాగా స్థితిమంతులు కూడా తమ అంతస్థుకి తగ్గట్టుగా ముట్టజెప్పమంటున్నారే తప్ప 'ఇంతఉంది. ఇంకా మాకెందుకు' అనే వ్యక్తి కనపడటంలేదు. ఇదంతా చూస్తుంటే మన నైతిక దృక్పథంలోనే ఎక్కడో లోపం ఉందనితోస్తోంది ఒక్కో సంఘాన్ని ఒక్కో జాడ్యం పట్టుకు పీడిస్తూ ఉంటుంది. కనీసం విద్యాధికులైన యువకులన్నా యీ జాడ్యాన్ని వదిలించుకుని ఆరోగ్యవంతులు కావాలని ప్రయత్నించకపోతే ఎలా?

ఇక భార్య మనస్తత్వం గురించి 'మనస్తత్వం' సరిపడకపోవటం అనే వాక్యం తరచూ వింటూంటాం ఆధునికదంపతుల్లో. ఈ సరిపడకపోవటానికి చాలావరకు భర్తలే బాధ్యులని నా ఉద్దేశ్యం. చింతకాయపచ్చడిని చీదరించుకునే భర్తకి కాకరకాయ కూర సరిపడని భార్యని చూస్తే తగవి



కోసం. తప్పిపులునుపడని భార్యకు ఇంగువ వాసన గిట్టని భర్తని చూస్తే మహా ఆశ్చర్యం! ఇదంతా తమని గురించి తప్ప ఎదుటి వ్యక్తి అభిరుచులను, అవసరాలను గుర్తించలేని అహంభావంవల్లనే జరుగుతోంది అలాగే సర్వా పురుషుడు తన భార్య క్లబ్బుకు రావటానికి సిగ్గుపడుతుంటే చిరాకుపడకూడదు ఆమె మనస్తత్వం ఆమె పుట్టి, పెరిగిన వాతావరణం ఆమె నందుకు ప్రోత్సహించకపోవచ్చు. అంత మాత్రాన తన భార్య 'అన్ సివిలైజ్'డని విచారించనక్కర్లేదు. దంపతులు సుఖంగా ఉండాలంటే వాళ్ళ రుచులు, అభిరుచులు ఒకటే అయిఉండాలన్నా ఎదుటి మనిషి నర్థం చేసికోగల ఓపిక, సహృదయత ఉంటే చాలు.


విద్యావతియైన భార్య గల పురుషులు నేర్చుకోవలసిన మరో ముఖ్యవిషయం కూడా ఉంది ఇది కొంచెం ఘాటుగా ఉండవచ్చు కాని, నెమ్మదిగా ఆలోచిస్తే వాళ్ళకే అర్థం అవుతుంది. ఇలాటి పురుషులు తమ కారును, అందమైన సోఫా సెట్టును, మేడను చూసి మురిసిపోయినట్లు చదువుకున్న భార్యని

మీ భార్య లెలా ఉండాలి?

కూడా ఒక నిర్జీవమైన వస్తువుగా తమ ఆస్తిలో ఒక భాగంగా భావించి ఆనందిస్తుంటారు. అంతే తప్ప అంత చదువుకున్న స్త్రీలో ఆలోచనలు, ఆవేశాలు, వ్యక్తిత్వంలాటివి ఉంటాయన్న భావమే రాదు వాళ్ళకు.

పైగా యిరవయ్యో శతాబ్దపు నాగరికతను ఇంకా పూర్తిగా జీర్ణించుకునే స్థితికి రాలేదు భారతీయులు. నాగరికత అంటే తన మిత్రుడి భార్య తనతో సర్దాగా కబుర్లు చెప్పాలనే అంటారు తప్ప తమ భార్యమాత్రం పద్దెనిమిదో శతాబ్దపు హిందూ స్త్రీలా వంటయింటోనుండి కాఫీలు పంపి పర పురుషుడి దృష్టిలో పడకూడదని భావిస్తారు ఒకవేళ తనకోసం వచ్చిన మిత్రులతో నాలుగుమాటలు మర్యాదగా మాట్లాడితే చాలు సగం చచ్చిపోతారు పురుషులు పైగా తనకేం అభ్యంతరంలేదు కాని తన మిత్రులు పరస్త్రీని సహృదయంతో అర్థం చేసుకునేంత సంస్కార హృదయులు కాకపోవచ్చు నన్న సందేహం వెలిబుచ్చుతారు ఇది తాము చేసుకునే ఆత్మవంచనకు ఒక మారుపేరు మాత్రమే.

ఇరవై సంవత్సరాలు దాటి, ఉన్నత విద్య నభ్యసించి వివాహమైన ఒక యువతి పర పురుషుడితో మాట్లాడినంతమాత్రానే ఏదో అపవిత్రమైన, అసహజమైన విషయం జరిగిపోయినట్లు బాధపడనక్కర్లేదు. మన సంస్కారం గొప్పది కానప్పుడు ఎదుటివాళ్ల సంస్కారం కూడా అల్పంగానే కన్పిస్తుంది. మీరు మీ మిత్రుల భార్యలతో మాట్లాడేటప్పుడు ఆవిడను గురించి గౌరవమైన భావమేదీ కలగదా మీలో? మీరు పర స్త్రీని అంత పవిత్రంగా చూస్తున్నపుడు మిత్రులు మీ భార్యను మరోలా అర్థం చేసుకుంటారని ఎందుకనుకోవాలి? వేషభాషల్లో, భావాల్లో ఆధునికత నింపుకున్న మీ భార్యకి మాత్రం కనీసపు స్వాతంత్ర్యం ఇవ్వకపోవటం ఆమెని, ఆమె నైతికపద్ధతిని కించపరచినట్లు కాదూ? స్వాతంత్ర్యం అంటే విచ్చలవిడిగా వదిలి సినిమాలకు, క్లబ్బులకు ఒంటరిగా, బాధ్యతారహితంగా పంపమని కాదు. చిన్న చిన్న విషయాల్లో కూడా అనవసరమైన 'స్ట్రెయిన్'ని క్రియేట్ చేయ్యవద్దనే నా సలహా! ●



గేట్ వే ఆఫ్ ఇండియా
ఫొటో: శ్రీ ఆర్. పి. జస్వాల్, నిషిరాబాద్.

వంటలు:

గుమ్మడికాయ సూప్

గుమ్మడికాయ	సుమారు అరవీసె
నెయ్యి	6 చంచాలు
పాలు	3 కప్పులు
పిండి	2 చంచాలు

మిరియం, ఉప్పు.

గుమ్మడికాయ తోలుతీసి ముక్కలు తరిగి; ఉడకపెట్టి వడకట్టాలి జల్లెడమీదరుద్ది గుజ్జు తియ్యాలి. పిండి వెన్న కలిపిఉంచాలి.

పాలు, గుజ్జు, ఉప్పు, మిరియం చేర్చి బాగా కలపాలి.

వేడిచేసి తాగాలి! కొందరు ఆకు పచ్చ రంగు కలిపి తాగుతారు. —ఎ. వి. ●

గురు మంత్రోపదేశం

రామానందుడంటే అందరికీ భక్తి, గౌరవమూ. ఆయన ఎక్కడికి వెళ్ళినా జనం వంగి నమస్కరించేవారు, ప్రణమిల్లేవారు. ఒకనాడు ఉదయం ఆయన ప్రాతఃస్నానానికని గంగానదికి వెడుతున్నాడు. ఆయనకి మొక్కని మనిషి లేడు — ఒక్కడు తప్ప. ఇతను దారి మీద పడుకుని ఉన్నాడు. రామానందుడు అతనిని దాటివెడుతూ, అలా దాటి వెళ్ళినందుకు చింతిస్తున్నట్లు తెలుపటానికి 'రామ్, రామ్' అన్నాడు. వెంటనే ఆవ్యక్తి లేచినుంచుని, తర్వాత రామానందుడి కాళ్ళ మీద పడి అతని పాదాలకి తనతల అన్చి మళ్ళీ లేచినుంచుని పారిపోయాడు—'రామ్, రామ్' అని అరుస్తూ.

ఆనాటి నుంచి ఈమనిషి తను రామానందుడి శిష్యుడినని చెప్పుకోటం మొదలుపెట్టాడు. తనకి రామానందుడే స్వయంగా 'గురుమంత్రం' ఉపదేశించాడని చెప్పుకునేవాడు. ఇది విన్నకొందరు కలవరపడ్డారు ఎందుకంటే ఇతను మహమ్మదీయుడు! అతనిపేరు కబీర్. తురకవాడికి గురుమంత్రోపదేశం ఏమిటి? అనుకున్నారు. వెళ్ళి రామానందుడితోనే తమ సందేహాల గురించి చెప్పుకున్నారు. రామానందుడు కబీర్‌కోసం కబురుపెట్టాడు. తను విన్నదాని సంగతేమిటని అడిగాడు. 'స్వామీ! నేను చెప్పినదాంట్లో అబద్ధంలేదు! నేను మీ శిష్యుడినే! మీరు 'రామ్! రామ్' అన్నప్పుడేనాకు మంత్రోపదేశం చేశారు. నేను మహమ్మదీయుడిని కాబట్టే నన్ను స్వీకరించరేమోనని భయపడ్డాను, దారిలో అడ్డంగా పడుకున్నాను, మీరు దాటినప్పుడు 'రామ్ రామ్' అన్నమాటలు వినగలిగాను,' అన్నాడు వినయంగా.

ఈ సమాధానం రామానందుడిని కదిల్చివేసింది: కబీర్‌ని కవుగలించుకున్నాడు. 'మహమ్మదీయుడవయినా నా శిష్యులలో ఒకడివి' అన్నాడు.

కబీర్ 1140 లో ఒక బ్రాహ్మణ వితంతువుకి పుట్టాడు. ఆమె లోకానికి భయపడి పిల్లవాడిని వదిలి వెళ్ళిపోయింది. పిల్లవాడు నీరకా అనే మహమ్మదాయ సాలెవానికి దొరికాడు. నీరూ దంపతులు ఈపిల్లవాడిని ఎంతో ప్రేమతో పెంచుకున్నారు.

చిన్నప్పటినుంచీ కబీర్‌కి భక్తి ఎక్కువగా ఉండేది. అందుకనే రామానందుడి శిష్యుడయిపోయాడు వైష్ణవమతాభిమాని అయ్యాడు తర్వాతతనే ఈమతాన్ని అందరికీ చాటాడు. ఆకాలంలో వైష్ణవ సిద్ధాంతాలకి కబీర్‌ని మించిన ప్రచారకుడు లేడనుకునేవారు.

కబీర్‌ని హైందవులు, ముసల్మానులు కూడా ఎంతో గౌరవించేవారు. కబీర్‌ది శుద్ధభక్తి సిద్ధాంతం. కులమత విభేదాలు, సన్యాసం, కర్మకాండ, షడ్దర్శనాలు, ఉపవాసం — వీటన్నిటినీ కబీర్ ఖండించాడు. భగవంతుడిమీద భక్తి ఒకటే మానవుడికి అవసరం అని బోధించాడు. మోక్షానికి భక్తిఒకటే మార్గంఅని చాటాడు. దేవుడు ఒకడే ఉన్నాడు. హైందవమతంలోని, కట్టుదిట్టాలకి విసిగిపోయిన ఎందరికో కబీర్ బోధనలు ఎంతో ఆకర్షవంతగా కనిపించాయి.

కబీర్ చెప్పినదంతా నోటిమాటతోనే చెప్పాడు. కొన్నివేల ద్విపదలు, కీర్తనలు, పద్యాలు అతను చెప్పినవేనని నేటికీ చలామణి అవుతున్నాయి. సిక్కుల ఆదిగ్రంథ్‌లో కబీర్ సూక్తులు ఎన్నో ఉన్నాయి.

హైందవ మహమ్మదీయమతాల మైత్రికి కబీర్ ఎంతో తోడ్పడ్డాడు.

—ఎస్.

క్రూరమయిన గోవులు!

ఎలుకలవల్ల, పక్షులవల్ల, ఇతర వన్యమృగాలవల్ల పంటలు నాశనమవుతూ వుంటాయి. ఉచ్చులువన్ని, విషాల నుపయోగించి, కాల్చి చంపడంద్వారాను వాటిని హరింప చేస్తూవుంటాము. ఇప్పుడు మహారాష్ట్రంలో ఖండేష్ జిల్లాలోని పొలాలకు పెద్ద సమస్య వచ్చిపడింది. క్రూరమయిన ఆవులు దండులుదండులుగా పొలాలమీద పడి పంటల్ని నాశనం చేస్తున్నాయి! వీటిని 'వన్యగోవు'లని అక్కడివారు పిలుస్తున్నారు ఈ ఆవులు చాలా బలిష్టంగా వుండి, క్రూరంగా వ్యవహరిస్తున్నాయి క్రూరజంతువుల్లో చేరిపోయిన ఈ ఆవులు మనుషుల్ని ఇట్టే మట్టుపెడుతున్నాయి. ఇవి వంద, రెండువందలు సామూహికంగా వచ్చి పొలాలమీదపడి పంటల్ని ధ్వంసం చేస్తున్నాయి మన హిందువుల దృష్టిలో ఈ ఆవులన్నీ చాల పవిత్రమయినవి, చంపకూడనివీను. అందువల్ల మహారాష్ట్ర ప్రభుత్వం క్లిష్టమైన సమస్యలో ఇరుక్కున్నది. వీటిని పట్టుకున్న వాళ్లకు బహుమతులిస్తామని ప్రకటించారు. కొందరు ప్రవీణులు ముందుకు వచ్చారు. అయితే, పట్టుకున్నవాటిని చంపడానికి వీలులేదు. ఉంచడానికి బందిఖానాలు తగినన్నిలేవు. ఒకటీ రెండూ అయితే ఫరవాలేదు. లెక్కకు మించినవాటి సంరక్షణ ఎట్లా? — ఇది ఇప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వానికి తీరని సమస్యగా వుంది. ఎవరైనా తగిన సలహా నిచ్చి ఈ సమస్యను పరిష్కరించడానికి పూనుకోవచ్చు.

—వి సు.

ముగ్గురుమూర్ఖుల పిల్లలకథ

మహేష్



'నేనొక పూల మొక్క కడ నిల్చి చివాలున కొమ్మ వంచి' అని పాడుకొంటూ ఒక కుర్రవాడు యేటిగట్టుమీదనుంచి పోతున్నాడు.

'విన్నావా? ఆ పాట. అందులో పూల మొక్క అంటూ ప్రారంభించిన కవి 'కొమ్మ వంచి' అన్నాడు. వంచడం అంటే మీదుగా ఉన్న దాన్ని దిగువకు లాగడం అటువంటప్పుడు ఆ 'పూల మొక్క' కొమ్మలు వంచవలసినంతగా యెదిగితే అది చెట్టు అవుతుంది కాని మొక్క కాదుగదా!' అంటూ తన సందేహాన్ని వెలిబుచ్చాడు చిదంబరం.

'కొమ్మ వంచి' అన్నాడుగాని 'కొమ్మ యెక్కి' అనలేదు. 'కొమ్మ వంచి' అన్నప్పుడు అది మొక్క అయినా కావచ్చును. కాని 'కొమ్మ యెక్కి' అని అంటే అది మాత్రం ఖచ్చితంగా చెట్టే అవుతుంది. అయినా, సినిమాతారలకు యెంత వయస్సు వచ్చినా దానితో నిమిత్తం లేకుండా యెప్పుడూ 'అమ్మాయి' అని అనిపించుకోవడం లేదా? అలాగే 'పూల మొక్క' యెంత యెత్తుగా యెదిగినా దానితో నిమిత్తం లేకుండా యెప్పుడూ అది 'మొక్క'గానే వుండిపోతుంది. కవుల విషయంలో యిలాంటివి పట్టించుకొనకూడదంటూ పద్యాన్ని సమర్థించాడు చంద్రరావు..

'నువ్వు దీన్నిగురించే యిలాగ అంటున్నావు' అంటూ చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'ఆంధ్ర కవితాపితామహుడు అల్లసాని పెద్దన మాత్రం యీ పోయేడా? అతను రచించిన మనుచరిత్రలో వరూధిని తన విరహవేదనలో చంద్రుని దూషిస్తూ —

'గాండీవము నీ చేతిది పాండవునివే చేరబట్టి'

'గోవధము సేయు తురకల దైవంబవు' అంటూ పాండవుల్ని, మహమ్మదీయులను ప్రస్తావిస్తుంది.

వరూధిని అంటే స్వారోచిషమనువుకు మామ్మ అవుతుంది. స్వారోచిష మనువు మనువుల్లో రెండవవాడు. ఇప్పుడు యేడవదైన వైవస్వత మన్వంతరంలో యిరవై యేడు మహా యుగాలు గడచిన తరువాత యిరవై యెనిమిదవ మహాయుగం తాలూకు

కలియుగంలో యిప్పటికి 5068 సంవత్సరాలు గడిచాయి. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం వాలుగూ కలిసి మహాయుగం అవుతాయి.

	సంవత్సరాలు
కృతయుగం	17,28,000
త్రేతాయుగం	12,96,000
ద్వాపరయుగం	8,64,000
కలియుగం	4,32,000
మహాయుగ ప్రమాణం	43,20,000

శ్లో॥ యత్ ప్రాగ్ద్వాదశ సహస్రం
ఉదితం దైవికం యుగం
తదేక సప్తతిగుణం
మన్వంతర మిహోచ్యతే ॥

అని మనుస్మృతిలో చెప్పబడింది అంటే యిలాంటి మహా యుగాలు 71 కలిసి మన్వంతరం అవుతుంది. ఇలాంటి ఆరు మన్వంతరాలకు పూర్వం అనగా సుమారు నూట అరవై కోట్ల సంవత్సరాలకు పూర్వమందున్న వరూధిని కేవలం అయిదువేల సంవత్సరాలకు పూర్వమందున్న పాండవులను ప్రస్తావించింది. అలాగే కేవలం పధ్నాలుగు వందల సంవత్సరాల వయస్సు కలిగిన మహమ్మదీయ మతాన్నికూడా పేర్కొన్నదంటే మనం యేమైనా తప్పుపట్టేమా ?

'ఒక్క పెద్దన్నే కాదు, పోతన మాత్రం యీ విషయంలో తీసిపోయేడా'? అంటూ చూడామణి తిరిగి చెప్పడం ప్రారంభించేడు

'పోతన తను రచించిన భాగవతంలో ప్రహ్లాదుని వర్ణిస్తూ యిలాగ అంటాడు

'కన్ను దోయికి అన్యకాంత లడ్డంబైన
మాతృభావముసేసి మరలువాడు'
'కామినీ ప్రముఖ భోగము లెన్ని గలిగిన
వ్యసన సంసక్తి నావంక బోడు'

'ప్రహ్లాదుని వయస్సు అప్పటికి అయిదు సంవత్సరాలే. పంచశరద్వయస్కుడవు అని స్పష్టంగా తనే పేర్కొన్నాడు. అటువంటప్పుడు అక్షరాభ్యాసమైనా కాని ప్రహ్లాదునికి ఏ కాంతను చూసినా మాతృభావనే కాని మరోభావన యెలా కలుగుతుంది?'

'పోనీ యీ వర్ణన అంతా యువకుడైన ప్రహ్లాదుని గురించేనని మనం వాదనకోసం అనుకొందాం. అప్పటికీ కూడా హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని పంపమని కోరినప్పుడు కూడా ప్రహ్లాదుని 'కామరోష లోభాది విరోధివర్గ పరిహారకు'డని వర్ణించాడు.

'పోనీ యిక్కడ కూడా కామం అనే దానికి కేవలం కోరిక అనే అర్థాన్ని మనం అంగీకరించినా కూడా మరొకచోట పోతన రచించినది యెలాగ సమర్థనీయమో మనకు బోధపడదు.

'లీలావతి గర్భిణియై యుండగా హిరణ్యకశ్యపుడు తపస్సుకు వెళ్లేడు. ఆ సమయంలోనే లీలావతిని యింద్రుడు చెరపట్టగా, నారదుడు ఆమెను రక్షించి గర్భస్థుడైన ప్రహ్లాదునకు విష్ణుభక్తిని బోధించడం వగైరా జరిగాయి. హిరణ్యకశ్యపుడు నూరు దివ్యసంవత్సరాలు తపస్సు చేశాడు.

'ఈ క్రియ నూరు దివ్యసంవత్సరముల్ శరీరమున, వాయువులన్ నిలుపంగవచ్చునే'

'హిరణ్యకశ్యపుడు తపస్సునుంచి తిరిగి వచ్చేసరికి, ప్రహ్లాదుని వయస్సు కొంచెం తక్కువగా నూరు దివ్యసంవత్సరాలు ఉండవద్దా? అప్పటికే ప్రహ్లాదుని వయస్సు అయిదు సంవత్సరాలు మాత్రమేనని అంటే మనం యేమైనా తప్పుపట్టేమా? అందుకనే కవయః నిరంకుశాః అని అన్నారు పెద్దలు' అని చూడామణి అన్నాడు

'సరే? యీ విషయాన్ని యిప్పటికి వదిలేసి మన రచన సంగతిని ఆలోచిద్దాం. 'ఆశీర్న మస్క్రియా వస్తు నిర్దేశోవాపి తన్ముఖం'. రచనకు ముందు ఆశీర్వాదంగాని, నమస్కారంగాని, వస్తు నిర్దేశంగాని చేయడం ఆచారం అన్నారు పెద్దలు. ఇప్పుడేం చేద్దా'మని ప్రశ్నించాడు చిరంబిరం.

'వస్తు నిర్దేశం చేయడానికి మనం యే విషయాన్ని గురించి చర్చిస్తామో యిప్పుడే చెప్పలేము. ఆశీర్వాదం చేయడానికి మనం మతగురువులం కాము అందుచేత నమస్కారమే చేయాలి. ఈ నమస్కారం చేయడంలో కూడా ఒక చిక్కు ఉంది. ఏ హిందూదేవతనైనా నువ్వు స్తోత్రం చేస్తున్నట్లుగా రాస్తే మన లౌకికరాజ్యాంగం దెబ్బ తింటుంది' అంటూ చూడామణి చెప్పడం ప్రారంభించాడు.

'సత్యం, శివం, సుందరం' అని చాలా కాలంనుంచి మనవాళ్లు వాడుతున్నారు. 'శివం, భద్రం, కళ్యాణం మంగళం శుభం' అని అమరకోశంలో ఉంది శివం అంటే శుభం అని అర్థం. అయినా శివం అంటే హిందూదేవుడైన ఈశ్వరుడని ప్రమాదకరమైన అర్థం కూడా రావచ్చును' దానివల్ల మన శెక్యులరిజం దెబ్బ తింటుందని మాజీ విద్యాశాఖామంత్రి కీ. శే. మౌలానా అబుల్ కలాం అజాద్ దాన్ని 'సత్యం, శాంతం, సుందరం' అని మార్పించాడు. అందుచేత దైవప్రార్థన గురించి యిందులో రాయడం మంచిది కాదని తేల్చేశాడు చూడామణి.

'ఆచారం అన్నంతమాత్రాన దేన్నీ మనం విధిగా పాటించనక్కరలేదు. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్ని కూడా మనం గమనించాలి. లేకపోతే పిల్లుల వ్యవహారంలాగ తయారవుతుంద'న్నాడు చంచలావు.

ఏమిటా పిల్లుల వ్యవహారం? అని చిదంబరం ప్రశ్నించగా చంచలావు చెప్పడం ప్రారంభించాడు.

పిల్లుల కథ

ఒక ఊళ్లో ఒక పెద్ద కుటుంబం ఉండేది. ఆ యింట్లోనే రెండు పిల్లులు ఉండేవి. అవి పెంపుడు పిల్లులు కావడం వలన మనుష్యులంటే యేమాత్రం కూడా భయంలేకుండా పిల్లలను పెద్దలను కూడా అవి రాసుకొంటూ తిరుగుతుండేవి. ఎవరైనా కూర్చుంటే అవి ఒక్కొక్కప్పుడు యెగిరి వాళ్ల ఒళ్లో కూర్చొనేవి.


ఆ యింట్లో మడి కట్టుకొనేవారికి యీ పిల్లులవల్ల యిబ్బందిగా ఉండేది. అందుచేత తద్దినం పెట్టవలసిన రోజున పొద్దున్నే యీ రెండు పిల్లుల్ని దొడ్లో కట్టివేసి మధ్యాహ్నం భోజనాలైన తరువాత వాటిని వదిలేస్తుండేవారు.

కొంతకాలం అయినతరువాత ఆ కుటుంబంలో ఉండే పెద్దలు చనిపోయేరు. మరి కొంతకాలానికి ఆ పిల్లులు కూడా చచ్చిపోయేయి తరువాత ఆ కుటుంబంలో తద్దినం పెట్టవలసివచ్చినప్పుడు ఆ యింట్లో వాళ్లు 'మా ఆచారం' అంటూ వీధివీధినీ తిరిగి కష్టపడి రెండు పిల్లుల్ని పట్టుకొని దొడ్లో చెట్టుకు కట్టివేసి తరువాత తద్దినపు కార్యక్రమాన్ని ప్రారంభించేవారు కొన్ని ఆచారాలు యిలాగే తయారయ్యాయి!' అన్నాడు చంచలావు.

'దైవప్రార్థన అనగానే నాకు మరొక విషయం జ్ఞాపకం వచ్చిందంటూ చిదంబరం చెప్పడం ప్రారంభించాడు.

(64 వ పేజీ చూడండి)

సీరియల్



తాడిగిరి పోతరాజు

జరిగిన కథ

వెంకట్రామయ్యగారు ఓ హైస్కూలు సంస్థాపకులు ఆయన కుమారుడు మధు వారింట్లో పెరిగిన అనాథ ప్రసాద్ ఆ స్కూల్లో పనిచేసే హెడ్మాష్టరు కామయ్య ఆయనకు ఆప్తమిత్రులు ప్రసాద్ తనని గుర్తించక పోవడంతో అంతకంతకు మధుకు దగ్గరవుతూ వుంటుంది కామయ్య మాష్టరమ్మాయి శారద గ్రామంలో పంచాయతీ ప్రెసిడెంటు ఎన్నికకోసం ఏర్పాటుజరుగుతుంది ప్రత్యర్థి వర్గంలోని కామయ్యమాష్టరి మీద శివరామయ్య నిందలు మోపి, స్కూల్లోనుంచి తొలగిస్తాడు ఆయన పాత ఉత్తరాలు తిరగేస్తూండగా వెంకట్రామయ్య రాసిన ఉత్తరం కనిపిస్తుంది అది చదివి కర్తవ్యాన్ని గుర్తుతెచ్చుకుని శారదను ప్రసాద్‌తో వివాహానికి అంగీకరించ మంటాడు మధు శారదను తనతో వచ్చెయ్యమని ప్రోత్సాహపడతాడు శారద ప్రయాణానికి సిద్ధమవుతుండగా ప్రసాద్ వస్తాడు

[illegible]

24

ఆ గదిలో నిశ్శబ్దత ఆవరించింది

ఇద్దరూ మూగనోముపట్టి కూర్చున్నారు

బయట—గాలి హోరు—వర్షం—గాలితో ఘర్షణ పడుతోంది

ఆమె కుళ్ళికుళ్ళి ఏడ్వసాగింది

'భామా — కనిపించటం లేదేం?' అతనన్నాడు

'నాకు అడ్డులేకుండ చేసికోవటానికై నేనే బయటికి పంపాను నేను పాపిష్టిదాన్ని—ప్రసాద్ ' అంటూ ఆమె పెద్దగా ఏడ్వసాగింది

వెలుగుతూన్న విద్యుద్దీప తోరణాలు ఒక్కసారే ఉధృతమైన పెనుగాలికి ఆరిపోయి నడుస్తూన్న దారి కనుమరుగైపోయినట్లని పించింది

ప్రసాద్ ఆమె కళ్ళల్లోకి తీక్షణంగా చూశాడు—రెప్పలు పైకెత్తుకొని రెప్పలార్చుకొంటూ ఆమె అతనికేసి చూసింది వ్యథాపూరితమైన ఆకళ్ళు జలజల లాడుతున్నాయి

'నేను గ్రహించాను శారదా! ఈటబ్బులు సర్దుకోవటం—ఇవన్నీ ఎందుకో? విషయాలను కొదిగా దూరదృష్టితో ఆలోచించు'

'లేదు ప్రసాద్ నేను 'మధు'నిముందు వెళ్ళమని చెప్పాను నాకోసం స్టేషన్‌లో ఎదురుచూస్తుంటాడు '

'శారదా! నీవు చదువుకొన్న దానివి పరిస్థితులను అర్థం చేసికోగలవ్. నీవిలా సాహసించటం '

'అవును. నాకు తెలుసు—నాకు తెలియక కాదు నేను అశక్తురాలిని'

'శారదా! నామాట విను మీ ఇద్దరి సుఖాన్నీ నేను హృదయ పూర్వకంగా కాంక్షిస్తున్నాను మీ ఇద్దరినీ ఒక్కచోట చేర్చే బాధ్యతనాది శారదా! కానీ వెళ్ళటానికిప్పుడు సమయంకాదు మీ నాన్నగారు తలపెట్టిన మనపెళ్ళి నేను ఏదోవంకతో నేను ఆపు చేయించుతాను '

ఆమె ముఖంలో ఏదోఅర్థం కాని భీతి తొంగిచూసింది

'మరి 'మధు' పెళ్ళి ఎలా అవుతావ్? . అది నీచేతుల్లో లేదుగా?'

'మనసులో ఒకటి పెట్టుకొని మరొకటి మాట్లాడుతున్నాననుకోకు 'మధు'ని ముందు వెళ్ళమని చెప్పివస్తాను నేను ఒక్క వారంరోజుల్లో నిన్ను నేను అతని వద్ద దిగవిడిచి వస్తాను నన్ను నమ్ము శారదా? మీ రిద్దరూ సుఖంగా వుండేలా నేను చూస్తాను నేను అసూయతో నిన్ను మోసం చేస్తానని అపోహపడవద్దు . '

దైర్యంతో కూడిన అతని కళ్ళలోకి ఆమె అలానే చూసింది

అతని చూపులు ఆమెను దీనంగా అర్థిస్తున్నాయి తనచర్యను గర్హిస్తూ ప్రతిమాలుతున్నాయి ఆ చూపుల్లో అసూయ—పగ ఈషణ్మాత్రంకూడ లేవు

ఆ అమృతమూర్తి నిష్కళంక హృదయం ముందు ఆమె మనసు ప్రణమిల్లింది ఏదో తీవ్రమైన అపరాధం చేసినట్లు కళ్ళలో పశ్చాత్తాపం కనిపించింది

'లేదు ప్రసాద్ ఆలాటి మాటలనకు నీ హృదయం నాకుతెలుసు నన్ను మరీ బాధించకు నీవెంత మంచివాడవో నాకు తెలుసు కానీ నేనంటే నీకు ' కనురెప్పలు వాల్చుకొని నేలపైకి చూడసాగింది మాటలు తెగిపోయినట్లు తీవ్రమైన ఆలోచనాముద్ర ఆమె ముఖంపై స్పష్టంగా కనిపించింది

'నీవే నన్నిలాచేశావ్? నీ మూలంగానే నేనిలా అయిపోయ్యాను నన్ను నిర్లక్ష్యంతో నీవే దూరంచేశావ్ నీ దృష్టిలో నాకున్న విలువ ఏమిటో గుర్తించాకనే నేనిలా అయిపోయ్యాను కానీ నీవంటే నాకెంతో అభిమానం ప్రసాద్' ఆమె ముక్కుపుటాలు ఎగిసిపడ్డాయి

హృదయ దుర్బలత్వంతో తాను ఏమి మాట్లాడుతుందో తనకే తెలియనట్లు ఉబ్బిన కనురెప్పలను తుడుచు కొంటూ ప్రక్కకు తిరిగి వానకేసి చూస్తూ అతనిని నిందించసాగింది

బయట వర్షం నిమ్మళించింది గాలి మాత్రం విసరివిసరి తోలుతోంది బజార్లన్నీ ఆకు అలంతో నిండిపొయ్యాయి. వానలోనే సంధ్య చీకట్లు ముసురుకోసాగాయి

'నే నెలాటి నిర్భాగ్యుడనో నీకు తెలుసు

కారదా!...తండ్రి ఎవరో తెలియదు...తల్లి నన్ను ఈ ఊరి సత్రం అరుగుపై విడిచి పెట్టి కన్ను మూసింది...నా జన్మను గూర్చిన గాయం నా గుండెల్లో ఇంకా సెలవేస్తూనే ఉంది...నేను నా తల్లిని క్షమించలేక పోయ్యాను ... నన్ను ఇతరుల దయాదాక్షిణ్యాలపై వదిలి తను వెళ్ళిపోయింది ... నా దవుర్భాగ్య జీవితంపట్ల ఈ ఊళ్ళో అందరూ సానుభూతి చూపుతారు ... జాలి ప్రకటిస్తారు...నా పట్ల నీకున్న అభిమానం కూడ ఈ లాటిదే...'

అతను తొణుకు బెణుకు లేకుండ నిష్ప్రహతో కూడిన కంఠంతో పలికాడు.

ఆ అభియోగంతో, ఆమెగుండెల్లో రక్తమంతా ఒక్కసారి పైకి చిమ్ముకొచ్చినట్లు ముఖమంతా ఎర్రగా మండుకొంది. ఒక్క క్షణకాలం కళ్ళు ఉజ్వలంగా మెరిశాయి. ఆ మెరుపులో ఎన్నో ఆలోచనలు క్రిక్కిరిసి కనిపించాయి.

'కాదు...ముమ్మాటికీ కాదు ... నీవు 'సెంటిమెంటల్'గా మాట్లాడకు ... నేను ఆవేళ...నీవు పుట్టినరోజు...నేను ప్రేమ పూర్వకంగా నీకు 'టై' బహూకరించాను... నీవు ఆవేళ నన్ను అవమానించావ్!...నేను మరచిపోలేదు...నేనంటే నీకు'...ఆవేదనతో వక్షస్థలం ఎగిసిపడింది.

ప్రసాద్ చేతిని గట్టిగా పట్టుకొని మునిమాపు చీకట్లలో నల్లగా వికృతంగ కలసిపోతూన్న కొండకేసి దీర్ఘంగా చూస్తూ ఆమె తన మనసు ఇసుకపై నడిచిపోయిన అడుగుజాడలను పరిశీలించుకొని పోల్చుకో పోగింది.

'అవును...ఆ వేళ దసరాపండుగనాడు 'మధు'ని చూశాక నీ కలా బుద్ధిపుట్టిందని నీవే ఒప్పుకొన్నావ్! ... అతనితో నన్ను పోల్చి నీవు మాట్లాడినప్పుడు నీ కళ్ళల్లో నీ మనస్సు నాకు కనిపించింది.. నీ మనస్సు అతన్ని కోరుకొంది...కానీ బుద్ధిపూర్వకంగా దాన్ని నావైపు మళ్ళించటానికి ప్రయత్నించావ్?.. నాలో 'మధు'ని చూడటానికి నీవు ఉబలాటపడి దాన్ని నాకు బహూకరించావ్'...

అతని గంభీర కంఠస్వరానికి ఆమె చకితురాలైపోయి చప్పున ప్రక్కకు తిరిగి చూసింది.

అతను నిశ్చలమైన నిర్మలమైన చూపు



మట్టి బొమ్మలు

అతో అలానే తనను చూశాడు!

ఎవరిదో అదృశ్య హస్తం తన హృదయం వైపు వేలెత్తి చూపుతున్నట్లు నన్నని బాధ గుండెల్లో నుండి దూసుకుపోయింది. తన జీవితాన్ని తానే వ్యాఖ్యానించుకొన్నట్లు—అంతర్ముఖురాలై తన హృదయంలోకి తానే తొంగి చూసికొంటున్నట్లు తలవంచుకొని గుండెల్లోకి చూసికోసాగింది. ఆమె మనసులో అంతరాంతరాలలో అనేక సంగతులు తనను కలచివేయసాగాయి.

తన తండ్రి... చెల్లి... ప్రసాద్... ఇల్లు... అంతా కళ్లముందు తిరుగసాగింది. ముఖం మళ్లీ వివర్ణమైపోయింది. పెల్లున దుఃఖం ముందుకు వచ్చింది.

'ఏమో... ఇవన్నీ... నాకు తెలియదు... ఇప్పుడు నన్నేం చేయమంటావ్?.. నేను వెళ్ళొద్దా?... చీకటి పడుతోంది?.. ఏమిటీ ఈ వాన... ఈ చీకటిలో నేనొక్కర్తినే ఎలా వెళ్లను?'...

మాటలు అస్తవ్యస్తంగా ఉన్నాయి.

భయం భయంగా చుట్టూ వ్యాపిస్తున్న చీకటిలోకి తేరిపార చూసింది.

ఆశల్లా మెరుపులు

ఆశాభంగంలా ఉరుము — ఒళ్ళు జలదరించింది.

చీకటిముసుగులో కలిసిపోయిన ఇళ్ళు... సంజదీపాలు అక్కడక్కడ మిణుకుమంటున్నాయి. రోజూ చూస్తున్న దృశ్యాలే ఆమెకు భీతిగొలిపాయి. అవ్యక్తమైన భయంతో దుఃఖంతో మంచంపై వాలిపోయి ముఖానికి చీరె చెరుగు కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

వాళ్ళను కౌగలించుకొంటూన్న చీకటిలో వాళ్ల ముఖాలు అస్పష్టంగా లీలగా మాత్రమే కనిపించసాగాయి.

అతను ఆమెను ఓదార్చటానికి ప్రయత్నించలేదు. ఓ నిమిషంసేపు మౌనంగా కూర్చున్నాడు—తెప్పలు— తెప్పలుగా కురుస్తున్న వానకేసి చూస్తూ.

'ఇష్టం లేకపోతే చెప్పివెయ్యకూడదూ?...ఎందుకు మాస్టారికిలా శ్రమ కలిగించావ్?...నీవు కాదంటే ఆయన బలవంతాన నన్ను నీ మెడకు కట్టరు గదా?'

ఆ ప్రశ్నవలన ఆమెలో తన తండ్రిని గూర్చిన ఘర్షణకలిగి భయంతో మరింత కుంచించుకు పోయింది! ముఖంపై కప్పుకొన్న చీరెచెరగు తొలగించుకోకుండా తడి ఆరిపోతున్న గొంతుతో.

'అవును... ముందుగానే చెప్పివెయ్యాల్సింది...కానీ ... కానీ ... నీవే చెబుతావని పించింది ... అందువలన నేను చెప్పలేదు'... అరది.

పెళ పెళమని ఉరుము ఉరిమింది.

'నేను చెబుతానను కున్నావా?'... అతను నిర్ఘాంత పొయ్యాడు క్షణకాలం.

'మాస్టారు నన్ను ఈ విషయంలో నా అభిప్రాయమే అడుగలేదు...విన్నడిగినట్లు... బహుశా ఆయనకు అంత అవసరమనిపించి ఉండదు...సరే ఇప్పుడు నీవు ఎలా నిశ్చయించుకొన్నావ్'...

ఆమెతో మాట్లాడటంలో తను చాలా జాగ్రత్త వహించాడు. ఏమాట ఆమె హృతయాన్ని గాయపరుస్తుందోనని జాగరూకత వహించినట్లు కంఠం ధ్వనించింది.

ఆమెలేచి మోకాళ్ళమధ్య తల ఇరికించుకొని కూర్చుని కన్నీరు కార్చసాగింది. ఈ సాహసంయొక్క అంతిమ ఫలితం ఎంత భీభత్సంగా ఉంటుందోనని ఆలోచించసాగింది.

ఏమీ దృఢ సంకల్పంలేనట్లు స్థిమితంగా నిట్టూర్పులు విడుస్తూ కొన్ని నిముషాల పాటు అలానే కూర్చుంది - చీకటిలో.

'నీ మాటలు నిర్లక్ష్యం చేస్తున్నానను కోకు ప్రసాద్—ఇప్పుడు నేను కుత్తుక బంటివరకూ ఊబిలో దిగబడిపొయ్యాను... నన్ను ఈ ఊబిలోనుండి పైకి తియ్యటానికి ప్రయత్నించకు...నాకు దీనివలన దుఃఖమే మిగులుతుందో-ఆనందమే మిగులుతుందో?.. దేన్నయినా అనుభవించటానికి నిశ్చయించుకొన్నాను.' అంటూ లేచి నిలబడింది.

'అయితే—త్వరగా బయల్దేరు ... 'లాస్ట్ బస్' 'మిస్' అవుతుంది.

'ఈ వర్షంలో—చీకటిలో నేనొక్కర్తినే వెళ్లలేను...నాకేమిటో వణుకుపుడుతోంది.' బాగ్ ఒకచేతితో అందుకొని వాకిటినుండి బయటికి చూస్తూ—భయంతో కంపించిపోసాగింది.

'లేదు... నేను గుంటూరువరకూ వచ్చి దిగవిడుస్తాను ... పద...' అంటూ ఆమె చేతిలో బ్యాగ్ అందుకొని వర్షంలో అడుగు పెట్టాడు. ఆమె అతనిని అనుసరించింది. తెలియని అశక్తత పాదాలనుపట్టి వేయగా తడబడుతూన్న కాళ్లను ఈడ్చుకొంటూ 'బస్ స్టాండ్' వైపు నడువసాగింది.

ఆ ఇంటి తలుపులు — కిటికీలు — గాలికి విసిరిసిరి కొట్టుకోసాగాయి. చీకటిలో —వర్షంలో—నిర్మానుష్యంగా దిబ్బాచిమంటూన్న ఆ ఇంటిని అలానే వదిలి ముందుకు నడవసాగారు.

ఉండి ఉండి ఆకాశం కన్ను గీటుతోంది.

కళ్లు జిగేలుమని కనురెప్పలు మూసికొనిపొయ్యాయి.

ఓ నిముషంపాటు దారి కనిపించక గుడ్డివాళ్ళలా తన్నాడుకొంటూ నడవసాగారు.



బ్రిల్‌క్రీమ్

మీ శిరోజములను ఆరోగ్యవంతంగా, మెరయుచూ నున్నగా మరియు నల్లగా వుంచును





బ్రిల్‌క్రీమ్ మాత్రమే

- మీ శిరోజములను నూనెగాను, చెదురుగాను లేక జిడ్డుగాను వుండునట్లు చేయకుండా పరిపూర్ణంగా అణచియుంచును.
- అది చాల ఖర్చుతక్కువ-ఒక్క సారి రాస్తే మీ శిరోజాలను రోజల్లా సహజంగా చెక్కు చెదరనీయక అణచియుంచును.
- నిజంగా పుట్టను పోషించి, ఆరోగ్యవంతమైన శిరోజ పెంపును వృద్ధిపరచుటకు వంటి అసమాన సూత్రానుసారం తయారైనది.

బ్రిల్‌క్రీమ్‌నే వాడండి-ఆరోగ్యవంతమైన, మెరయుచుండే నున్నటి, నల్లని శిరోజాలనిమిత్తం.

కళ్లు కనిపించక-కాళ్లు గుంటలో పడి బురదనీరు చింది బట్టలపై పడసాగింది.

జల్లు—జల్లుగా—వాన.

'మరి మా నాన్న విషయం...' తనలో తాను గొణుక్కుంటున్నట్లు పెదవులు కదిల్చింది.

'కొద్ది రోజుల్లో మనకు అదే కుదుట పడుతుంది' ... పెదవులపై జారిన నీటిని చప్పరిస్తూ అతనన్నాడు.

మళ్లీ ఎవర్నీ ఎవరూ పల్కరించుకో లేదు.

బురదలో బస్సు నిలబడి ఉంది. దాని ఉనికిని తెలుపుతూ, మసక మసగ్గా చిన్న దీపం కాంతిని చిమ్ముతోంది కాన్వాసు పట్టాల సందుల్లోనుండి.

ప్రసాద్ త్వర త్వరగా 'డోర్' వద్దకు నడిచాడు. అతని వెనుక శారద తల వంచు కొని నిలబడింది.

'గుంటూరు-టు' ... ప్రసాద్ నోటు అందివ్వబోయ్యాడు.

'ఒక్కటే—ఖాళీ'..కండక్టర్ —ప్రసాద్ సమాధానం కొరకు నిరీక్షించాడు. ప్రసాద్ ఒక టిక్కెట్టు తీసికొని శారద చేతిలో పెట్టాడు. శారద నీరు కారుతున్న ముఖాన్ని తుడుచుకొంటూ లోనికెళ్లి కిటికీ చెంతనే కూర్చుంది.

పెల్లుబికి వస్తూన్న విచారాన్ని అణచు

మట్టిబొమ్మలు

కొంటూ — బస్సులో కూర్చున్నవారికేసి చూడలేక చూపులు చంచలంగా తిప్పుకో సాగింది. అందరి చూపులూ తననే అనుమా నంతో చూస్తున్నాయని భయపడిపోయినట్లు కన్నుల్లో కలవరపాటు కనిపించింది. చివరకు ధైర్యం చేసి ఒక్క వీక్షణంలో వాళ్ళందర్నీ చూసింది.

బస్సంతా నిశబ్దంగా ఉంది.


వర్షం కారణంగా కాన్వాసుపట్టాలు దగ్గ రగా లాక్కొని మునగదీసికొని ఒదిగి ఒదిగి కూర్చున్నారు. తన విషయం ఎవరూ పట్టించుకోవటం లేదు.

జల్లు విసిరినప్పుడల్లా చినుకులు తన ముఖంపై పడసాగాయి.

తనవైపు కాన్వాసుగుడ్డ పైకి మడిచి ఉంది.

ప్రక్కకు తిరిగి చూసింది.

వర్షంలో తడుస్తూ తనుకూర్చున్న సీటు ప్రక్కనే అతను నిలబడిఉన్నాడు. ఏ భావా నికీ...ఏ భాషకూ అందనిదైన్యాన్ని—విచా రాన్నీ నింపుకొన్న అతనికళ్లు ఆ మసక కాంతిలో కన్నీటితో పరివేష్టితమై మిల మిల లాడుతున్నాయి.



ఆమె కంఠంనుండి భారమైన నిట్టూర్పు వెలువడింది.

చివరిసారిగా ఎలా మాట్లాడాలో ఎలా వీడ్కోలు పుచ్చుకోవాలో అర్థంగాని బాధతో మాటలు దొర్లక ఇద్దరూ ఒకరి నొకరు దిగాలుపడి చూసికొన్నారు.

గాలి మరింత జోరయింది.

బస్సు కదిలింది.

ఆమె రెండు చేతులతోనూ ముఖం అదిమిపట్టుకొని ముందుకు వంగిపోయింది.

అతనిబట్టలపై బురదనీటిని చిమ్ముతూ బస్సు చీకటిలోకి దూసుకుపోసాగింది.

* * *

శారద లేచిపోవటంతో గుండెలపై మండుతూన్న కుంపటిలా మాష్టారి మన స్సులో దుఃఖాగ్ని నాలుకలు చాచింది. ఆయన మద్దత్తుతోనే లేచిపోయిందని చిల వలు పలవలుగా చెప్పుకొన్నారు. ఊరు ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోయింది.

శారద పేరువినిబడితే ఆయన కళ్లలో పిచ్చి కోపం తొంగి చూసేది.

ద్వేషంతో కళ్లు ఎర్రబడేవి.

కూతురు చేసిన పనికి తలెత్తుకు తిరగ లేక—అహరహమూ మడత కుర్చీకి అంటి పెట్టుకొని పోయి. ఆలోచిస్తూ ఏకాంతంగా కాలం గడపసాగాడు.

మనఃశాంతి అంటే ఏమిటో పూర్తిగా మరచిపోయ్యాడు.

ఆయన గుండెజబ్బు మరింత ఎక్కువై పోయింది.

పదిహేనురోజులు తిరగకముందే వారి ముఖంలో పిచ్చి చూపు ఏర్పడింది.

ఇల్లంతా చిందరవందరగా ఉంది. పెళ్లికి తెచ్చిన నూతన వస్తువులు చెల్లా చెదరుగా పడిఉండి శారదను గూర్చిన స్మృతులను చెరగిపోనివ్వకుండ నిత్య నూత నంగా ఉంచుతున్నాయి తనలో.

'టేబిల్ పై నున్న శుభలేఖల కట్ట

మ్ముకొట్టుకొని అలాగే పడిఉంది.

ఆయన వాలుకుర్చీలో పడుకొని కన్నార్పక వాటికేసి చూశాడు—రెండు మూడు నిముషాలు. ఏదో కొత్త ఆలోచన తన మనోపథంలో కనిపించినట్లు కళ్ళలో కొత్త కాంతి తళుక్కుమంది.

బురదలో కూరుకుపోతూన్న బండిని మెరక ప్రదేశానికి లాగలేక లాగలేక పెనుగులాడి ఒక్క ఉదుటున పైకిలాగిన బండి ఎద్దులా—ఆయన భారమంతా తొలగిపోయినట్లు చివుక్కున లేచి నిలబడ్డాడు.

పెదవులపై పేలవమైన చిరునవ్వు కనిపించింది.

పదిహేనురోజుల తరవాత ఒక చక్కని ఆలోచన కల్గినందుకు ఆయన ముఖంలో సంతృప్తి కనిపించింది. అస్తవ్యస్తంగా పడి ఉన్న పరిస్థితులూ—చిక్కులూ అన్నీ ఇంతటితో కుదుటబడి తనజీవిత మార్గం సరళమై పోతుందనే ఆశా కిరణం తళుక్కుమంది.

బయటికి చూశాడు.

ఇళ్ల కప్పులలోనుండి పొగ చుట్టలు చుట్టలుగా బయటికొచ్చి గాలిలో కలిసిపోతోంది.

అరకలు ఇళ్ళకు తిరిగొస్తున్నాయి—నాట్లు వెయ్యటానికెళ్ళిన కూలిజనం గుంపులు గుంపులుగా అరచుకొంటూ ఇళ్ళకెళుతున్నారు. ఆ సంధ్య చీకట్లలో ఆకాశం నిర్మలంగా ఉంది. పిచ్చుకలు తుమ్మచెట్టుపై చేరి అరుస్తూ ఎగురుతున్నాయి.

'ప్రసాద్'...

'అమ్మా...భానూ?...ప్రసాద్ లేడూ?' ...ఆ కంఠంలో మళ్ళీ కొత్తగా వినిపిస్తూన్న ఆప్యాయతను నమ్మలేక ఆ అమ్మాయి పరుగు పరుగున అక్కడికొచ్చింది.

'నీళ్ళు తెస్తున్నాడు...నాన్నా!'

'ఓ మారు పిలువు తల్లీ'...వాకిటి చెంత నిలబడి మాట్లాడుతూన్న 'భానూ' కేసి ప్రేమతో చూశాడు. కొద్ది క్షణాలయ్యాక ప్రసాద్ తడిసిన చొక్కాను పిండుకొంటూ లోనికొచ్చాడు.

(ఇంకాఉంది)

మల్లన్నమంత్రి కౌటిల్యం

...యుద్ధవ్యూహం



దక్షిణ దేశపురాజు మల్లన్నమంత్రి చేతిలో ఓడిపోయి, తన రాజ్యానికి వెళ్ళిపోయేడు కాని మరల దండ యాత్రకు సన్నాహాలు చేస్తున్నట్లుగా మల్లన్న మంత్రికి తెలిసింది. దక్షిణ దేశపురాజు నాలుగువేల సైన్యాన్ని తయారు చేసేడని చారులు మల్లన్న మంత్రికి చెప్పడంవలన అతను అయిదు వేల సైన్యంతో దక్షిణ దేశపురాజు మీదకు దండెత్తేడు.

మల్లన్నమంత్రి అయిదు వేల సైన్యంతో తమ మీదకు దండ యాత్రకు బయల్దేరేడనే సంగతి దక్షిణ దేశపురాజుకు తెలిసింది. వెంటనే అతను తనకు సహాయం చేయవలసినదిగా నైరుతిరాజును కోరేడు. అంత వరకు తటస్థంగా ఉన్న నైరుతిరాజు దక్షిణ దేశపురాజు కోరికను అంగీకరించి తన మూడువేల సైన్యాన్ని వెంటనే అతని సహాయానిమిత్తం పంపించేడు.

అంతవరకు, తనకు సైన్యం తక్కువగా ఉన్నదని భయపడుతున్న దక్షిణ దేశపురాజుకు నైరుతిరాజు సైన్యం తనకు సహాయం చేయడానికి రాగానే ధైర్యం కలిగింది. మల్లన్నమంత్రిని దారిలోనే యెదుర్కోవడం మంచిదనే ఉద్దేశంతో దక్షిణ దేశపురాజు యేడువేల సైన్యంతో ముందుకు బయల్దేరేడు ఆ సైన్యం ఒక నది ఒడ్డునే ప్రయాణం చేస్తూ ఒకచోట ఆగింది.

ఈ సంగతి మల్లన్నమంత్రికి తెలిసింది. సైనికబలం యిప్పుడు దక్షిణ దేశపురాజుకే యెక్కువగా ఉంది. కాబట్టి యేదో ఒక యుక్తిపన్ని శత్రుసైన్యాన్ని ఓడించాలనుకొన్నాడు మల్లన్నమంత్రి.

మల్లన్నమంత్రి సైన్యం కూడా ఆ నది ఒడ్డునే ప్రయాణం చేస్తూ ఒకచోట ఆగింది. రెండు సైన్యాలకు మధ్యను రమారమి ఒకమైలు దూరం ఉంది. మల్లన్నమంత్రి సైన్యం మకాం చేసినచోటుకు యెడంవైపున నది ఉంది. కుడివైపున కొండలు ఉన్నాయి. ఆ కొండల మీదనుంచి సైన్యం రాకుండా దక్షిణ దేశపురాజు భటులు కాపలా కాస్తున్నారు. ఆ యిరువురిలో యెవరికీ పడవలు లేవు కాబట్టి నది మీద నుంచి సైనికులు రావడానికి అవకాశం లేదని అనుకొన్నారు.

ఈ పరిస్థితిని చూడగానే మల్లన్న మంత్రికి ఒక ఆలోచన కలిగింది. తన సైన్యంలో యీత బాగా వచ్చిన సైనికుల్ని వెయ్యిమందిని యేరేడు. వెదురుగడవలె మధ్యనుఖాళీ ఉన్నసన్నపుగొట్టాలను వారికియిప్పించి మల్లన్నమంత్రి యిలాగఆదేశించాడు.

‘రాత్రి కాగానే మీరందరూ యీ గొట్టాలను నోట్లో ఉంచుకొని నదిలో మునిగి నీటి అడుగునుంచి యీదుకొంటూ శత్రుసైన్యం వెనుక భాగానికి చేరుకోవాలి. మీలో ఆఖరు భటుని కాలికి ఒకతాడు కట్టుకొని బయల్దేరండి. ఇక్కడ ఉన్న భటులు ఆ తాడును కొంచెం కొంచెం వదుల్తుంటారు. మీరు అక్కడకు చేరుకొని ముట్టడికి సిద్ధంకాగానే ఆ తాడును కోసివేయండి. అదే మాకు గుర్తు. మేము యిటుపక్కనుంచి దాడి ప్రారంభించగానే మీరు వెనుక నుంచి శత్రుసైన్యంమీద పడాలి.’

మల్లన్నమంత్రి ఆజ్ఞ ప్రకారం వెయ్యిమంది భటులు శత్రుసైన్యం వెనుక భాగానికి చేరుకొని ఆఖరు భటుని కాలికి కట్టిన తాటిని కోసివేశేరు. ఆ గుర్తునుచూసి మల్లన్న మంత్రి శత్రుసైన్యంమీద యెదుటి నుంచి దాడి ప్రారంభించాడు. మల్లన్న మంత్రి సైనికులు, శత్రు సైనికులు యుద్ధం చేస్తుండగా వెనుకనుంచి కూడా మల్లన్నమంత్రి భటులు శత్రు సైన్యాల మీద పడడంవలన శత్రు సైన్యాల్లో కలకలం ఆందోళన కలిగేయి. ఆ అడావుడిలో కొంతమంది భటులను వెంటబెట్టుకొనిశత్రువులగుడారంలో ప్రవేశించి దక్షిణదేశపురాజును బంధించి వేశాడు మల్లన్నమంత్రి. ●

మెదడుకి మేత



డాక్టర్ మహీధర నళినీమోహన్

దొంగనాణెం




(క) దొంగనాణెం :

'పట్టుబడ్డ దొంగరూపాయి ఏదీ ?' అన్నాడు పోలీసు ఇన్‌స్పెక్టరు.

'దానిని, తమ బల్లమీదనే ఉంచాను సార్!' అన్నాడు పోలీసు.

ఇద్దరూ కలిసి బల్ల దగ్గరకు వెళ్లేరు. పొరబాటున మరో 8 మంచి రూపాయలలో ఈ దొంగరూపాయి కలిసిపోయి ఉంది. దొంగరూపాయి బరువు మంచి రూపాయికన్న కొంత తక్కువ అనిమాత్రం తెలుసు. లేకపోతే అసలుకీ నకిలీకీ మరేవిధమైన భేదమూ కనిపెట్టలేరు. ఆ తొమ్మిది రూపాయలలోనూ దొంగరూపాయి ఏదో తెలుసుకోవడం ఎల్లాగ? తూచుదామంటే దగ్గరలో త్రాసు ఏదీలేదు. ఆ పోలీసు ఇన్‌స్పెక్టరుకి మెరుపులా చక్కటి ఆలోచన తట్టింది (పోలీసు ఆఫీసరుకి అసలు చక్కటి ఆలోచన ఎల్లా తట్టిందని విస్తుపోకండి. వారిలోకూడా తెలివైనవాళ్ళు అక్కడా అక్కడా కనబడుతూ ఉంటారు.)

బల్లమీద ఉన్న అడుగుబద్దను తీసి సరిగ్గా మధ్యని చాకు అంచుమీద నిలువబెట్టేడు. అదీ ఒక విధమైన త్రాసుకదా! ఆ అడుగు బద్దమీద కత్తి అంచుకి సమాన దూరాలలో రెండు వస్తువులు ఉంచితే, వాటిలో ఏది బరువైనదో తెలుస్తుంది. తేలికగా ఉన్న దొంగనాణెమును పట్టుకోవడానికి ఈ త్రాసు చాలు. దీని సాయంతో రెండే రెండు సార్లు తూకంవేసి ఇన్‌స్పెక్టరు దొంగనాణెమును పట్టుకోగలిగేడు! ఆ పని మీరు చేయగలరా ?



* * *

(చ) మేస్త్రీ—పనివాళ్ళు :

మేస్త్రీ పనివాళ్ళు




'వారంరోజుల్లో కట్టడం పూర్తి చేస్తా నని ఒప్పుకున్నమాట నిజమే ననుకోండి. కాదనను. మరో ఇద్దరు పనివాళ్ళ సహా పని మొదలుపెట్టారు. పోనీ రాకపోతే పోయారు. మిగిలిన అందరూ పనిలోకి వచ్చినా మండొక్క రోజుకన్న ఎక్కువ పట్టనియ్యక పోదును. కాని, మరోచోట ఏదో పెద్దపని దొరికిందని అందరూ వెళ్లిపోయారు. ఇదిగో ఇతడొక్కడు మిగిలేడు. చాలా ఆలస్యం అయిన మాట నిజమే' అన్నాడు మేస్త్రీ పని ఆలస్యం అయినందుకు సంజాయిషీ ఇచ్చుకుంటూ.

ఇంతకీ ఎన్నాళ్ళు ఆలస్యం అయింది ?

* * *

(ట) లినోలియం :

లినోలియం



ఒక భాగ్యవంతుడు 12 అడుగులు × 12 అడుగులు కొలతలుగల తన వంట ఇంటి నేలమీద 'లినోలియం' (ప్లాస్టిక్ ప్లేటువంటి ఒకానొక వస్తువు) పరిపించా లనుకున్నాడు. 16 అడుగులు × 9 అడుగులు కొలతలుగల లినోలియం ప్లేటు దొరికింది. బజారులో దీని వైశాల్యమూ, వంటగది వైశాల్యమూ సరిసమానమే కాని ఆకారాలు వేరువేరుగా ఉన్నాయి. ఆ ప్లేటును సాధ్యమైనన్ని తక్కువ ముక్కలుగా కోసి, ఆ గది నేలమీద అంతటా సరిగ్గా నిండేలా పరిపించాలని ఆ గృహస్థు అనుకున్నాడు.

ఏవిధంగా కోస్తే మంచిది ?

* * *

(ఠ) ఇటుక బరువు :

ఒక ఇటుకబరువు 4 కిలో గ్రాములు. సరిగ్గా అదే ప్రకారంలో ఉండి, సైజు

(64 వ పేజీ చూడండి)



సాయం సంధ్య ఎరుపు—తెలుపు—నలుపు—కలిపిన చీరె ధరించి శృంగారంగానవ్వింది. విరిపిన పాలల్లా ఆకాశం మెరుస్తోంది. దూరాన రెక్కలు టపటపా కొట్టుకుంటూ కొంగలు బారులు—బారులుగా సాగిపోతున్నయ్. అదోవిధమైన అందం! అనుభూతి!! ప్రకృతిలోని చలనాన్ని అవలోకిస్తూ తన్మయత. ఎంతసేపైనా చూపులు మరల్చలేని ఆకర్షణ.

మెత్తని పచ్చగడ్డిలో—చేతుల్ని తలక్రింద అమర్చుకుని—వెల్లికిలా పడుకుని తదేకంగా మేఘాలవైపు—ఆకాశంలోని — నీలిమవైపు చూస్తున్న శ్యామసుందరి దగ్గరికి రాధ వచ్చింది.

'చీకటి పడ్తోంది! క్రిందికి దిగి పోదామా?' అడిగింది రాధ.

'పోదాం లెద్దూ! ఇక్కడే...ఇలాగే ఎన్ని రోజులైనా...' ఎన్ని యుగాలైనా...వుండి పోదామనిపిస్తోంది రాధా! రాధ చేతిని తన చెంపకు అద్దుకుంటూ అన్నది శ్యామసుందరి.

'నిజమే అనుకో! అసాధ్యమైనదాన్నే సాధ్యం అవాలని కోరుకుంటాం మనం—కానీ నీవు కోరుకున్నదే నిజంగా జరిగితే విసుగెత్తిపోతుంది.' నవ్వింది రాధ.

'లేదు! ఎన్నటికీ విసుగెత్తదు—ఇంత అందాన్నీ—ప్రశాంతతనీ—నైర్మల్యాన్నీ కావాలని అనుక్షణం కోరుకునే మనకు—అది లభిస్తే—కోరిక నెరవేరిందనే తృప్తీ—సంతోషం మిగులుతాయి.?

'నీవు ఊహల్లో జీవిస్తావు' శ్యామసుందరీ! వాస్తవంగా ఆలోచించు. కడుపు నిండా తిండీ—నిద్రా అన్నీ లభ్యమైనాక—ప్రకృతిలోని అందం — ఆకాశంలోని రంగులు ఆహ్లాదకరంగా వుంటయ్. — ఆ రెండూ లోపిస్తే మనసులో ఇలాంటి భావాలకు తావేవుండదు...' మితిని తప్పి—అతిని భరించలేదు మానవహృదయం.''

గలగలా నవ్వింది శ్యామసుందరి.

'మానవహృదయం మీద రీసెర్చి చేస్తున్నావా?'

'లేదు! కొన్ని సత్యాలు ప్రత్యక్షంగా కన్పిస్తుంటే ప్రత్యేకంగా పరిశోధన లెందుకు?'

'నీతో వాదించలేను బాబూ! నన్నిలా వదిలెయ్! నీకు పుణ్యముంటుంది!'

'నేనూ సౌందర్యాన్వేషిణినే శ్యామసుందరీ! కానీ సమయం సందర్భంవున్నది!''

'ఇంతకీ ఏమిటి నువ్వనేది?' లేచి కూర్చుని ఆశ్చర్యంగా కళ్ళల్లోకి చూసింది.

'చీకటిపడ్తోంది. అపరిచితమైనప్రదేశం. ప్రమాదభూయిష్టమో - ప్రమోదభరితమో మనకేం తెలుస్తుంది? అదీ కాక సెక్రెటరీ వాసంతీ రాణి మనకోసం వెతుక్కోరూ?

'ఇలాంటి సుందరప్రదేశంలో—నిర్మలవాతావరణంలో—మామూలు గొడవలు రేపకు. నువ్వెళ్ళు—నీ వెనుకగా నేనూ వస్తాను.'

'సరే నీ యిష్టం! జాగ్రత్తగా వుండు. అవసరమైనా రేపు మళ్ళీ వచ్చి మిగిలినవి చూడొచ్చుగదా!'

'నిజమే రాధా! కానీ ఈ వెన్నెలరాత్రి అనుభవం పగలు ఎలావస్తుంది?'

రాధ మరి మాట్లాడలేదు. నెమ్మదిగా మెట్లు దిగుతూ వెళ్ళిపోయింది, క్రింద వున్న తమ గెస్ట్‌హౌస్‌కు. శ్యామసుందరి మనసునిండా హాయి ఆవరించుకుంది. సహజంగా ఆమె ఉద్రేకి. సుందరమైన ప్రకృతి దృశ్యాలకు పరవశించిపోతుంది. ఆ క్షణంలో మిగిలినవన్నీ తృణప్రాయాలే.

ఆ హాయిలో — ఆనందంలో — వంటరితనంలో—నిశ్శబ్దంలో— గొంతు పురి విప్పుతున్న నెమలిలా రాగతరంగాలతో నృత్యం చేసింది.

స్వేచ్ఛగా—మధురంగా గొంతెత్తి గోపికా గీతం ఆలాపిస్తోంది శ్యామసుందరి.

'నల్లనివాడా...
నేగొల్లకన్నెనోయ్.
పిల్లనగ్రో వూదుమోయ్ నా—
యుల్లము రంజిల్లగా.
నల్లనివాడా..."

పాట పూర్తయింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా—మూగగా— అనిర్వచనీయమైన ఆనందంతో—తృప్తితో పడుకునుంది శ్యామసుందరి.

హఠాత్తుగా వాతావరణంలో మార్పు కన్పించింది ఆమెకు.

వెన్నెలకోసం చకోరిలా నిరీక్షిస్తున్న ఆమెకు ఆకాశనిండా ఆవరిస్తున్న నల్లని మేఘాలు గుంపులు -- గుంపులుగా కనిపించినయ్.

క్షణంలో దట్టంగా పట్టిన మబ్బులు— ఈదురుగాలీ మసకచీకటి!

హతాశులరాయిందామె!

ఇలాంటి సమయంలో కూడా అదోవిధమైన భయానకసౌందర్యం ప్రకృతిలో కానవచ్చినా—క్రిందికి చేరుకోవటమే క్షేమదాయకమని మనసు హెచ్చరించింది.

తటిల్లత మెరిసిన మెరుపు వెలుగులో బారెడుదూరాన కనిపించిన పురుషాకారం గమనించి స్తంభించిపోయింది శ్యామసుందరి.

అడుగడుగునా మెరుస్తున్న మెరుపులవల్ల అతను తనవంకే దీక్షగా చూస్తున్నట్లు గ్రహించింది. అవ్యక్తమైనభీతి ఆవహించిందామెలో — ఏదో అనుకంపన — ఆరాటం! ఎలాంటిపరిస్థితిలో చిక్కుకుంది తను. రాధ హెచ్చరికను తనెందుకని సరకు చేయలేదు? పరాయివూరిలో స్వతంత్రభావనలెందుకు అక్కరకొస్తాయి?'

సన్నని జల్లు మొదలైంది.

ఇంకోసమయంలో అయితే ఆ వర్షం జల్లులో తడవటమూ ఆనందకారణమే శ్యామసుందరికి.

కానీ....

'ఈ వూరికి మీరు క్రొత్త అనుకుంటాను?' పురషాకారం పలికిందీ మాటలు.

'అవును! అవును!!' అన్నాననుకుంది. లోపలే అణిగిపోయినయ్ తన విస్సహాయత గుర్తుకు తెచ్చుకుని.

'మిమ్మల్నే! భయపడతారెందుకు! నేను సహాయం చేయగలను!'

హృదయంలోని పవిత్రత మాటల్లో వ్యక్తమైంది.

'థాంక్స్! అవసరంలేదు. దారి తెలుసు. దిగిపోతాను.' వొణుకుతున్న స్వరాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ అన్నది,

'చాలా కేర్‌ఫుల్‌గా వుండాలి. వర్షానికి మెట్లు జారవచ్చు! నెమ్మదిగా మీ ఎడమ చేతివైపు ఫర్లాంగు నడిస్తే మెట్లు అవుపడతాయి.' వివరణగా చెప్పేడతను.

'మెనీ థాంక్స్!' ఆమె మెల్లిగా ఎడమ దిశ మెరుపుల వెలుగులో నడవసాగింది. వర్షం ఎక్కువైంది. చీరంతా తడి—చలి! ఏమిటీదురదృష్టం?.

'నా దగ్గరున్న ఈ గొడుగు తీసుకోండి! మీరు ముద్దలా తడిసిపోతున్నారు.' వెనుకగా వస్తోన్న అతను గొడుగు అందించబోయేడు.

శరీరం 'తీసుకో'మని తొందర చేస్తున్నా—మనసందుకు వ్యతిరేకిస్తోంది.

'ఫర్వాలేదులెండి!' అన్నది ముక్తసరిగా బలవంతంగా చేతికందించేడతను.

'మీరు...మీరు తడిసిపోతున్నారు.' జాలిగా, బాధగా అన్నది.

'నా కలవాటేలెండి ఫర్వాలేదు...మీరు జాగ్రత్తగా నడవండి.'

'క్షమించండి! మీరు ఈ గొడుగులోకి రాకూడదూ? ఇదేమి న్యాయం? మీ గొడుగుతోనే సంరక్షణ కల్పించుకోవటమా? నవ్వింది చిన్నగా శ్యామసుందరి. స్వాభావికంగా ఆమెది సరళమైన హృదయం కలుపుగోరుతనం! క్షణంలో మాట కలిపేస్తుంది.

అతనూ నవ్వి—నెమ్మదిగా గొడుగులో కొచ్చాడు. మాటలు కలిశాక — సంభాషణ పెరిగింది.

'నేను ఇక్కడి ప్రకృతి సౌందర్యసంపద గురించి విని వెలరోజుల క్రిందట వచ్చాను చలపతిరావు అంటారు నన్ను' పరిచయం చేసుకొన్నాడు.

'నా పేరు శ్యామసుందరి. మాది హైద్రాబాద్. మహిళామండలి మెంబర్‌ని నేను. మా క్లబ్‌లో అంతా కలిసి విహారయాత్రగా — సౌందర్యాత్మకంగా ఎన్నికగన్న ఈ హిల్స్ చూడటానికి వచ్చాము.'

'మిస్...శ్యామ...'

'నో...మిసెస్ శ్యామసుందరీనాథ్.'

'సారీ! మీవారెందులో పనిచేస్తున్నారు?' చెప్పింది.

'మీ రిలా వంటరిగా...'

సిగ్గుపడి సంగతి వివరించింది మెల్లిగా—అతని యెడల ఏర్పడిన సదభిప్రాయ ప్రోద్బలంతో. ఈదురుగాలి ఎక్కువైంది గొడుగు వున్నా పక్కలనుంచి జల్లుపడి బట్టలన్నీ నీళ్ళు కారుతున్నయ్.

మెరుపులు — ఉరుములు!

ఘోరున వర్షం—ఈదురుగాలి.

గాలి తీవ్రతకు గొడుగుతోపాటు పైకి లేచిన శ్యామసుందరి కీచుగా అరిచింది భయంతో. మెట్లమీద బ్యాలెన్సు తప్పింది చటుక్కున ఆమె నడుము పట్టుకుని అవు చేశాడు చలపతిరావు.

చేతిలోని గొడుగు వదిలిపెట్టింది శ్యామసుందరి. గాలివాటుగా కొట్టుకుపోయిందది.

నెమ్మదిగా మెట్టుమీద కాళ్లను బలంగా అదిమి పెట్టబోయిన ఆమెను—చలపతిరావు గట్టిగా తనవైపు తిప్పుకుని హృదయానికి హత్తుకోవటంతో — మతిపోయినంత పనైంది.

'ఏమిటిది? ఏమిటీ ప్రళయం?' కంపించి పోయింది. మరింత బలంగా—గాఢంగా తనలోకి లాక్కుంటున్నాడు.

చలికి వణికే శరీరానికి ఈ వెచ్చదనంలో హాయి కనిపించినా—అంతరాత్మ — మనసు ఓకటే గోలగా రొదచేస్తోన్నాయి.

శిక్ష

విడిపించుకో...పారిపో ... హెచ్చరిస్తున్నయ్.

గింజుకుంది—పట్టు సడలలేదు.

విదిలించించి—మరింత దగ్గరికి తీసుకున్నాడు.

కొన్ని క్షణాల తర్వాత—బిలాన్నీ శక్తినీ కూడ దీసుకుని—

'పెదుపండి' ఏమిటిది? — నమ్మించి గొంతుకోస్తారా?' వొణుకుతున్న స్వరంతో దీనంగా అన్నది.

పాదాలను మెట్లమీద బిలంగా బంధించి—ఆమెకు సమాధానంగా పెదవుల్ని బంధించాడు చలపతిరావు.

శ్యామసుందరి శరీరం అలసి మనసు కళ్లు చీకటి క్రమ్ముకు పోయినయ్. కొన్ని నిమిషాలకు కుప్పలా క్రింద మెట్లమీద కూలిపోవటం వరకు తెలుసు ఆమెకు.

* * *

కాఫీ త్రాగి కప్పు టీపాయ్‌మీద వుంచి పెదవుల్ని తుడుచుకుంటూ ఓరగా జగన్నాథం వైపు చూసింది శ్యామసుందరి.

సిగరెట్ వెలిగించి పొగరింగులుగా వదులుతూ చిన్నగా దగ్గాడతను —

'నాకేం అర్థం కావడంలేదు శ్యామా! ఏమిటి నీ బాధ? ఈ మౌనం ఏమిటి? ఎందుకు చెప్పవు?'

'బావుంది! ఏం చెప్ప మంటారు?' నవ్వింది నిర్జీవంగా.

'అదిగో...అదే!...ఆ నవ్వులో ఎంత పెసిమిజం వుందని! అదిచాలు నీ మనోభావానికి నిదర్శనంగా.'

మాట్లాడలే దామె. తలవంచుకుని ఏదో ఆలోచిస్తోంది

'నిన్న కార్యదర్శి వాసంతీరాణి ఫోన్ చేసింది.— నిన్నటిఫంక్షన్ కు నువ్వెందుకువెళ్ళలేదు? మహిళామండలిలో నీవు లేనందువల్ల చాలా నిరుత్సాహంగా వుందంది. నన్ను—నిన్ను ప్రోత్సహించి పంపమని వేధించింది ఇదంతా ఏమిటి శ్యామా? నాకు మతిపోతోంది.' లేచి విసుగ్గా పచార్లు చేయ సాగేడు.

'ఏమిటోనండి! ఎక్కడికీ పోవాలనిపించదు హాయిగా ఒంటరిగా ఉండిపోతే చాలు అనిపిస్తుంది. ఆ మహిళామండలి కార్యక్రమాలమీద విసుగువేస్తోంది నాకు.'

ఆశ్చర్యంగా చూశాడతను—ఆగి ఆమె వంక.

'అదిగో ఆమాట్లే ఏమిటి అని అడిగేది? ఎన్నోసార్లు సినిమా ప్రోగ్రాం కూడా కేన్సిల్ చేసేసి ఉత్సాహంగా మీ క్లబ్‌కు వెళ్లలేదూ నువ్వు? చెప్పు శ్యామా!

ఆలోచిస్తుంటే ఒకటి అనిపిస్తోంది నాకు—మీ పిక్నిక్ నుంచి తిరిగివచ్చినప్పటినుంచి—అదోలా నిరుత్సాహంగా కనిపిస్తున్నావు. అక్కడేమైనా జరిగిందా?' ఆమె ప్రక్కనే సోఫాలో కూచుని మొహం తనవైపు తిప్పుకున్నాడు.

ముత్యాల్లా మెరుస్తున్న కన్నీటి బిందువులు రెప్పలమీద నుండి అతని చేతుల్లోకి రాలినయ్.

'శ్యామా...' ఉలిక్కిపడ్డాడు జగన్నాథం.

ఉద్వేగంతో అతని హృదయంలో తల దాచుకుంది. పొంగుకువస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ. మౌనంగా ఆమె తల నిమురుతూ ఉండిపోయాడు జగన్నాథం.

* * *

'హలో! శ్యామసుందరీ!' నవ్వుతూ రాధ ప్రవేశించింది.

చనువుగా ఆమె ప్రక్కనే కూర్చుని భుజంమీద చేయివేస్తూ—'ఎంత చిక్కి పోయావు నువ్వు? నీ మనసులోని బాధ నాకు చెప్పవూ?' అన్నది అనునయంగా రాధ.

నిట్టూర్చింది శ్యామసుందరి.

'మీరంతా నన్నెందుకిలా వేధిస్తున్నారో నా కర్థం కావటంలేదు!'

'లేదు శ్యామసుందరీ! నువ్వు దాస్తున్నావు ఆరోజు-మనోహర ప్రకృతికి పరవశించిన నీ ఉత్సాహం - ఆనందం ఇప్పుడు మటుమాయమైనయి. వర్షంలో మెట్లమీద కుప్పలా కూలిపోయిన నీవు-తరువాత ఎంత ముభావంగా-నిర్లిప్తతో తిరిగి వచ్చావో నేను మర్చిపోగలనా? ఏంజరిగింది? చెప్పు! చెప్పు శ్యామసుందరీ?'

ఆలవిగాని ఆవేదనతో—అవమానంతో మనసు భగ్నమవుతోంది. క్షణక్షణ మూమర్చిపోదామన్నా—మరుపురానీయకుండా కెలుకుతున్నా రీ వ్యక్తులు!

ఏమని చెప్తుంది?

తలనొప్పా?


సారిడన్ 'రోష' వేసుకోండి

నొప్పి మటుమాయమై...



...మీకు నవోత్సాహము కలుగుతుంది!

అదే సారిడన్ యొక్క ప్రత్యేకత! నొప్పిని, దాని వలన కలిగే శ్రమను పోగొట్టుటయేగాక, హాయి నవోత్సాహములనుకూడ కలిగించుటకై సారిడన్ ఒక ప్రత్యేక సూత్రముతో తయారు చేయబడినది. దానిని వేసుకోగానే మీలో ఎంత మార్పు వస్తుంది! నొప్పి, శ్రమ మటుమాయమై, చక్కగా ఆలోచించ కలుగుతారు ... పని యందు ఆసక్తి కలుగుతుంది ... స్నేహితులతో సరదాగా వుండగలుగుతారు ... ఒకే ఒక సారిడన్ నొప్పిని పోగొట్టును, వేద దేర్చును, నవోత్సాహమును కలిగించును. ఎల్లప్పుడు సారిడన్‌ను మీ దగ్గర వుంచుకోండి. పిల్లలకు ½ నుంచి ½ బిళ్ల వరకు మాత్రమే వాడుడు.



తలనొప్పి
పంటినొప్పి
ఒంటినొప్పి
బహిష్టునొప్పి

ఒకే ఒక సారిడన్‌తో మటుమాయమవుతాయి!

'రోష' తయారు
ఏకైక డిస్ట్రిబ్యూటర్లు: వోల్టాస్ లిమిటెడ్

శీలం కోల్పోయి పతితగా మిగిలిందనా?

తన జీవితంలోని-పవిత్రత-శాంతి లుప్తమయినాయనా?

నీమాటలు అలక్ష్యం చేసిన ఫలితం అనుభవించిందనా?

ఏమని చెప్తుంది?

నిట్టూర్చింది గాఢంగా-రాధ.

'ఇన్నాళ్ళూ నేనెంతో గర్వించాను. ఎందుకో తెలుసా? మనసు విప్పుకుని—మమతలు పెంపొందించుకుని విలువైన స్నేహానికి నిర్వచనంగా మెలుగుతున్నామని. కానీ- నీ బాధతో నాకు నిమిత్తం లేదా? నీ మనోవ్యాకులతలో నేను జోక్యం చేసుకో కూడదా? నీ దృష్టిలో నేను కేవలం ఒట్టి రాధనేనా? చెప్పు! నా ప్రశ్నకి సరి అయిన సమాధానం చెప్పు-నేను వెళ్ళిపోతాను నిన్ను బాధించటం నా ఉద్దేశం కాదు. నీలోని నిర్లిప్తతను-అంతర్లీనమైవున్న ఆవేదనను నిర్మూలించాలనే నా తాపత్రయం.'

శ్యామసుందరి రాధ చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కి వదిలిపెట్టింది.

'నన్ను అర్థం చేసుకో రాధా! నేనిప్పుడేమీ చెప్పలేను. ఎప్పుడో ఒకరోజు నేనే నిన్ను పిలిచి అంతా చెప్తాను. ప్లీజ్ నన్నిప్పుడేం అడక్కు!'

అరచేతులతో ముఖాన్ని కప్పుకుంది.

రాధ నిస్పృహించటంకంటే ఏంచేస్తుంది?

'బాధపడకు! నీ ఇష్టప్రకారమే జరుగుతుంది. ఎల్లుండి గోల్కొండ పోదాం వస్తావా?' చేతుల్ని విడదీస్తూ అడిగింది.

'క్షమించు రాధా! నేనెక్కడికీ రాలేను.'

నీలో బాధవుంటే-ఎదుటి మనిషికి చెప్పు! లేదా గోప్యంగా దాచుకో. అంతే కానీ...ఇలా పరిసరాల్నీ వ్యక్తుల్నీ సందిగ్ధావస్థలో వుంచటం ఏం సబబు? చలాకీగా గలగలా ప్రవహించే సెలయేటిలా వుండే నీవు స్తబ్ధుగా—నీరసంగా—నిర్లిప్తతగా దిగులు గడ్డకట్టినట్లు-ప్రవర్తిస్తే నీ సన్నిహితులకు ఎలా వుంటుంది? మనసు కెలికినట్లు వుండదూ? అంత బాధలో నిన్ను కారణమడగకూడదు. ఇదేం న్యాయం శ్యామసుందరీ?'

మాటల్లో రాధను ఓడించడం కష్టం. ఈ విషయం ఇప్పుడుకాదు—ఎప్పుడో తెలుసు

శిక్ష

శ్యామసుందరికి—మౌనంగా కొన్ని క్షణాలు ఆలోచించి-

'సరే!-వస్తాను' అన్నది ఎటో చూస్తూ.

'నేను వెళ్తాను. కానీ ఓ చిన్న విన్నపం. నీ బాధల్లోనూ, సంతోషంలోనూ పాలు పంచుకునే-నీ భాగస్వామిని క్షోభ పెట్టటం నీకు న్యాయంకాదు. సాధ్యమైనంతవరకూ నిన్ను నిగ్రహించుకో. అవతల మనిషి గురించి అర్థం చేసుకో!'

రాధ వెళ్ళిపోయింది.

తన మనసులోని భారం తీరేలా వెక్కి—వెక్కి ఏడ్చింది శ్యామసుందరి.

'ఇక తన జీవితమింతేనా? ఆడదానికి భూషణంలాంటి శీలం కోల్పోయిన తర్వాత జీవితానికి అర్థమేమిటి? ఎవరికోసం తను? అసలు తనిలా బెంబేలు పడతోందెందుకని? ఎవరికి తెలుసు? మనసుకు-భగవంతుడికీ తప్ప! నలుగురిలో తనెందుకిలా ప్రత్యేకంగా కన్పిస్తోంది?

అతనో...! అతను!

ఎవరో-ఏమిటో?

తను అడగలేదు—అసలు వ్యాధి ఏది?

తిరిగి తనకు కన్పిస్తాడని నమ్మకం ఏమిటి?

వివరాలు కనుక్కొని ఏం చేస్తుంది?

ఏం చేయగలదు?

కొట్టిస్తుందా?

కొట్టిస్తే వచ్చిన మచ్చ మాసిపోతుందా? అల్లరి పడటం తప్పించి!

లాభంలేదు!—తనేవిధా చేయలేదు

రాధ చెప్పినట్లు గతం నశోభాము! భవిష్యత్ ఏమిటి? మామూలు మనిషిలా ఎలా మారిపోగలదు?

ఇలా బాధపడి ప్రయోజనమేమిటి?

ఆయన అడుగుతున్నారు— 'ఏమిటి శ్యామా' అని.

ఏం చెబుతుంది?

ఎంత భర్తయితే మాత్రం?

ఎంత సన్నిహితుడైతే మాత్రం?

*　　*　　*

గోల్కొండ ఎక్కి చదునుగా వున్న ఓ బండమీద కూర్చున్నారు రాధా శ్యామసుందరీ—మరో క్లబ్ మెంబరు జయ సభా—అస్తమిస్తున్న సూర్య బింబాన్ని చూస్తూ.

'మొన్న మీటింగ్‌లో నళిని ప్రసాద్ భలే దంచిందిలే లెక్చర్! నువ్వు లేవుగానీ శ్యామ సుందరీ. వచ్చివుంటేనా మంచి మెటీరియల్ దొరికేది నీకు. నువ్వుంటే బాగుండేదనీ— నళినికి సమాధానం ఘాటుగా చెప్ప వుండేదానివనీ అందరం అనుకున్నాము.'

'యు సిల్లీ జయా! ఇలాంటి అందమైన సాయంత్రం నళిని సంగతి ఎత్తుతావేం' రాధ విసుక్కుంది. చిన్న పుచ్చుకున్న జయను చూస్తూ—

'లేదు జయా! ఆరోజు నా ఆరోగ్యం బావుండలేదు. వద్దామని చాలా ట్రై చేశాను. ముఖ్యంగా ఫోర్స్ చేసేరని ఆయన చెప్పగా నే— మిమ్మల్ని డిజప్పాయింట్ చేశా నేమోనని చాలా బాధపడ్డాను తర్వాత.' అన్నది శ్యామ సుందరి.

'అదిగో అటు చూడు శ్యామసుందరీ! క్రుంగిపోతున్న సూర్యుని మరుగుపరుస్తూ ఆ మేఘ శకలం అడ్డురాగా-ఆ సూర్య కిరణాలు స్పష్టంగా ఎలా ప్రతిఫలిస్తున్నాయో!'

'ఫుల్‌స్టాప్ రాధా! నీకీమధ్య ప్రకృతి మీద ధ్యాస ఎక్కువవుతోందేమిటి?' జయ నవ్వింది. శ్యామ సుందరీ - అవునన్నట్లు జత కలిపింది ఆమెలో మెల్లి—మెల్లిగా దూర మౌతోన్న ఒంటరితనమూ — నైరాశ్యం—మౌనం గమనించింది రాధ.

'మన సెక్రెటరీ వాసంతీరాణి మొన్నటి ఫంక్షన్‌కు గులాబీరంగులో జరీ బోర్డరున్న చీరె కట్టుకొచ్చింది, ఎంత బావుందనీ! బొంబాయి వెళ్ళినప్పుడు వాళ్ళాయన తెచ్చేరట'' జయ చెప్పుకు పోతోంది. పరధ్యాసగా వింటున్నా రిద్దరూ ఎవరి ఆలోచనల్లో వారు సతమతమవుతూ.

*　　*　　*

'శ్యామా! రెండుకాఫీలు పట్టుకురా!' జగన్నాథం కేకేశాడు.

ట్రేలో కాఫీపట్టుకువచ్చిన శ్యామసుందరి అశక్తత గడ్డకట్టినట్లు గుమ్మంలో పాతుకు పోయింది.

అతను...అతను...

చలపతిరావు కదూ!

స్తంభించిన శ్యామసుందరి రెప్ప వేయకుండా బొమ్మలా అతనివైపు చూస్తుంది

పోయింది.

చలపతిరావు తెల్లబోయేడు ఆమెను చూస్తూనే. ఏదో అవ్యక్తమైన భయం శరీరాన్నావరించింది. కళ్లెత్తి ఆమెను సూటిగా చూడలేక పోయాడు. అంతవరకు జగన్నాథంతో మనస్ఫూర్తిగా, సంతోషంగా, అవ్యక్తానందంతో మాట్లాడాడు. క్షణంలో మనసులో బెరుకు జంకు — ముళ్లమీద కూర్చున్నట్లు అనుభూతి కలిగినయి. అపరాధిలా తలవంచేసుకుని జగన్నాథం మాటలకు పొడిగా సమాధాన మివ్వసాగాడు.

'అదిగాదోయ్ సతీ! ఇంతకాలం నువ్వెందుకు వివాహం చేసుకోలేదు ? మమ్మల్ని ఆహ్వానించాల్సి వస్తుందనా ? లేక స్త్రీజాతి మీద కత్తిగట్టేవా ? ఈ రెండూ కాక భగ్న హృదయుడివా ? సరైన సమాధానం చెప్పవయ్యా మహానుభావా !' జగన్నాథం చనువుగా అతనిచేతిని నొక్కుతూ — ఆసక్తిగా అతనివంక చూస్తూ అడిగేడు.

ప్రతిమలా నిలబడిపోయిన శ్యామసుందరిని అతను గమనించలేదు. శ్యామసుందరి హృదయం అభిమానంతో — పరాభవంతో జ్వలిస్తోంది.

'తన జీవితాన్ని సమూలంగా నాశనంచేసి — హృదయంలో ఆరని అగ్నిని రగిల్చిన చలపతి ముందు తను మళ్లీ నిలబడటమా ? ఎంత ఘోరం ! ఇంతకంటే గుక్కెడు విషం తాగడం మంచిది కాదూ! ఏ విషయాన్నయితే — తేలికగా త్రోసివేసి భవిష్యత్తును క్రొత్తరూపంలో మలుచుకుందామని ప్రయత్నిస్తోందో — ఆ విషయాన్ని — ఆ భయంకరమైన సంఘటనకి గుర్తుకుతెస్తూ చలపతిరావు !

భగవాన్ ! నన్నీపాటున భూమిలోకి త్రొక్కివేయరాదూ ?' చేతులు వొణుకుతున్నయ్. వళ్లంతా స్వేదంతో తడిసిపోతోంది. కళ్లు తిరిగి పోతున్నయ్.

హఠాత్తుగా వెనక్కి తిరిగిచూసిన జగన్నాథం — 'అరె! అక్కడే నుంచున్నావేం ? రా ! ఫర్వాలేదు. ఇతను నా ఆత్మీయుడేలే! చిన్నప్పుడు ఒకే ప్రాణంగా మెలిగేవాళ్లం — ఆ అనుబంధమే — ఇంత వయసు వచ్చినా మాసిపోకుండా అతన్ని నాదగ్గరకు లాక్కొచ్చింది.' అన్నాడు.

'కాదు ! నా దురదృష్టమే నన్నీస్థితిలో నిలబెట్టింది !' అని బిగ్గరగా అరవాలని పించిం దామెకు.

చలపతిరావు మనసు మనసులో లేదు. జరిగినదంతా కలలా అనిపిస్తోంది అతనికి.

'ఆమె !...అనుకోకుండా ఆరోజున ప్రపంచంలోని శక్తులన్నీ ఏకమై తన్నశక్తుడిని జేసి జీవితంలో తిరిగి కోలుకోకుండా — క్రుళ్లి క్రుశించమని నిర్దేశించిన ఆరోజు... పైశాచిక కృత్యంతో నమ్మిన స్త్రీని వంచించిన ఆరోజును గుర్తుకుతెస్తూ తిరిగి ఈమె ఇక్కడ ప్రత్యక్షమవడ మేమిటి ? కలకాదు గదా! కాకపోతే ఇంతకంటే చిత్రమైన విషయం లోకంలో మరోటుందా ? ఆమెలో ఎలాంటిభావాలు చెలరేగుతున్నాయో ? తనను గురించి ఎంత నీచంగా తిట్టుకుని అసహ్యించుకుంటుందో ? ఒకవేళ...జగన్నాథానికి తెలుసా ?

తెలియదేమో !

'తెలిస్తే ?'

'రా శ్యామా! ఏమిటలా బిగుసుకుపోయావు ?' లేచి ఆమెదగ్గరగా వెళ్లి చేతిలోని ట్రే అందుకున్నాడు. మరో చేత్తో ఆమె భుజంపట్టి కుదుపుతూ — 'యు సిల్లీ శ్యామా ! అతనేమనుకుంటాడు ? ప్లీజ్ మామూలుగా పలకరించు.'

శ్యామసుందరి నిర్జీవమైన — కాంతివిహీనమైన కళ్లెత్తి అతనివైపు క్షణంలో సగంసేపు చూసి వెనక్కితిరిగి లోపలికెళ్లిపోయింది

క్షణంసేపు నిర్ఘాంతపోయి తిరిగి తమాయించుకుని — 'ఏమీ అనుకోకోయ్ సతీ ! జా మిసెస్ కి మీతో ఇంకా పరిచయం లేదు' అన్నాడు.

ఫర్వాలేదన్నట్లు తలాడించాడు చలపతిరావు. అతనికి ఇక్కడ్నించి దకారంగా పారిపోవాలనే కాంక్ష తీవ్రంగావున్నది. శ్యామసుందరి జీవితంలో — మనసులో నిప్పులుపోసిన తను మళ్లీ ఆమె ఎదటనిలబడటం ఘోరమైన దుస్సంఘటన.

జగన్నాథం అందించిన కాఫీ సిప్ చేస్తూ మెల్లగా తన అభిప్రాయం వ్యక్తీకరించేడు.

'నే నింక వెళ్తాను జగన్నాథం!'

'అప్పుడే! ఇక్కడ ఒక్క పూటైనా వుండకుండానా? నిన్నొదిలిపెడ్తాననేనా?'

'కాదు — ఈ సారికి క్షమించు.'

'పిచ్చిగా మాట్లాడకు! భోజనం చెయ్యందే నువ్వు కదలటానికి వీల్లేదు.'

'జగన్నాథం! ప్లీజ్...

'ఏమిటోయ్ నీ కంత అర్జెంటు? రాక ...రాక ఇన్నేళ్లకు దర్శన మిచ్చి ఒక్క రోజైనా నాతో సరదాగా గడుపకుండానా?'


చలపతిరావు ఏటూ మాట్లాడలేని పరిస్థితిలో పడ్డాడు.

వుండటానికి సుతరామూ మనసొప్పటంలేదు.

పోదామన్నా వీలుకానీయకుండా స్నేహసంబంధంతో కట్టివేస్తున్నాడు జగన్నాథం.

చివరకు అయిష్టంగానే వుండిపోయాడు.

డైనింగ్ టేబుల్ దగ్గర వడ్డిస్తూన్న శ్యామసుందరిలో భయాందోళన చిహ్నాలేవు. ఒకరకమైన గంభీరత్వం — నిశ్చలత



చోటు చేసుకున్నయ్.

'మువ్వూ కూచోలేదేం?' అడిగాడు జగన్నాధం భార్యని.

'తర్వాత తింటాను!' ముక్తసరిగా అన్నది.

చలపతిరావు హృదయంలోని ఆందోళనతో సరిగా తినలేకపోయాడు. పసిమిరంగులో సున్నితంగా వున్న చేతుల్తో వడ్డిస్తున్న శ్యామసుందరి చేతుల్ని చూస్తూ అనుకున్నాడు.—' ఆమెకు తనంటే భయం తప్ప అసహ్యం లేదేమో. అసలిదంతా జగన్నాధానికి తెలుసా? తెల్సినా క్షమించి ఆదరిస్తున్నారా?' ఎటూ తేల్చుకోలేని సమస్యలతో ఓ నిర్ణయానికి వచ్చాడతను.

'శ్యామసుందర్ని ఏకాంతంగా కల్సుకుని — ప్రకృతిశక్తుల విజృంభణతో లొంగిపోయిన తన నైతిక ప్రవర్తనని—వ్యక్తిత్వాన్ని క్షమించమని,— ఉద్దేశ పూర్వకంగా తనిక్కడికి రాలేదనీ—విధితన నిక్కడికి నడిపించుకొచ్చిందనీ ప్రాథేయపడి అనవసరమైన అపోహలతో మనసును పాడు చేసుకోవద్దని హెచ్చరించివెళ్ళిపోతాను అవును అదే సరైన పద్ధతి.'

హాల్లో సోఫాల్లో కూర్చుని చిన్ననాటి కబుర్లను గుర్తు తెచ్చుకుని పునశ్చరణ చేసుకుంటూ తాంబూలాలు సేవిస్తున్నారు స్నేహితులిద్దరూ.

జగన్నాధానికి...అర్జెంట్ ఫోన్ కాల్ వచ్చింది.

'పతీ! నే నొక్క పావుగంటలో వచ్చేస్తాను నువ్వు ఈలోగా వెళ్ళిపోయావో మన స్నేహం ఇంతటితో ఆఖరనుకో!'

పతి సమాధానం ఇచ్చేలోగానే డ్రెస్ చేసుకుని వెళ్ళిపోయాడతను.

అనుకోకుండా హఠాత్తుగా ఆ రోజు ఎదురైన పరిస్థితికి ఆశ్చర్యపడ్డాడు చలపతిరావు.' అయినా ఆ శ్యామసుందరి ఇక్కడ ప్రత్యక్షమవుతుందని కలగన్నాడా? చెలికాడు జగన్నాథం ఆమె భర్త అన్న ఊహే లేదు తనలో. కానీయ్. భగవంతు డెన్ని పరీక్షలు చేయదల్చుకున్నాడో!

అవాంఛనీయంగా జరిగిందేదో జరిగింది ఆ సంఘటనతో జీవితాన్నే మార్చుకోవాలనిపించిందా? జీవితంలో ఎన్ని పొరపాట్లు జరిగిపోవటంలేదు? ఎన్ని సమస్యలు ఎదురై పీడించి తొలగిపోవటంలేదు?? అలాగే ఇది

శిక్ష

కూడా. శ్యామసుందరితో తనలో చెడు భావన లేనేలేదని ఒక్కసారి చెప్పేస్తే? ఆమె సంసారాన్ని కూల్రదోయటానికి రాలేదని అభయమిస్తే?

మొండిధైర్యం ఆవహించగా లేచి లోపలి గదిలోకి నడిచాడు.

కిటికీ ప్రక్క ఏదో యోచిస్తూ కూర్చునివున్న శ్యామసుందరి అతన్ని గమనించలేదు.

కొన్ని క్షణాలదాకా నిశ్శబ్దంగా నిలబడిపోయాడు. నెమ్మదిగా చేరుకుని.

'శ్యామ....'

పూర్తిగా పిలవనేలేదు దిగ్గున లేచిందామె. కళ్ళల్లో భయం విస్పహోయత,— పెదవుల్లో వణుకు స్పష్టంగా గోచరిస్తోంది.

'ఏంకావాలి మీకు?' కంగారుగా అడిగింది.

సమాధానం దొరకలేదు చలపతిరావుకి అంతకుముందు చేసుకున్న నిర్ణయాలు మరచిపోయాడు. తడిసిన పద్మాల్లా వున్న ఆమె కన్నులు అతన్ని నిశ్చేష్టుడిని చేసినయ్ మౌనంగా—తదేకంగా చూస్తూ నించున్నాడు శ్యామసుందరిలో కంగారు, అదుర్దా ఎక్కువైంది 'ఏమిటితని వైఖరి! మళ్ళీ తనతో పనేమిటి? అందులో అయన లేకుండా— ఏమిటితని ఉద్దేశం?' వణికిపోయింది నిలువెల్లా.

గుమ్మానికి అడ్డంగా నిల్చునివున్న చలపతిరావు ఆమె కళ్ళకు యముడిలా—పులిలా— ఆకలిగొన్న మృగంలా కన్పించాడు.

'ఏంకావాలి మీకు?' రెట్టించింది.

అప్పటికీ అతన్లో చలనం లేదు.

'ఆ రోజు...చీకిటిలో...మసక వెలుగులో స్పష్టాస్పష్టంగా అవుపించిన శ్యామసుందరిలో ఇంత అందం వున్నదా? ఇంత అమాయకత్వం వున్నదా? పువ్వుకంటే సుకుమారంగా వున్న ఈమె శరీరం స్పృశించగానే తనలో వాంఛ రేకెత్తడంలో అసహజమేమీలేదనిపిస్తోంది. నిజంగా జగన్నాథం ఎంత అదృష్టవంతుడు. ఇంద్రధనస్సులోని మెరుపులా ఈమె సౌందర్యం అనిర్వచనీయం!' ఎంతసేపైనా అలా ఆ కళ్లల్లోకి చూడాలనే కోరిక అతనిలో అధికమైంది. అనుకోకుండానే ఓ అడుగు ముందుకువేశాడు.

చలించిపోయింది శ్యామసుందరి. భీతితో మనసు బండబారిపోయింది అతనికళ్ళల్లోని వాంఛ. స్పందన ఆమెను అవాక్కురాలిని చేసినయ్ మళ్ళీ ఏదో ప్రళయం సిద్ధమవుతోంది.

'ఏంచేయాలిప్పుడు? ఏంచేయాలి?'

అసంకల్పితంగానే మరో అడుగు ముందుకు పడింది. శ్యామసుందరిలో హఠాత్తుగా తెగువ వచ్చింది. 'తన ఆనందానికీ, సంతోషానికీ, మనశ్శాంతికి సమాధి కట్టిన చలపతిరావు తనకు బారెడు దూరంలో నించునివున్నాడు.—తిరిగి అదే తప్పు చేయటానికి సిద్ధంగా. ఆవేశం ఒక్క ఊపు ఊపింది. అతను ఆమె చెయ్యి పట్టుకోవడం, వెంటనే చెంపలు ఫెడీ - ఫెడీమని మ్రోగడం రెప్పపాటులో జరిగిపోయినయి.

ఉచ్ఛ్వాసనిశ్వాసలతో ఆమె గుండెలెగిరిపడుతున్నయి. 'నీచుడా! ఇంకా ఏం చెయ్యదల్చావు నన్ను? తృప్తి తీరలేదా? స్నేహంతో నమ్మించి — ఆపదలో ఆదుకున్నట్టు నటించి — నన్ను పరాభవించి నాశనంచేసింది చాలదా? నీ స్నేహితుడుని కూడా వంచించటానికి సిద్ధపడ్డావు. నువ్వు మనిషివేనా? కాదు పశువ్వి. మానవత్వం కొంచెమైనా నీలో వుండివుంటే— పాపభీతి వుండేది. వెంటనే ఇక్కడినుంచి వెళ్ళిపో దూరంగా. తిరిగి నాకళ్ళబడకు. ఒకవేళ కనిపిస్తే ఏంచేస్తానో నాకే తెలీదు —ఆడది అబల అనుకుంటున్నావేమో! పగరగలాలేగాని ప్రతీకారం చేయందే నిద్రించదు! త్రాచుపాము!' చరచరా వెళ్ళిపోయిందక్కడ్నించి.

అరచేతులను చెంపలమీద వుంచుకుని అలానే విభ్రాంతపడి నిలుచుండిపోయాడు చలపతిరావు అతని కళ్ళిప్పుడు శ్యామసుందరిలోని అందాల్ని వెదకటంలేదు బుసకొడుతూన్న రౌద్రంతో — తన కళ్లను కప్పిన పొరల్ని తొలగించిన ఆమె సాహసాన్ని, సౌశీల్యాన్ని చూస్తున్నయ్. —శ్యామసుందరి నిష్క్రమణతో చలపతిరావుకి తన తప్పేదం తెలిసింది. తనలో సమయంకోసం వేచివున్న దుష్టశక్తుల్ని గమనించి విభ్రాంతుడయ్యాడు—బలహీనత మనిషిని లొంగదీసి

ఇష్టంలేని పనుల్ని చేయిస్తుంది. కాకపోతే ఇదేమిటి? అసలు తనేఉద్దేశంతో వచ్చాడు? జరిగిందేమిటి భగవంతుడా! ఇంకా నన్నిలా జీవచ్ఛవంలా ఉంచకపోతే చావును ప్రసాదించరాదూ? ఇప్పుడు జుగుప్సాపూర్ణం మొహం ఎలా చూడగలడు?' ఎవరో వెన్నంటి తరిమినట్లు వెళ్ళిపోయాడక్కడినుంచి.

వడివడిగా అడుగువేస్తూ తన గదిలోకొచ్చిపడిన శ్యామసుందరి గుండెలు దడదడా కొట్టుకుంటూనే వున్నయ్. మంచంమీద పడుకుని దిండులో తలదాచుకుంది ఊరటగా జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది 'ఎంతటి హీనమైన పరిస్థితిలో పడేశావు భగవంతుడా!' అంటూ రోదించింది కొంచెం సేపు కొన్ని క్షణాల తర్వాత నెమ్మదిగా మనసు కుదుటపడింది ఆలోచిస్తూన్నకొద్దీ తనంటే తన కే ద్వేషం పుట్టసాగింది

'అంతా ఆయనతో చెప్పేస్తే?'

తన మనస్సులోని భారాన్ని దింపుకుని రాధ సలహా తీసుకొంటే?

ఏమని చెబుతుంది? సిగ్గు విడిచి ఆమెతో ఎలా చెబుతూంది? ఎంత విషమపరిస్థితి! ఈ పరిస్థితుల్లో, ఈ అశాంతిలో ఏం చేయాలి?

ఆవేశంలో అతన్ని తీవ్రంగా అవమానించి—దూషించి వచ్చేసింది. ఒకవేళ చలపతి—తనపై కత్తికట్టి—ఆయనతో అంతా చెప్పేస్తే? ఏమని చెబుతాడు? అపరాధం అంతా అతనిలోనే వుందిగా. ఒకవేళ—నింద తనమీదవేసిపితే? అంత ఘోరానికి పాల్పడతాడా? ఏమో? ప్రాణస్నేహితుడి భార్యనైనా తలచక మళ్ళీ అవమానించబోలేనుకో లేదా? అతని కిదో లెక్కా? ఎంతటి క్రూరుడు కాకపోతే నమ్మించి గొంతు కోస్తాడా?

అవును! తప్పకుండా చెప్తాడు.

చెబితే ఆయన నమ్ముతారా?

ఏమో! ఏ క్షణాన మనసు మారుతుందో.

ఛీ ఛీ! ఇలాంటి శంకితమైన బ్రతుకు తన కక్కర్లేదు-

దొంగతనం—చేసినా — బుద్ధి మార్చుకుని బ్రతకొచ్చు! మోసాలు చేసినా — నిజాయితీగా నిలబడొచ్చు! దరిద్రంలో మునిగి తేలుతున్నా—మంచిరోజులకోసం అన్వేషణలో నిరీక్షించవచ్చు! కానీ...కానీ...అనుమానాలతో—కుశంకలతో—అపారమైన జాలితో ఎవరి నీడను మనిషి బ్రతకలేడు. ముఖ్యంగా తను సహించలేదు.

ఏ దురదృష్ట దేవతో తన జీవితంలో ప్రవేశించి వక్రమార్గంలో పడేసింది తన జీవితనావను. స్నేహబాంధవ్యాలకూ — అభిమాన, భీతికీ చెలరేగిన సంఘర్షణ ఇక తను భరించలేదు.

స్త్రీకి అందం అలంకారం అంటారు. కానీ అదే తనకు శాపం అయింది. పరమ శత్రువయింది. తన అహంభావానికి—స్వాతిశయానికి తగిన శాస్తి జరిగింది!! వెక్కి వెక్కి ఏడిచింది మరోసారి శ్యామసుందరి.

'నిర్మలంగా—అప్రతిహతంగా సాగే జీవిత వాహిని కల్మషమైపోయింది.

కానీ...ఆయన్ని ఎంతకాలం ఇలా బాధించాలి? తన అస్వస్థతకు అతను మనస్సులో ఎంత కుమిలిపోతున్నదీ తనకుతెలుసు. అపారమైన అనురాగంతో ఆదరించే అతనిని వంచించి బ్రతుకలేదు. అలా అని జరిగినదంతా పవిత్రంగా చెప్పి అతని దృష్టిలో పతితగా — అధమస్త్రీగా జీవించలేదు. వీటన్నిటికీ ఒకటే మార్గం — సుఖప్రదమైనదీ — శాంతిప్రదమైనదీ — మనిషికి కష్టాలనుంచీ — సమస్యలనుంచీ — బాధలనుంచీ — అశాంతినుంచీ విముక్తి ప్రసాదించేది!'

అదే...'చావు!' గట్టిగా నిర్ణయానికొచ్చింది శ్యామసుందరి.

* * *

రైల్వేస్టేషన్‌లో ఓ మూలగా పశ్చాత్తాపం ముద్దకట్టినట్టుగా కూచుని వున్నాడు చలపతిరావు. ఇద్దరు యువతులు అతనిముందునుంచీ నడిచివెళ్తూ అనుకొంటున్న మాటలు అప్రయత్నంగా చెవులబడినయ్.


'పాపం! శ్యామసుందరి! పూర్ ఫెలో! పండంటి సంసారాన్ని భగ్నం చేస్తూ ఆత్మహత్య చేసుకుంది.'

'అదే నాకూ ఆశ్చర్యమేస్తోంది. ఆమెకలాంటి కష్టమేం వచ్చిందో? ఎప్పుడూ నలుగుర్నీ ఉత్సాహపరిచేది.'

'ప్చ్' ఏమిటోలే! అలాంటివాళ్ళ మనసుల్లోనే అగాధాలుంటయ్. ఏ క్షణాన చావు రాసిపెట్టివుందో ఎవరికి తెలుస్తుంది? ఆమె ఎలాంటిబాధతో ఈ పనికి పూనుకుందో.'

అంతకంటే వినలేకపోయాడు చలపతిరావు.

శరీరం ముచ్చెమటలు పోసింది. కళ్ళముందు మసకమసకగా తెరలేవో కదిలినయ్. చెవుల్లో హోరున—'నువ్వే దోషివి! నువ్వే చంపింది' అనే వికటమైన స్వరాలు అరుస్తున్నయ్. అంతే...దిగ్గున లేచి పిచ్చిగా జుట్టు పీక్కుంటూ వెర్రిగా స్టేషన్ బయటకు పరిగెత్తాడు. ●



సిరియత్

తేజోవతి

'జరిగిన కథ'

శంకరం మాస్టారి ప్రభావంవల్ల వేణు ప్రవర్తన పూర్తిగా మారిపోయింది అతని అక్కయ్య జ్యోతికి ఆనందరావుతో వివాహమవుతుంది ప్రాణస్నేహితులయిన జ్యోతి, రమణలు చాలకాలానికి కలుసుకుంటారు రమణ భర్త వెంకట్రావు. పార్టీ రాజకీయాలతో విరోధివర్గాలయిన కుటుంబాలు వాళ్ళవి పెళ్ళిల్లుం నెపంమీద వేణు సుశీలను చూడ్డానికి జ్యోతి యింటికి వెళ్తుంటాడు తన మీద ఆదినుంచి శత్రుత్వం వహించినా, వరదరాజులు హాస్పిటల్లో వుండడాన్ని విని కలతపడి శంకరంగారు భార్యతోసహా ఆయన్ని చూడ్డానికి వెళ్తారు వేణు సుశీలను వివాహం చేసుకుంటానని వాగ్దానం చేస్తాడు అపవాదుల్ని భరించలేక పార్వతి చదువు మానేస్తానంటుంది కాలేజీలో వేణుకు ఉషతో పరిచయమవుతోంది

22

'ఇక్కడ దగ్గర్లో ఎవరన్నా కంపౌండరు వున్నాడండీ?' ఊళ్ళోకి వచ్చి వాకబు చేసిన వేణుకు, 'ఇలా వెళ్ళి యీ సందు తిరిగేసివారంటే వీరభద్రాచారి అనే కంపౌండరుంటడు బాబూ' అని ఎవరో చెప్పిన గుర్తుల ప్రకారం యిద్దరూ అతడింటికి చేరుకున్నారు

'నిముషంలో యిక్కడ రివిట్టు వేసి యిస్తాను' అని వీరభద్రాచారి చెప్పగానే, తలుపులు మూసిన చీకటి గదిలో కెమెరా 'అన్‌లోడ్' చేసి అతడి చేతికిచ్చాడు వేణు 'మీరిలా కూచోండి మీవాళ్ళను. అలా ఆ గోనెసంచీమీద కూచోమనండి ఇప్పుడే చేసి యిస్తాను' అన్నాడతడు ఎండలో నిలబడివున్న ఉషను చూసి వేణుతో.

ఉష సిగ్గుతో కుంచించుకుపోయింది. వెళ్ళి గోనెసంచి మీద కూచున్నది. మనసు ఏవో మధురమైన కలలు కంటుంటే, ఆ కలల్లో పడిపోయి, పరిసరాలను గూడా మర్చిపోయింది ఉష వేణు యివేవీ విన్పించుకోలేదు అతడు బాగుచేస్తుంటే దీక్షగా చూస్తున్నాడు

'హమ్మయ్య! ఇప్పటికి పని గడిచేలా చేశారు మీ మేలు మర్చిపోలేను' అని అతనికి ధన్యవాదాలు చెప్పి కెమెరా 'లోడ్' చేసుకుని మళ్ళీ బయలుదేరారు

ఈ మాటు ఉషకు అలుపే వచ్చింది ఆయాసపడుతూ మెల్లిగా ఉష ఎగువకు నడుస్తుంటే, కృతజ్ఞతతో వేణు హృదయం నిండిపోయింది 'పాపం మిమ్మల్ని చాలా శ్రమపెట్టాను' అన్నాడు

'ఆఁ ఏం శ్రమ లెండి'

'అయ్యో! ఆయాసపడుతున్నారు పోనీ నా చెయి పట్టుకోండి అంత అలుపుండదు' అంటూ చెయ్యి అందించాడు వేణు ఉషకు ఆ స్పర్శ యిచ్చిన అనుభూతి అంతదాకా పడిన శ్రమను, అలుపును పోగొట్టేసింది ఈ చెయి యిలాగే వుంటే ఎన్నిమైళ్ళు అయినా నడవగలను, అనుకుంది ఉష.

ఉష చేతిని పట్టుకుని నడుస్తున్న వేణు మనసు పరిపరివిధాల పోతోంది తనకు తెలియకుండానే ఆ స్పర్శలోని వెచ్చదనం అనుభవిస్తూ ముందుకు సాగారు

ఇద్దరూ గుడిలోకి వెళ్ళారు స్వామిని చూచారు గుడిలో జనం కిట కిటలాడుతున్నారు.

'అష్టోత్తరం పూజ చెయిద్దామా?' అని ఉష అడిగింది వెంటనే వెళ్ళి టికెట్ కొనుక్కుని వచ్చాడు వేణు ఇద్దరూ కటకటాల పక్కన నిలబడ్డారు చందనపు పూతలో ఉగ్రతను దాచుకున్న స్వామిని చూస్తూ

'తమ గోత్రం?' అని అడిగిన అర్చకునకు గోత్రం చెప్పాడు వేణు.

'సుమధర్మపత్నీ సమేత' అంటూ సంకల్పం చదువుకుపోతున్న అర్చకులు చదువుతున్నది ఏమిటో వినిపించుకునే స్థితిలో లేడు వేణు అతడి కళ్ళలో, కొంగు వేలికి చుట్టుకుంటూ, 'మీకు నమ్మకం లేదా దేముడంటే?..' అని అడుగుతున్న సుశీల మెదిలింది.

'ఏమిటో అంత యిదిగా దేముడ్ని అర్థిస్తున్నారు' అని ఉష అనేసరికి వేణు, 'మీరూ యిందాకటినుంచీ కళ్ళు మూసుకుని ఏమిటో ప్రార్థిస్తున్నారుగా?.. అదేమిటో చెప్పండి ముందు' అన్నాడు చిరునవ్వుతో వేణు

'చెప్పమంటారా!. 'ఈ ఏడులా.. కాకుండా వచ్చేఏడు కొంగూ కొంగూ.. ముడివేసుకు రావాలి స్వామీ' అని' సిగ్గుపడుతూ ఆగి ఆగి చెప్పింది ఉష.

'అయితే ఎవరో అదృష్టవంతుడి పంట పండిందన్నమాట!.'

'ఏమో! ఆ అదృష్టవంతుడు ఎక్కడో వున్నాడని ఎందుకనుకోడం? దగ్గరలోనే వున్నారేమో!' ముసి ముసి నవ్వులు నవ్వుతూ అంది ఉష.

వేణు ఆలోచనలు మళ్ళీ సుశీల దగ్గరకు పరుగెత్తాయి అతడి గుండెలు దడ దడలాడాయి 'మొట్టికాయ మొట్టి మంగళసూత్రం కట్టిస్తాడు' అన్న సుశీల మాటలు చెవుల్లో గింగురుమన్నాయి

'మళ్ళీ ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?' ఉష అతడి ఆలోచనలకు మళ్ళీ అంతరాయం కలిగించింది

'ఆహాఁ ఈ దేముడ్ని యింతమంది భక్తులు కొలుస్తున్నారు కదా ఒకవేళ యిద్దరు వ్యక్తులు పరస్పర విరుద్ధమైన కోరిక కోరితే పాపం! అప్పుడేం చేస్తాడా? అని ఆలోచిస్తున్నాను'

'ఇప్పుడా దేముడొచ్చి సలహా అడగలేదుగా! ముందా హారతి కళ్ళకద్దుకుని, ప్రసాదం తీసుకోండి. ఆయనొచ్చి అడిగినప్పుడు ఆలోచించవచ్చు'

'సరిపోయింది! తీరా ఆయనొచ్చి అడిగితే' వుండండి 'సిరిపురం' వెళ్ళి యిప్పుడే అడిగివస్తాను మా ఉషాదేవిని' అని చెప్పమంటారా?. ముందే తెల్సుకుంటే మంచిది ఎందుకైనా?'

'ఏవరికోరిక న్యాయమైతే వాళ్ళది తీర్చ వయ్యా మహానుభావా!...అదికూడా చెప్పాలా?' అనండి...' నవ్వుతూనే చెప్పింది ఉష...

ఆ తర్వాత యిద్దరూ అక్కడి అరుగుల మీద కూర్చున్నారు కొబ్బరిచిప్పను కొట్టు కుని తింటూ...ప్రసాదం తింటూకూడా వేణు ఏదో ఆలోచిస్తూనే వుంటంతో 'మళ్ళీ ఏమిటండీ ఆలోచిస్తున్నారు?...' అంది చనువుగా ఉష.

'లేదండీ...మీరు ఆ స్వామిని అంత పెద్ద కోరిక కోరారుగదా...మరి మీ కొంగుతో ముడి గలపాలంటే ఆ అదృష్టవంతుడికి చాలా అర్హతలుండాలను కుంటాను?' వేణు ఏటో చూస్తూ అడిగాడు...

'ఆఁ.. ఆఁ...వుండాలి...అందం తెలివి తేటలు, మంచి చలాకీతనం...అన్నిటి కంటె ముఖ్యంగా కమ్మగా వెన్నెల కురిపించినట్లు మాట్లాడ్డం వగైరాలు లేకపోతే ఎలా?'...

'ఆస్తి, అంతస్తూ, ఫారన్ డిగ్రీ ... అవి కూడా వుండొద్దా ప్రొఫెసరుగారి అల్లుడవ డానికి?'

'అన్నిటికంటె ముందు నామనసుకు నచ్చడమనే పెద్ద అర్హతవుంటే చాలు...' అన్నదిఉష వేణును క్రీగంట కనిపెడుతూ...

'అదేమిటండీ! ... ఇదివరలో ఓమాట ఆయన నాతోనే అన్నారు...'ఫారన్ రిటర్న్డ్' అల్లుడు కావాలని?'

'ఆయన వుద్దేశమేమో గానీ ... నాకు నచ్చినవాడూ 'మంచివాడూ' దొరికితే యిద్దరం 'ఫారిన్' వెళ్లి చదువుకుంటే బాగుంటుం దనిపిస్తోంది...'

వేణు మనసులో తటిల్లతలా ఓ ఆలో చన మెరిసి...అంతలోనే మాయమైంది...

* * *

'నాకు నమస్కారం చెయ్యడం ఎందుకు పిల్లా?...దేవుడికి దణ్ణం పెట్టుకుని వెళ్ళక?...' తనకాళ్ళకు వంగి నమస్కారం చెయ్యబోతున్న పార్వతితో అన్నారు శంకరం గారు...

'నా దైవం మీరుకాక యింకెవరు?... అయినా నా అభిలాషను ప్రోత్సహించి, సహాయంచేసిన మీ ఆశీర్వాదం లేకుండా ... అది నెరవేరుతుందా?...' పార్వతి వంగి ఆయనపాదాలు కళ్ళ కద్దుకుంటూ అన్నది...

'అయితే విను.. నువ్వు 'ఉత్తపాస్' అయితే నే నొప్పుకోను ... 'క్లాసు' తెచ్చుకోవాలి సుమా!...' అని సంతృప్తిగా ఆశీర్వదించా రాయన...

నిజానికి పార్వతి గడచిన సెప్టెంబరు లోనే పరీక్షకు వెళ్ళాల్సింది...కానీ అత్తగారి ఆరోగ్యం పూర్తిగా పాడవడంతో పుస్తకాలు కట్టి మూలపెట్టి ఆవిడకు సకలోప



చారాలూ చేసింది రాత్రింబవలు ... అసలు అత్తగారంటే పార్వతికి మంచి అభిమానమూ గౌరవమూను...ఆవిడ స్వభావం శంకరంగారి తల్లికి తగ్గదే...వయసులో ఆఫీసరు భార్యగా నాకు చీరలులేవు, నగలులేవు...అని భర్తను సాధించలేదు ... ముసలితనంలో నాకు కోరి తిండి పెట్టలేదనీ, సుఖపెట్టలేదనీ, కొడు కునుగూడా ఎప్పుడగా అడి పోసుకోలేదు... ఏనాడు చేసుకున్న పాపమో మంచంలో వున్నాను అనుకుంటూ ఆ హారాత్రులూ రామనామం జపిస్తూనే తనువు చాలించిం దావిడ...

జీవితంలో కష్టాలను కడుపులో దాచు కుని, కలిగినదానితో తృప్తిపడి వెళ్ళిపోయిన ఆ సౌజన్యమూర్తి లేని లోటు మర్చిపోలేక పోయింది పార్వతి...అత్తగారు పోయ్యాక

హారాస్సంధ్యా ప్రభాతే...

ఆడబిడ్డ అంత శాంతంగానూ వుండడం నిజంగా పార్వతి అదృష్టమే అనుకోవాలి! ఒకవైపు అత్తగారి జ్ఞాపకాలు బాధపెడుతున్నా, పార్వతి మార్చి పరీక్షకు శ్రద్ధగా చదివింది. శంకరంగారు పార్వతికి పనికివచ్చే పుస్తకాలను లైబ్రరీనుండి తెచ్చిపెడుతుండే వారు.. ఒక్కొక్క 'ఆథర్' మీదవున్న విమర్శలు, వాళ్ళ వాళ్ళ రచనలమీదున్న విమర్శలు అన్నీ చదివి బాగా ఆకళింపు చేసకుంది పార్వతి... లెక్చరరుగారుకూడా ఎంతో శ్రద్ధతీసుకుని చెప్పారు.. పార్వతికి తప్పక క్లాసు వస్తుందనికూడా చెప్పారాయన...

పార్వతి 'ఎగ్జామినేషను సెంటరు' చేరకుని, తన నెంబరు వేసివున్న బల్లదగ్గర వెళ్ళి కూర్చుంది...

సరిగ్గా రెండుగంటలు...కాలేజి బెల్ గణగణా మ్రోగింది, విద్యార్థుల గుండెలు దడదడ లాడేట్లు! ... పార్వతిగుండె ఒక్కసారి ఆగి మళ్ళీ కొట్టుకోడం మొదలెట్టింది.. ఎంతబాగా చదివివచ్చినా, పరీక్షలనగానే ప్రతివాళ్ళకూ కాస్తో కూస్తో భయం వేస్తుంది...అందులోనూ ఆడపిల్లలకు వ ఎక్కువ...

ఎగ్జామినర్ 'ఆన్సరుబుక్స్' పంచారు. మరో ఆయన 'పరీక్షా పత్రాలు' పంచుతున్నారు. వణికే చేతులతో 'ఆన్సరు బుక్ మీద నెంబరువేసిన పార్వతి 'క్వశ్చను పేపరు కోసం కనిపెట్టుకు కూర్చుంది...అందరికీ యిచ్చి తన కివ్వలేదు ఎగ్జామినర్!...

పార్వతి భయంభయంగా లేచి నిలబడి 'నాకు క్వశ్చను పేపరు యివ్వలేదండీ?.. అన్నది...

'నెంబరెంత?...' పరీక్షాపత్రాలు పంచే నాయన దగ్గరకొచ్చి నెంబరు చూశారు.

'ఏదీ మాకిచ్చిన లిస్టులో యీ నెంబరు లేదు...ఈ రూమ్‌కాదు మీది...వెళ్ళండి.. మరెక్కడైనా చూసుకోండి...' అన్నారు తనకేమీ సంబంధంలేనట్లు...

'మరి...మరి.. ఇక్కడ నా నెంబరు. వేసివుంది.. నెంబరు వేసివుంటేనే...వచ్చి కూర్చున్నాను...అందులో... లేడీస్‌ని వేసేది... ఈ ఒక్కరూమ్‌లోనే గదండీ...' అన్నది పార్వతి వణికేస్వరంతో...

'ఇక్కడ నెంబరు వేసుంటే మాకేం? ...మా లిస్టులో లేదు...మీరువేసే ప్రశ్నలన్నీ ఆఫీసులోవాళ్ళను వెయ్యండి. ఊఁ. త్వరగా వెళ్ళాలి రూమ్‌లోంచి...', పార్వతి దయనీయమైన స్థితికి జాలిపడవల్సింది పోగా, నాచరు కటువుగా అన్నాడు...

'మే...ష్టా...రూ!...'సగం పూడి పోయిన గొంతుతో దీనాతిదీనంగా ప్రార్థించింది పార్వతి...

రెండవ వాచరు వచ్చి, 'పోనీ...ఆఫీసులో కనుక్కొని...ఏ పొరబాటు జరిగిందో మనం తెల్సుకువస్తే ?...' అన్నాడు మెల్లిగా మొదటి వాచరుతో...

'నో...నో.. మనకేం సంబంధం ?... ందు రూమ్ అవతలికి వెళ్ళి మాట్లాడు' .అంటూ, నెంబరు వేసిన 'ఆన్సరు బుక్' పార్వతి దగ్గరనుండి లాగేసుకుని వెళ్ళిపోయ్యాడాయన...

పార్వతి నిలువెల్లా వణికి పోతోంది... రీక్షా పత్రాన్నిగురించి ఆయనకు తెలియకపోవచ్చు పొరబాటు ఎక్కడ జరిగిందో ఎలా జరిగిందో తెల్సుకోవలసిన అవసరమూ ఆయనకు లేకపోవచ్చు...కానీ ఆ పరిస్థితుల్లో ంచెయ్యాలో తెలియని, విద్యార్థిని మానక సంక్షోభంకూడా ఆయనకు తెలియదా!

కనీసం ధైర్యంచెప్పి, ఫలానా విధంగా ెయ్యమని చెప్పగలపాటి మానవత్వంగూడా ఆయనలో మిగలలేదా!...పార్వతి ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి ... హాలులో మిగతా విద్యార్థినులంతా మౌనంగా పరీక్ష వ్రాసుకుంటున్నారు.. ఎంతో కష్టపడి చదివి, ఎన్నో ఆశలతో ఆకాంక్షలతో వచ్చిన తనకు రీక్షవ్రాసే అవకాశంకూడా వుండదా...

పార్వతి గుండెలు అతివేగంగా కొట్టుకుంటున్నాయి.. కాళ్ళక్రింద భూమి కంపిస్తున్నట్లుంది పిచ్చిదానిలా రూమ్‌లోంచి యివతకు వచ్చి తలుపు దగ్గరగా నిలబడింది. కనీసం పెన్నుకు కాప్ కూడా పెట్టుకోకుండా...ఏమి చెయ్యాలో పాలుపోక వణుకుతూ నిలబడిన పార్వతిని చూస్తే జాలేసింది రెండవ ఎగ్జామినరుకు ... దగ్గరగా వచ్చి, 'మీరు త్వరగా వెళ్ళి రిజిస్ట్రారును కనుక్కోండమ్మా ఆఫీసులో...' అని సౌమ్యమైనంత మెల్లిగా చెప్పాడు...

ఆ క్షణంలో ఆయన దేముడిలా అనిపిం

పూర్వా సంధ్యా ప్రవర్తతే..

కాదు పార్వతికి ... ఇంచుమించు పరుగెత్తినట్లే నడిచింది...నున్నటి గచ్చుమీద జారి పడబోతే లేడీస్ వెయిటింగ్ రూమ్ వెయిట్రెస్ వచ్చి పట్టుకొంది.. ఇంతా వెళితే 'రిజిస్ట్రారు అక్కడ లేరు !... వెయిట్రెస్ ప్రిన్సిపాల్ రూమ్‌కి తీసుకెళ్లింది...అక్కడ ఆయనా లేరు !...'మీరు...మీ రూమ్‌దగ్గరే నిలబడండి...ప్రిన్సిపాల్‌గారు...అటే వచ్చారు' అని అక్కడున్నవాళ్లు చెబితే మళ్లీ రూమ్ దగ్గరికి వచ్చి నిలబడింది పార్వతి...

ఒక్కో నిముషం గడుస్తుంటే ముచ్చెమటలు పోస్తున్నాయి పార్వతికి. గొంతుతడి ఆరిపోతోంది...ఆ క్షణంలో వెయిట్రెస్ యిచ్చిన మంచినీళ్ళు గొంతులో పోసుకుంటుంటే, చేతి వణుకుకు, నీళ్ళు తుళ్ళికూడాపడ్డాయి. ...ఇంతలో అటేవస్తున్న ప్రిన్సిపాల్‌గార్ని చూపించింది వెయిట్రెస్ ... పార్వతి చేతులు జోడించింది...తర్వాత జరిగిందంతా చెప్పింది ...ఆయన చాలా శాంతంగా అంతావిని చాలా సౌమ్యంగా, 'నేనంతా సరిచూస్తాను. మీరు గాభరా పడకండి ... ఆ రూమ్‌లోకి వెళ్లి కూర్చోండి...పేపరు పంపిస్తాను...' అని ధైర్యం చెప్పి వెళ్లారు...

కాస్సేపటికి పేపరు తీసుకుని ప్రిన్సిపాల్ గారే వచ్చారు స్వయంగా...పార్వతి గుండెలు కుదుటబడ్డాయి, పార్వతి తన సీటులోకి వెళ్లి కూచుంటుండగానే అరగంట బెల్ మ్రోగింది.. 'హడావుడి పడకండి, అరగంట ఎడిషనల్ టైము యిస్తాము మీకు.. 'అని చెప్పి వెళ్ళిపోయ్యారు ఛీఫ్ సూపరింటెండెంట్‌గారు...పార్వతికి అప్పటికి ప్రాణం వచ్చింది. ఫర్వాలేదు ప్రపంచం మంచిచెడుల మిశ్రమం. చెడుతోబాటు మంచికూడా అడుగడుగునా కన్పిస్తూనే వుంటుంది అనుకున్న పార్వతి, పరీక్ష వ్రాయడం మొదలు పెట్టిందే గానీ, ఆ గందరగోళంలో చదివినవి చాలామటుకు మర్చిపోయింది. అయినా అలాగే ధైర్యం చిక్కబట్టి వ్రాస్తోంది ... మొదటిప్రశ్న బాగా వ్రాయలేక పోయినా, రెండవప్రశ్నకు కొన్ని చెదిరిపోయిన పాయింట్స్ అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి యిప్పుడిప్పుడే...పార్వతిలో ఆశ చిగురించింది... తన కలలు, తన భర్త కలలు నిజంకాగల అవకాశాలు కన్పిస్తున్నయ్యన్న వుత్సాహంతో వ్రాస్తోంది పార్వతి...

నాల్గవ క్వశ్చను పూర్తయింది...ఐదు గంటలు కొట్టారు...వాచర్సు పేపర్లు తీసేసుకుంటున్నారు. 'ఛీఫ్ సూపరింటెండెంటు ఎడిషనల్ టైము యిచ్చారుగా' అనే ధైర్యంతో ఐదవప్రశ్న నెంబరు మార్జిన్‌లో వేసింది పార్వతి ...

'టైమయింది పేపరు యిచ్చెయ్యాలి....' వజ్రసదృశ కఠోరవాక్కు...ఉలిక్కిపడి తలెత్తిన పార్వతి ఎదుట, యిందాకటి వాచరును చూచి కృంగిపోయింది ... భగవాన్! ఈయనకు నేనే మపచారంచేశాను! ఎందుకు యిలా పట్టించాడు !..' అనుకుంటూ. 'ప్రిన్సిపాల్‌గారు ఎడిషనల్ టైము యిమ్మన్నారు గదండీ ?...' అంది ఎలాగో కూడగట్టుకుని...

'అవునండీ...ఛీఫ్ టైము యిచ్చారుగదా ...' మెల్లిగా గొణిగినట్లు అన్నారు సెకండ్ ఎగ్జామినర్...

'అయితే—ఆయన గదిలోకివెళ్ళి రాసుకోమనండి...నువ్వు రాసేదాకా కూర్చుంటే నాకెవరన్నా 'ఎక్స్‌ట్రా రెమ్యూనరేషను' యిస్తారా?'...

కత్తి పోట్లల్లా వున్నాయి ఆ మాటలు పార్వతికి !.. దుఃఖం పొర్లివచ్చి కళ్లనిండా నీళ్ళు చిమ్మినయి.. వస్తున్న ఏడుపును దిగమింగుతూ, 'మే షారూ !...కొంచెంసేపు...' రుద్ధమైన కంఠంతో ప్రాధేయపడింది పార్వతి.

'వీల్లేదు.. ఏం నువ్విస్తావా లేక, మీ ఛీఫ్ యిస్తారా రెమ్యూనరేషను ?.. ' అంటూ పేపరు లాక్కుని చక్కా వెళ్ళిపోయ్యాడాయన...

'ఎడిషనల్ టైముకు రెమ్యూనరేషను' ఎవరిస్తారో, ఎవరివ్వాలో రూల్స్ అండ్ రెగ్యులేషన్సు పార్వతికి తెలియవుగానీ కష్టపడి చదివిన విద్యార్థికి పరీక్షా సమయం మూడుగంటలూ, వెలకట్టలేనంత అమూల్యమైంది ... తన తప్పేమీ లేకుండానే పోయిన అరగంట కాలానికి: కరిగిపోయిన కలలకు, కూలిపోయిన ఆశలకు రెమ్యూనరేషను ఎవరు యిస్తారో అడిగే స్థితిలో లేదు ప్రస్తుతం పార్వతి...దుఃఖం పొర్లి వస్తోంది ... కన్నీళ్లు ఆపుకున్నా ఆగడం లేదు.. ఈ చదువుకోసం తను అందరి మనసులూ నొప్పించింది! ఎన్నో అపవాదులు భరించింది ! ఎంతో డబ్బును ఖర్చు పెట్టింది !...తీరా జరిగిందేమిటి? ... సగం స్పృహతప్పిన స్థితిలో మెట్లు దిగుతున్న పార్వతి. తూలి క్రింద పడబోతుంటే, పరీక్ష ఎలా వ్రాశిందో కనుక్కుందామని ఆత్రుతగా పరుగెత్తుకు వచ్చిన శంకరంగారు పట్టుకున్నారు...

* * *

'ఏమండీ!...'

'ఏమిటి జ్యోతీ?...'

'ఈసారి నా దొక్కమాట వినండి...'

'భలే!...అసలు ఆ మాటేమిటో చెప్పకుండానే వినమంటే ఎట్లా వినడం జ్యోతీ!...'

'కాదు...మీరు వింటానని మాటయిస్తే చెబుతాను...'

'ఓహో!...జ్యోతీ!...నువు ఒకటికాదు ... వెయ్యిమాటలుచెప్పినా వింటాను తప్పకుండా ...అయితే ఆచరణలో మాత్రం నేను గారంటీ యివ్వలేను...' అన్నాడు జ్యోతీ



చెప్పబొయ్యే దేమిటో ముందే వూహించు కున్న ఆనందరావు... జ్యోతికాసేపు మాట్లాడ లేదు—తర్వాత...

'అసలు మీరు ఎందుకు ఎలక్షన్సులో పోటీ చేస్తున్నారు ?... మీ వుద్దేశం ఏమిటో చెప్పండి...' అంది...

'ఎలక్షనులో పోటీచేసేది ... సర్ పంచ్ అవడానికి... గ్రామప్రజలకు, గ్రామానికీ సేవ చెయ్యడానికి...'

'సేవంటే ?'

'సేవంటే !... గ్రామాభివృద్ధికి పాటు పడడం, గ్రామప్రజలకు వీలైనన్ని సదుపా యాలు కల్పించడం...'

'అంటే యువజనసంఘ కార్యాలయాలకు తాళాల మీద తాళాలు వెయ్యడం. ఏడాదికో మాటు రిఎలక్షన్సు జరుపుకోడం! ఊరికి రాబోతున్న సౌకర్యాలను గూడా పార్టీ కక్ష లతో రాకుండా చేసుకోడం యిదంతా గ్రామాభివృద్ధే నంటారా?...' జ్యోతి మాటిగా అడిగేసింది...

ఆనందరావు క్షణంసేపు ఆలోచించాడు...

'నువ్వుచెప్పేది నిజమే జ్యోతీ!.. కానీ ఏం చెయ్యమంటావు చెప్పు...నేను మన స్ఫూర్తిగా మన గ్రామానికి యీ సౌకర్యం కలిగించాలని అనుకున్నప్పుడు ఆవెంకట్రావు వాళ్ళు నడవివ్వక పోతుండిరి ... ఏం చెయ్య మంటావ్ చెప్పు!'

'వాళ్ళు తలపెట్టిన మంచిపనులు మీరు మాత్రం ఏం సమర్థించారు గనుక... నేనిలా అన్నానని బాధపడకుండా ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోండి...'

'అది నిజమే జ్యోతీ...కాదనను...కానీ ఎందుకలా చేశానంటావ్?... అవన్నీ రాజ కీయపు యెత్తుగడలు... ఓట్లు కొట్టేయ వచ్చుగదా అని వాళ్ళు ప్లానువేస్తే, మేము ఎత్తువేసి వాళ్ళఎత్తులు పడ్డకొట్టించడంలో తప్పేముంది?'

'పోనీ. మీకు గ్రామాభివృద్ధి, గ్రామ సౌభాగ్యమే ఆశయమైతే పోనీ మేము గ్రామ సేవ చేస్తామంటూ పోటీపడుతున్న వాళ్ళకే ఆపదవి ఒదిలేసి మీరు ఏ ఎలక్షనులో నిల బడకుండా, ఏపదవీ లేకుండా ప్రజా సేవ చెయొచ్చుగా...ఏమంటారు?..'

ఆనందరావు ఏమీ జవాబు చెప్పలేదు... ఆలోచిస్తూ మౌనంగా వూరుకున్నాడు.

'నిజంగా చెప్పండి...మీరు కోరేది గ్రామ ప్రజల సుఖమేనా?...గ్రామ సౌభాగ్యం సాధించడమే నిజంగా మీ ఆశయమా?' జ్యోతి ఆనందరావు మొఖంలోకి చూస్తూ మళ్ళీ అడిగింది...

'నిజం జ్యోతీ! ... మనవూరిని స్వర్గ తుల్యం చెయ్యాలని, పాడిపంటలతో సుభి క్షం చెయ్యాలనీ నాకోరిక...ఈ వూర్లో చక్కని భవనాలు కట్టించి హైస్కూలో పెట్టాలని, దానికి మంచిలైబ్రరీ, లేబో రేటరీ, ప్లేగ్రౌండ్, దాన్ని యించుమించు ఓమాడల్‌స్కూల్‌లా తీర్చి దిద్దాలని, ఈ వూరికి ఒక పి హెచ్ సి. తేవాలని, మంచిరోడ్లు వేయించాలని, దీన్ని ఓ దేవేంద్రనగరంలా తయారుచెయ్యాలనివుంది కానీ ఏం చెయ్యను...ప్రతిదానికీ వాళ్ళు అడ్డుపడ్తుంటే, వాళ్ళమీద దెబ్బతియ్యాల్సి వస్తుండె...కానీ ఒకానొక రోజుకు వాకలలు



పూర్వాసంధ్యా...

ఫలిస్తాయి జ్యోతి!.. ఒకనొక రోజుకి నేను తప్పకుండా సాధిస్తాను చూడవా వీటిని...' అని చెప్పాడు ధీమాగా ఆనందరావు...

'మీరు నిజంగా గ్రామాభివృద్ధి కోరుతున్నారు కాబట్టి యీమాటు ఎలక్షన్సులో పోటీ చెయ్యకుండా విరమించండి.. ఈ ఎలక్షనుకు, యీ తగాదాలకు, యీ కోర్టులకు పోసినడబ్బుతో మీరు నిజంగా నే హైస్కూల్ కట్టించగలరు ... ఇంకా ఎన్నో చెయ్యగలరు...నామాటవిని ఈసారి ఎలక్షనులో పోటీచెయ్యకండి...ఒక్క కుటుంబంలా మెలగవల్సిన గ్రామంలో ఈ పార్టీలు కక్షలు ఎందుకు చెప్పండి...కక్షలు అభివృద్ధిని సాధించలేవు .. విభేదాలు పురోగమనానికి పాయపడవు...ఈ ఒక్కసారి నామాట వినండి దయచేసి...'జ్యోతి ఆనందరావు రెండుచేతులూ పట్టుకుంది బతిమాలుతూ...

ఆనందరావు బరువుగా నిట్టూర్చాడు...

'క్షమించు జ్యోతీ! ... ఈ ఒక్కసారే నీమాట వినలేను క్షమించు...ఈ ఒక్కసారి నన్ను పోటీచెయ్యనియి...ఇప్పుడు మానేస్తే 'ఓడిపోతాననే సందేహం వచ్చింది...అందుకనే విరమించాడని ప్రచారం చేస్తారు వాళ్ళు...నువ్వేమన్నాఅను...అది నేను సహించలేను జ్యోతీ...ఆనందరావు పిరికిపందకాడు.. అతడు వెనుకంజ ఎందులోనూ వెయ్యడు... ఏనాటికీఓటమి ఒప్పుకోడు...కావాలంటే ఈ ఎన్నికలు జరిగాక, నేను గెలిచిన మరుక్షణం ఆపదవికి రాజీనామాయిచ్చి వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకుని, అట్లా అతడికి అప్పగిస్తాను...ఆ తర్వాత నువ్వు చెప్పినట్లు తప్పకుండా గ్రామాభివృద్ధికే పాటుపడతాను జ్యోతీ...నా ప్రాణాలు, ఈ గ్రామాభివృద్ధి సాధించటానికి ధారపొయ్యదల్చుకున్నాను...కానీ యిప్పుడు మాత్రం పోటీచెయ్యకుండా వుండలేను...ఇది ఆనందరావు పరువూ ప్రతిష్ఠకు సంబంధించిన ప్రశ్న...క్షమించు జ్యోతీ! ...' అంటూ జ్యోతి జవాబుకోసం కూడా ఎదురు చూడకుండా లేచి వెళ్ళిపోయ్యాడు ఆనందరావు...

రెండు చేతుల్లోనూ తలపెట్టుకుని దిగులుగా కూర్చుంది జ్యోతి ఆలోచిస్తూ...

(ఇంకా వుంది)

అభియోగాలలో వింతలు

గృహిణిని బెదిరించి వశపరచుకోవాలని ప్రయత్నించిన కౌన్సిలర్

కౌన్సిలర్ విలియమ్ ఆక్లెండ్ వయస్సు 48 సంవత్సరాలు. ఒక గృహిణి ప్రేమను సంపాదించడమే అతని జీవిత లక్ష్యమని న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీ ఎడ్విన్ జోవిట్ చెప్పారు.

అంగీకరిస్తే పురపాలక సంఘం కట్టించిన నివాసగృహాలలో ఒకదాన్ని ఇప్పిస్తానన్నాడు శ్రీమతి క్రిస్టైన్ గిల్బర్ట్. అంగీకరించలేదు ప్రేమలేఖలను బహిరంగపరచి అప్రతిష్ఠ పాలయ్యేట్లు చేస్తానని ఆక్లెండ్ బెదరించాడని నాటింగ్‌హామ్ షైర్ న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాది చెప్పాడు. ఇంకా అలా అన్నాడు: 'వ్యామోహమెక్కువైన కామాంధుడు మాత్రమే కాదు ఆక్లెండ్. బ్లాక్‌మెయిల్ చేసే దుష్టుడు కూడా శ్రీమతి క్రిస్టైన్ గిల్బర్ట్‌నుంచి అతను కోరిన దేమిటి? డబ్బుకాదు. ఆమె శరీరాన్ని వాంఛించాడు.

'అంతేగాదు. ఈ నిందితుడు మోసగాడు కూడా. మరొకరితో శ్రీమతి గిల్బర్ట్ ప్రేమ వ్యవహారం సాగించిన సంగతి ఇతనికి తెలుసు. దాన్ని ఉపయోగించి శ్రీమతి గిల్బర్ట్‌ను లోబరుచుకోవాలని యత్నించాడు.

'ఆక్లెండ్ కుటుంబంతో శ్రీమతి గిల్బర్ట్‌కు నాలుగు సంవత్సరాలుగా పరిచయమున్నది. ఆక్లెండ్ లేనప్పుడు అతనిఇంట్లో పనిచెయ్యడానికి వెళ్ళేది శ్రీమతి గిల్బర్ట్.

'ఆమెమీద కన్నువేసిన సంగతి ఆమెకు తెలియజేసే వేషాలన్నీ వేశాడు. వాళ్ళయింటికి వెళ్ళేప్పుడు శ్రీమతి గిల్బర్ట్ తన బిడ్డలలో ఒకరిని తోడుతీసుకువెళ్ళేది. బిడ్డలలో ఒకడు బళ్ళోచేరాడు కిందటి సెప్టెంబరులో. పని మానివేసింది శ్రీమతి గిల్బర్ట్.

'ఆ తరువాత ఆమెను కలుసుకుని, నీ ప్రేమను సంపాదించడమే నా జీవిత లక్ష్యమనేవాడు. లాభం లేకపోయేప్పటికి నీ బాల్య ప్రేమ సంగతి నీ భర్తకు చెబుతానని బెదరించాడు.

'పోలీసులకు ఫిర్యాదు చేస్తానని శ్రీమతి గిల్బర్ట్ బెదరించింది. రుజువేమీ లేదు నీ దగ్గర' అన్నాడు ఆక్లెండ్.


'ఒకసారి ఆమె పక్కన మోకరించి తన ప్రేమను వెళ్ళబుచ్చుకున్నాడు. ఇదంతా అసహ్యంవేసి ఆమె నవ్వేసింది.

'ఆ తరువాత ఆకాశరామన్న జాబులు వ్రాస్తానని రెండుసార్లు బెదరించాడు. విసిగిపోయింది శ్రీమతి గిల్బర్ట్. రాయవయ్యా రాయి. ఇప్పుడుమాత్రం దయచెయ్యమన్నది. ప్రయోజనం లేకపోయినది. ఒక పళ్ళెం విసరివేసినది ఆక్లెండ్‌మీద.

చివరికి శ్రీమతి గిల్బర్ట్ పోలీసుల సహాయం అర్థించినది. పోలీస్ అధికారులు ఆమెయింట దాగిఉండగా జాబులసంగతిని ఆమె ఆక్లెండ్‌ను అడిగింది. వాటి సంగతి తనకేమీ తెలియదన్నాడు. మొదటవేలి ముద్రల సంగతి ఆమె ప్రస్తావించింది. వాటన్నింటినీ తుడిచివేశానన్నాడు.


—వి. ఎస్. అవధాని.

ఆల్లాటప్పయ్య



తామరాకుపై నీటిబిందువు

సూర్యప్రభ



మనిషి వూహాజీవి. అతడు వూహలలో విహరిస్తాడు. కలలలో జీవిస్తాడు. అందని వాటివి ఎన్నిటివో వూహలలో అందుకో గలుగుతాడు.

నిజజీవితంలో అనుభవించలేని ఆనందా లను కలలలో అనుభవించటానికి ప్రయ త్నిస్తాడు.

వాస్తవ పరిస్థితులను గమనించకుండా భవిష్యత్తును అందంగా వూహించుకుంటాడు మానవుడు. కానీ వూహలనుండి కలలనుండి తెప్పరిల్లి వాస్తవాన్ని గ్రహించిననాడు ఆ మానవుడు తన తెలివితక్కువతనానికి విచా రిస్తాడా? లేక నిప్పులాంటి నిజం కాల్చిన మచ్చను చూసుకుని క్రుంగిపోతాడా? ఏమో, ఎవరికి తెలుసు?

నిజాన్ని తెలుసుకున్ననాడు ఆ మానవుని మనస్తత్వాన్ని వర్ణించటం ఎవరికి సాధ్యం? భగవంతునికి తప్ప మరెవ్వరికీ అర్థం కాదు అతని ఆవేదన!

విధిలిఖితం అని నిట్టూర్చాలి కోటి మానవులు, అంతే! అంతకన్నా ఏం చెయ్య గలరు?

'నాన్నా! నాన్నా! మరేమో మీ......' స్కూలునుండి ఇంటికి రాగానే తన మాటల మూటను మెల్లిగా విప్పసాగింది రేవతి.

'కబుర్లు తర్వాత చెపుతూగానమ్మా! లోపలికి వెళ్లి మనింటికి ఎవరు వచ్చారో చూడు. చూసి...'తండ్రి రాఘవరావు మాట పూర్తవ్వకముందే అతని వడిలోంచి కిందకి దూకి లేడిలా లోపలకు పరుగెత్తింది రేవతి.

వంటింట్లో పీటమీద కూర్చున్న యువ తిని చూసి తల్లిమెడ చుట్టూ చేతులు వేసి 'అమ్మా! ఆవిడెవరే?' అంటూ ముద్దుగా అడిగింది రేవతి.

మానసిక సంక్షోభాన్ని అణచుకుంటూ తలెత్తి కూతురి కళ్లల్లోకి చూసింది సుమిత్ర 'గుర్తుపట్టలేదూ, నువ్వు:'

ఆశ్చర్యంగా తల్లి మొహంలోకి చూసింది రేవతి 'ఎవరబ్బా ఆమె?'

'రేవీ'! అంటూ పిలిచే నీ శ్యామత్తని మరిచిపోయావా?' .మళుముళ్ళుగా తిరుగు తున్న కన్నీటిని అతి బలవంతంమీద నిగ్ర హించుకుంటోంది సుమిత్ర.

'శ్యామత్తా! నిజం? అదేమిటి మరి...' ఆశ్చర్యాంబుధిలో మునిగిన రేవతి వింతగా శ్యామల కళ్లల్లోకి తదేకంగా చూస్తూ వుండిపోయింది. చిన్నప్పుడు తాను చూసిన శ్యామత్త ముహం లీలగా మెదిలింది రేవతి కళ్ళముందు. 'శ్యామత్త ఇలా మారి పోయిందేమిటి? ఆ కళ్ళల్లో మెరుపు లేవి?'

'ఏమిటలా చూస్తున్నావ్ రేవతీ! మన శ్యామత్తే!'

'మరి...మరి...అత్తయ్య ఇన్నాళ్ళు ఎక్కడుంది?'

'రఘు చిన్నాన్నగారింట్లో వుంది. విన్ను చుద్దామని...' మాట మధ్యలో ఆపేసి శ్యామలవైపు చూసింది సుమిత్ర. అప్పటి వరకూ నిర్జీవమయిన నేత్రాలతో చూస్తున్న శ్యామల పాలిపోయిన మొహాన్ని కిందకు వంచకుని పంటితో గట్టిగా పెదవిని నొక్కిపట్టి వుంచింది. కన్నీటిని కారనీయ కుండా ఆమె చేసే ప్రయత్నం ఒక్క క్షణంలో గ్రహించగలిగిన సుమిత్ర చప్పున

మాట మార్చేసి 'అత్త దగ్గరకు వెళ్ల మ్మా' అంటూ కూతురు చేతిని శ్యామల చేతిలో పెట్టింది తన చేతిని పట్టుకున్న అత్త చెయ్యి విపరీతంగా వణకటం గమనించిన రేవతి ఆమె ముఖం వేపు, ఆ కళ్ళ వేపూ పరీక్షగా చూడసాగింది. క్షణాలు సెకండ్లుగా, సెకండ్లు నిమిషాలుగా మారి పోతున్నాయి.

ఆ భయంకరమైన నిశ్శబ్దంలో రేవతి మాటలు ప్రతిధ్వనించాయి. 'అమ్మా! ఏమిటలా వున్నారు?'

సుమిత్ర తుళ్ళిపడింది. 'శ్యామలా! జరిగిందేదో జరిగిపోయింది. పూర్తిగా నువ్వది మరిచిపోవాలి. ప్లీజ్, నా మాట విను శ్యామలా! ఈ వదిన నిన్ను కంటిలో పాపగా చూసుకుంటుంది. నాపై ఆ మాత్రం నమ్మకం వుంచలేవా?'

'లాభంలేదు ఒదినా! నా జీవితగతినే మార్చివేసిన ఆ దుష్ట ఘడియ ప్రభావం నా మనస్సుపై చెరగని ముద్రగా నిలిచిపోతుంది. వేళ్ళు పాతుకుపోయిన వాలోయీ భావాన్ని మార్చటం మరెవరికి సాధ్యం కాదు.' కాంతిలేని కళ్ళను పైకెత్తి కంపిస్తున్న కంఠస్వరంతో అంది శ్యామల 'కానీ...కానీ... ఈ మనస్సుని నువ్వు పట్టించుకోకు వదినా!'

బాధగా నిట్టూర్చింది సుమిత్ర 'పట్టించుకోకపోవటానికి ఇది రాతి హృదయం కాదు శ్యామలా! క్షణక్షణానికి నువ్విలా బాధపడుతూంటే నేను ఎలా సహించగలను? నా కళ్ళముందు ఆడుతూపాడుతూ తిరిగిన నువ్వు, ఈ నాడిలా దుఃఖంతో కృంగిపోతూవుంటే చూసీ చూడనట్టుగా వుండటానికి నేను రాక్షసిని కాదే?'

'లేదు వదినా లేదు.' తల అడ్డంగా వూపుతూ అంది శ్యామల 'నేను ఎంత సుకుమారంగా పెరిగానో నీకు తెలుసు అన్నయ్యకన్నా నన్ను నువ్వే బాగా అర్థం చేసుకున్నావు. నువ్వేమయినా చెప్పదలచుకుంటే నా మనసుకే చెప్పు. సుమిత్ర వదిన మంచితనం నాకు తెలియంది కాదుగా?'

అప్రయత్నంగా సుమిత్ర కళ్ళు చెమ్మగిల్లాయి. వాత్సల్యంగా శ్యామల తల నిమురుతూ అందామె. 'ఉహూ, నే నంత మంచిదాన్నా! పిచ్చి శ్యామా! స్త్రీ హృదయం స్త్రీకే అర్థం అవుతుంది. కన్నతల్లిగా కాపాడటం కాదు. పెంచినతల్లిగా అదరిస్తుంది శ్యామలా ఈ వదిన నిన్ను.'

'కృతజ్ఞురాలిని వదినా! ఒక విషయం చెప్తాను. వింటావూ?'

'ఏమిటది? కథా?'

రేవతి కళ్ళల్లో కుతూహలం తొంగి చూసింది.

'కాదు. నా సున్నిత మనస్తత్వాన్ని వివరించే సంఘటన!...'

'ఓహో' సుమిత్ర తృప్తిగా నిట్టూర్చింది.

'తాతయ్యకి ఒక మిల్లులో వాటావుండేది నాన్న అందులో మేనేజరుగా వుండేవారు. తాతయ్యకి, తక్కిన వాటాదార్లకి పేచీ వచ్చింది. తాతయ్య తన వాటా వదులుకుని స్వంత వూరు వెళిపోయారు. తాతయ్య అక్కడనుండి నాన్నకి వుత్తరం వ్రాశారు 'వెంటనే మిల్లులో వుద్యోగానికి రాజీనామా ఇచ్చేసి కుటుంబంతో ఇక్కడకు వచ్చేయండి నేను ఇక్కడ మిల్లు కొంటాను మీా కిందులో వుద్యోగం ఇస్తాను. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. వెంటనే బయల్దేరి రావలసింది.' నీటికి పాలకి భేదం తెలియని నాన్న వుద్యోగానికి రాజీనామా ఇవ్వటానికి నిశ్చయించుకున్నారు. అమ్మ ఎంతో బ్రతిమాలింది నాన్నని. అమ్మకి ఎంతమాత్రమూ ఇష్టంలేదు పుట్టింటికి వెళ్ళటానికి! దూరంగా వుంటేనే ప్రేమలూ, అభిమానాలూ పుట్టుకువస్తాయి. మనిషి కళ్ళెదురుగా కనిపిస్తే ఆ ప్రేమాభిమానాలూ మారురూపుదాల్చిన మంథర రూపంలో ప్రత్యక్షమవుతాయి. మానవుల తత్వాలను అమ్మ అర్థం చేసుకున్నంతగా నాన్న అర్థం చేసుకోలేకపోయారు. అది నా చిన్నతనం. తెలిసీ తెలియని వయస్సులో వారి మాటలను శ్రద్ధగా ఆలకించాను, నా చిన్ని మనసులో ఎన్నో వూహలు చెలరేగాయి. తాతయ్యపై నమ్మకంతో నాన్న వెంటనే వుద్యోగానికి రాజీనామా ఇచ్చారు. కానీ! నాకు మాత్రం అమ్మమాటలే నచ్చాయి. ఎందుకనో! ఫలితం తాతయ్యపై కోపం ముంచుకువచ్చింది నాలో ప్రతి అణువూ ప్రతీకారం అంటూ అరుస్తుంది. కానీ అంత పెద్ద తాతయ్యపై ఎనిమిదేళ్ళయినా నిండని నేను ఎలా తీర్చుకోను ప్రతీకారం. తాతయ్య యింట్లో అడుగు పెట్టాం. నా కళ్ళు ఆ యింట్లోని ప్రతి అంగుళాన్నీ నిశితంగా పరిశీలిస్తున్నాయి. ప్రతీకారానికి ఏదైనా పరికరం దొరుకుతుందేమోనని కామోసు? నాకళ్ళు అప్రయత్నంగా హాల్లో ఒక మూలన పెట్టివున్న తాతయ్య చెప్పులమీాద పడ్డాయి. పళ్ళు గట్టిగా బిగపట్టి నా శక్తికొద్దీ ఆ చెప్పులను తన్నసాగాను. తాతయ్యపై ఎలా నా పగను తీర్చుకోవాలా అని ఆలోచిస్తున్న నేను —నాకు అందుబాటులోవున్న ఆ చెప్పులపై నా పగ తీర్చుకుంటున్నాను. అవి తాతయ్య చెప్పులనీ, వాటిని అలా తన్నడం తాతయ్యకు అగౌరవం చెయ్యటమే నని నాకు ఎవరు చెప్పారు? ఉహూ, ఎవ్వరూ చెప్పలేదు. అయినా ఆ సమయంలో నన్నెవరైనా చూస్తే చిన్నపిల్ల ఆట అని అనుకుంటారేగానీ నా మనసులోని వుద్దేశం ఎవరికీ అర్థంగాదు. అలా చెప్పులను తంతున్న నేను నాన్న దృష్టిలో పడ్డాను. 'తప్పమ్మా! అలా తన్నకూడదు. తాతయ్య చూస్తే ఏమనుకుంటారు?' నా మనసులోని పగను నాన్న అర్థం చేసుకున్నందుకు విజయగర్వంతో నవ్వాను

'శ్యామత్తకు కోప మెక్కువ' కళ్ళు చిత్రంగా తిప్పుతూ అంది రేవతి.

'మొగవాళ్ళయినా మీా అన్నయ్యలకు రోషం రాలేదనుకుంటా' సుమిత్ర అడిగింది.

'అలా అనుకోవటం పొరపాటు వదినా! కోపానికి స్త్రీ పురుష భేదంలేదు ఒక్కొక్కళ్ళ మనస్సులు అంత సున్నితంగా వుంటాయి మరి.'

'అవును శ్యామలా! సత్యభామలా అభిమానవంతురాలివి.' పక్కున నవ్వింది శ్యామల. 'సత్యభామకున్న అహంకారం మాత్రం నాకులేదు వదినా!'

'అయితే శ్యామత్తకు శ్రీ కృష్ణుడు లాంటి మామయ్యనిచ్చి పెళ్ళిచెయ్యాలి.' అల్లరిగా చప్పట్లుకొడుతూ అంది రేవతి.

నవ్వుతున్న శ్యామల మొహం నల్లబడిపోయింది

అది గమనించిన సుమిత్ర కోపంగా చూసింది రేవతిని

'బొత్తిగా మంచి మర్యాదా లేకుండా మాట్లాడుతున్నావు రేవతీ! పెళ్ళీ పేరయ్యలా మాట్లాడటానికి నీకంత పెద్ద వయస్సా.'

సుమిత్ర కటువుస్వరానికి కలవరపడి

పోయింది. శ్యామల 'పాపకేం తెలుసువదినా! చిన్నతనం. నేను ముందేచెప్పాను. నామనసు అలా ఫీలయినప్పుడు నువ్వే నన్ను మంద లించాలి. ఎందుకంటే నువ్వే అన్నావ్ 'పెంచిన తల్లిగా నన్ను ఆదరిస్తానని.'

తామరాకుపై నీటిబిందువు

'మందలించనూ మరి మూడు చెరువుల నీళ్ళుకూడా తాగిస్తాను' సుమిత్ర మనసు అంతులేని సంతృప్తితో నిండిపోయింది. 'భగవాన్! శ్యామలకు వావల్ల ఏ కష్టమూ కలగకుండా కాపాడు తండ్రీ!' మనస్సులో భగవంతుని వేడుకుందామె 'రేవతి ! శ్యామత్తను హాల్లోకి తీసికెళ్ళమ్మా!'

బిత్తరపోయి చూస్తున్న రేవతి ముఖంలో ఆనందపు రేఖలు తళుక్కు మన్నాయి. 'శ్యామత్తా! రావెళ్దాం నీకు బోలెడు కబుర్లు చెప్తాను, రా మరి' అంటూ ఆమె చెయ్యి పట్టుకు లాగసాగింది రేవతి. ఆపిల్ల చేతిని మరింతగా బిగించి పట్టుకుని వంటింట్లో నుండి గదిలోకి వెళ్ళింది శ్యామల.

'కూర్చో శ్యామత్తా! ఇవన్నీ మనకుర్చీలే' అమాయికంగా శ్యామల మొహంలోకిచూస్తూ అంది రేవతి.

ఫక్కున నవ్వి రేవతిని తన పక్కన కూర్చోబెట్టుకుని మృదువుగా అడిగింది శ్యామల 'నీ పేరేమిటి పాపా !' కిలాకిలా నవ్వింది రేవతి. తెరలు తెరలుగా వస్తున్న నవ్వును ఆపుకోలేక మరింత బిగ్గరగా నవ్వింది. వంటింట్లో పనిచేసు కుంటున్న సుమిత్ర తృప్తిగా నిట్టూర్చింది 'శ్యామల రేవతిని బాగా నవ్విస్తున్నట్టుంది' అలలు అలలుగా వస్తున్న నవ్వును ఆపుకోలేక ఇంకా ఇంకా నవ్వుతూనే వుంది రేవతి. సుమిత్ర అనుమానంగా ముఖం చిట్లించి గదిలోకి వచ్చింది.

తల్లిని చూడగానే రేవతి నవ్వుని ఆపుకోవటానికి ప్రయత్నిస్తూ అంది. 'అమ్మా! మరే...మరే...శ్యామత్త... నాపేరు .. పేరేమిటని అడుగుతోంది. చిన్నప్పుడు నన్ను.. నన్ను... ఎంత ముద్దు ముద్దుగా పిలిచేదీ రేవీ! అని' కళ్ళలో తిరిగిన నీటిని తుడుచుకుంటూ ఆయాసపడుతూ ఆగి పోయింది రేవతి.

'ముద్దుకి అడిగింది నువ్వేం చెప్తావో అని, అంత మాత్రానికే అలా నవ్వాలా? చూడు శ్యామత్త మొహం ఎలా ఎర్రబడి పోయిందో.'

చటుక్కున తలతిప్పి శ్యామల వేపు చూసి 'శ్యామత్తా!' అంటూ వెక్కివెక్కి ఏడ్చేసింది రేవతి. బాధగా కణతలు నొక్కు కుంది శ్యామల. 'ఛ, ఏమిటి? ఇంతలా దిగజారిపోతున్నాను. నా మనస్సుకి కొంచెం కాఠిన్యం కూడా ప్రసాదించు తండ్రీ!'

శ్యామల అనునయంగా రేవతి తల నిమి రింది. 'రేవీ! తప్పమ్మా ఏడవకూడదు. ఏదీ తలెత్తు. ఊఁ, నవ్వాలి మరి.'

'ఊహూఁ, నేనిక నవ్వను శ్యామత్తా!' తల అడ్డంగా వూపింది రేవతి.

వారి సంభాషణను ఆలకిస్తున్న సుమిత్ర ఫక్కున నవ్వేసింది.

'నీ మేనకోడలికి నీ పోలికలే వచ్చాయి. కానీ, ఏమన్నామోయ్ ఆడబడుచూ! మనసుని కొంచెం మందలించవమ్మా' అంటూ వెళ్ళి పోయింది సుమిత్ర.

తేలికగా నవ్వేసింది శ్యామల. 'విన్నావా? అమ్మ మాటలు. నాతో బోల్డు కబుర్లు చెప్తానన్నావ్ ఏదీ? నువ్విలా ఏడుస్తూ కూర్చుంటే నేను ఏడుస్తానంతే!'

రేవతి చప్పున శ్యామత్త వడిలోంచి దిగి 'నీకు నా బొమ్మల పుస్తకాలు చూపించనా శ్యామత్తా!' అని అంది.

'ఊఁ, తీసుకురా మరి.'

అలమారులో వున్న తన పుస్తకాలన్నీ అత్తముందు పెట్టింది. 'ఇది నా డ్రాయింగు పుస్తకం. ఈ పువ్వు నేనే వేసాను. ఆవు బొమ్మ వెయ్యటం నాకు రాలేదు మాష్టారు వేసిపెట్టారు. స్కూలు తెరిచి నెలేగా అయ్యింది. ఈ రెండు బొమ్మలే వేసారు. వచ్చేవారం మరోబొమ్మ వేస్తారట మాష్టారు' ఉత్సాహంగా చెప్పుకుపోతోంది రేవతి.

'నువ్వేసిన బొమ్మేది?'

'ఇదిగో, ఈ పువ్వు బొమ్మ నేను వేసాను.'

'చాల బాగుంది'

'ఫో, అత్తా! వేళాకోళం చేస్తున్నావు. ఈ బొమ్మని చూసి మాష్టరు నన్ను కోప్పడ్డారు.' బుంగమూతి పెట్టిందిరేవతి.

'ఛ, లేదమ్మా! వేళాకోళం కాదు. నిజం, నా మాట నమ్ము మాష్టార్లు అలానే అంటారు. 'బాగా వేసారు' అని మిమ్మల్ని మెచ్చుకుంటే తరువాత బొమ్మల్ని మీరు నిర్లక్ష్యంగా గీసేస్తారేమోనని వాళ్ళ భయం.'

విశాలమయిన కాటుక కళ్ళను మరింత పెద్దవిగాచేసి అత్త కళ్ళల్లోకి చూసింది రేవతి.

'మాకు సైన్సూ లెక్కలూ ఒకే మాష్టారు చెప్పేవారు. ఆ మాష్టారు ఇలా అంటూండేవారు. 'మాష్టార్లు అస్తమానూ పిల్లల్ని మెచ్చుకోకూడదు. దానికీ సమయం అంటూవుంటుంది. అనుగ్రహించే మాష్టర్ల కన్నా ఆగ్రహించే మాష్టార్లే పిల్లల మనస్సులో శాశ్వతంగా నిలిచిపోతారు' అంత వరకూ గంభీరంగా మాట్లాడిన మాష్టారు మావేపు చూసేవారు 'కానీ ఈ శిష్యురాళ్ళు వున్నారే నిజంగా రాళ్ళే! మావద్ద చదువుకుంటున్నప్పుడు మాష్టారూ; మాష్టారూ అంటూ శిష్యరికం వెలిగిస్తారు. స్కూలు దాటి రోడ్డుమీద అడుగుపెట్టేరా ఇక మేమీ రాళ్ళ కంటికి కనిపించం. నమస్కారం పెట్టాలనైనా తోచదు. ప్చ్ కలికాలం'

తామరాకుపై నీటిబిందువు

ముసిముసిగా నవ్వుకునేవారు కొందరు 'నిజమేనుమా' అని మనసులో అనుకుంటూ. గడుసువాళ్ళు కొందరు లేచి నిలబడి 'మాష్టారూ! మేమలా ఎప్పుడూ చెయ్యమండి' అని అనేవారు. మాష్టారు నవ్వేవారు. 'నేనన్నదీ అదేకదమ్మా! మీరిలా నమస్కారం చెయ్యరనేగా నేను చెప్పేదీను' పాపం ఆ గడుసువాళ్ల మొహాలు పాలిపోయేవి. మిగతవారు ఫక్కుమని నవ్వేవారు. శత్రువులనుకూడా నవ్వించే నేర్పు ఆ మాష్టారుకి వుండేది. ఆ మాష్టారు నన్నెప్పుడూ ఏదో ఒకటి అనేవారు సరదాకి నేను మూతి ముడుచుకు కూర్చునేదాన్ని. 'సత్యభామలా అలుగుతుంది శ్యామల కానీ, ఆకోపం ఇట్టే మరిచిపోతుంది కూడాను' అని అంటూ నన్ను నవ్వించే సేవారు మాష్టారు 'శ్యామల అక్షరాలు గుండ్రంగా వుంటాయి వాటిని దూరాన్నించి చూస్తే వరుసగా జీరోల్లా కనిపిస్తాయి అదేమిటో పెన్నుని గంటలా పట్టుకుంటుంది.' అని అనేవారు

'పూర్వజన్మలో నేను ఒక మహాకవికి శిష్యరికంచేసే దాన్నండి. ఆకవి కావ్యాలు చెప్తూవుంటే నేను గంటంతో వ్రాసేదాన్ని. ఆ అలవాటు ఇప్పటికీ మార్చుకోలేక పోతున్నానండి'

'అయితే నువ్వీ జన్మలో కవయిత్రివి అయిపోతావన్నమాట' మాష్టారు నవ్వు నాపుకుంటూ అడిగేవారు.

'మీనోటిమాట నిజమయితే మీరన్న మాటలన్నీ నా మొట్టమొదటి కథలో వుదహరించేస్తానండి'

'ఊ' గడుసుదానివి అయిపోతున్నావ్. ఆ ఎంతవరకు చెప్పాను నోట్సు వ్రాసుకోండి సూర్యరశ్మిలో ఆప్తాతను..'

ఇలా ఆ మాష్టారు మమ్మల్నందర్నీ మధ్య మధ్య నవ్విస్తూ నవ్వుతూ చెప్పేవారు పాఠాలు.'

రేవతి వింతగా అత్త కళ్ళల్లోకి చూసింది.

'శ్యామత్తా! ఈకాయితం మీద వ్రాసి చూపించు. నీ రైటింగ్ ఎలావుందో...'

'భగవాన్! నన్ను రక్షించు తండ్రీ!' మనసులో దేవుణ్ని ప్రార్థించింది శ్యామల. 'ఇప్పుడు నేను వ్రాయలేనమ్మా. వ్రాయటానికి కూడా కొన్ని నియమాలున్నాయి నాకు.'

'ఏం నియమాలు అత్తా!' రేవతి కుతూహలంగా ఆమె కళ్లల్లోకి చూసింది.

'చెప్పినా నీకే మర్థమవుతుంది' శ్యామల హృదయం బరువెక్కింది. మరిచిపోవాలన్నా సాధ్యం కావటంలేదు! ఆ దుష్టఘడియ ప్రభావం ఈ జీవితంలో మరిచిపోవడం ఎలా సాధ్యం ఆమె కళ్ళు విశాలం చేసుకుని చూసింది. నల్లటి తెరలు ఆకళ్లముందు తారాట్లాడాయి

కొన్ని నిమిషాలు నిశబ్దంగా దొర్లిపోయాయి. శ్యామల మౌనగంభీర ముద్రతో తలవంచుకు కూర్చుంది. రేవతి దిక్కులు చూస్తోంది ఏదో జ్ఞాపకంవచ్చి అత్తవడిలో తలపెట్టుకుని ఆమె కళ్లలోకి పరీక్షగా చూసింది. రేవతి.

'శ్యామలత్తా! నువ్వు కథలు చదువుతావా?'

'ఊ, అవంటే నాకు ప్రాణం'

'అయితే కథలపుస్తకం తీసుకురానా?'

'ఇప్పుడు వద్దమ్మా నేను అడిగినప్పుడు తీసుకురా?'

బుంగమూతి పెట్టింది రేవతి 'పోనీ ఓకథ చెప్పవూ'

'పిచ్చిరేవీ!' వాత్సల్యంగా రేవతి తల నిమిరింది శ్యామల. 'తిరుపతి వేంకటేశ్వరుడిని చూసేవా తల్లీ!' తెలివిగా మాట మార్చేసింది.

రేవతి కళ్ళు రెపరెప లాడించింది. 'మనింటినిండా తిరుపతి వెంకటేశ్వరస్వామి ఫోటోలే. అదిగో, గోడమీదవుంది, చూడలేదూ'

శ్యామల మనోనేత్రం ముందు అభయ హస్తంతో చిరునవ్వు చిందిస్తూ స్వామి ప్రత్యక్షమయ్యాడు తన్మయత్వంతో నేత్రాలు మూసుకుంది.

అమాయకులకు ప్రతినిధి రేవతి!

'అది కాదమ్మా రేవతీ! తిరుపతిలోవుండే వేంకటేశ్వరస్వామిని చూసేవా? అని అడుగుతున్నా.'

'ఓహో తిరుపతి వేంకటేశ్వర స్వామా? నేను చూడలేదు. నువ్వు చూసేవా శామత్తా.'

'లేదమ్మా, నేనూ చూడలేదు.'

'అన్నట్టు మాకు దసరా సెలవులు ఇస్తే

రుగా అప్పుడు వెళదాం ఏం?'

'ఊ' వెళదాం నీ ఇష్టదైవం వేంకటేశ్వరస్వామీ॰'

'అదేమిటి? అలా అంటున్నావు దేవుడు ఒక్కడే కదూ?' 'నీ కింతమాత్రం తెలీదూ?' అన్నట్టు అడిగింది రేవతి.

'ఎవరు చెప్పారమ్మా నీకు?' నవ్వుతూ ప్రశ్నించింది శ్యామల

'ఎవరేమిటి? చాలామంది చెప్పారు. 'దేవుడు ఒక్కడే' అని.'

'నాన్నగారు, అమ్మ, మాష్టార్లూ ఇంకా బోల్డుమంది చెప్పారు. మన దేవుడిగది చూపిస్తానురా, అత్తా!' మళ్లీ ఏమను కుందో రేవతి. అత్త మొహంలోకి ఒకసారి పరీక్షగా చూసి 'ఇప్పుడు వద్దులే, అమ్మ

తామరాకుపై నీటిబిందువు

దేవుడివద్ద దీపంవెలిగించాక చూద్దాం. ఏం?'

'సరేనమ్మా.'

'రేవతీ! ఇలారా.' వంటింట్లో నుండి సుమిత్ర పిలిచింది.

చిన్నిమనసుల్లో ఏ ఊహైనా స్థిరపడటానికి కారణం ఇతరులు చెప్పేమాటలే. ఆడేపాడే వయసులో తల్లిదండ్రులు, గురువులు వీరికి దైవసమానులుగా కనిపిస్తారు. వారు అనే ప్రతీమాట సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది.

'దేవుడు ఒక్కడే అట. మరి ఇన్నిరకాల పటాలున్నా యేమిటి?'

'రేడియో ఇంత చిన్నదిగా వుందికదా? మరి పెద్ద పెద్ద మనుష్యులు అందులో వుండి ఎలా మాట్లాడుతారు? అది ఒక ప్రత్యేక రాజ్యమేమో? అందులో అందరూ చిటికనవేలంత మనుష్యులు వుంటారేమో!' ఇలాంటి ఆశ్చర్య కరమయిన ఆలోచనలు ఎన్నో వస్తూంటాయి.

వారి సందేహాలను తెలుసుకుని ఓపికగా సమాధానం ఇచ్చేవారూ తక్కువే!

అంతటి ఓర్పు ఈ కాలపువారికి వుండదు!

శ్యామల మనస్సు గతంలోకి జారిపోయింది.

స్వామి వివేకానంద మృదు మధుర గంభీరవాక్కులు ఆమె మనసులో మారుమ్రోగాయి.

వివిధ ప్రదేశములలో జనించి, భిన్న మార్గముల — భిన్నరీతుల ప్రవహించినను నదులన్నియు సాగరమున లీనమగునట్లు, సర్వేశ్వరా! భిన్నజాతుల విభిన్నారాధన మార్గములన్నియు నిన్నే చేరుచున్నవి.

ఎవ్వడే రూపమున నన్ను జేర ప్రయత్నించినను నేను వానిని జేరెదను. మానవులందరు నన్ను జేరుట కనియే వివిధ మార్గములలో ప్రయాస పడుచున్నారు. ఆ మార్గములన్నియు నన్నే చేరుచున్నవి.

ప్రపంచమునందలి మానవులెల్లరు నొక కుటుంబముగా గూర్చేది విశ్వమతము దేశకాలాతీతమైనది కావలెను. అది బోధించు భగవంతుని వలెనే యదియు ననంతమై వుండవలెను. హిందువులు, క్రైస్తవులు, పుణ్యపురుషులు, పాపులు అను భేదములేక ఎల్లరపై సమానముగా ప్రకాశించు సూర్యుని వంటిది విశ్వమతము. వివిధ మతములన్నియు దానిలో ఇమడగలవు. ప్రపంచమునందలి ప్రతివ్యక్తిని, ప్రతిప్రాణిని తన హృదయమున ఇముడ్చు కొనునంతటి విస్తృతి కలదియై, ఇంకను విస్తృతి కలదియై వుండవలెను.

స్త్రీ పురుష భేదమునకు అతీతమై ప్రతి వ్యక్తియందును నిహితమైయున్న భగవదంశమును గుర్తించుచు దానిని తద్వ్యక్తి గుర్తించి తరించునట్లు సహకరింపగలుగునదియే విశ్వమతము.

అట్టి మతమును మనము చూపగలిగితిమేని మతాభిమానములకు, మతాంతర స్వీకరణములకు అవసరమే వుండదు.

ఈ విశ్వమతమును ప్రపంచమంతయు అనుసరించును.

కాని క్షుదార్తులైయున్నవారికి మతము వలన ఏమి ప్రయోజనము.

సోదరమానవుల దురవస్థను మార్చుటకుపకరింపనిచో అన్ని మతములును నిష్ప్రయోజనములే.

స్వప్నావశిష్టురాలిలా కూర్చుండిపోయింది శ్యామల.

'శ్యామలత్తా! చీకటి పడిపోయింది. లైటైనా వేసుకోకుండా కూర్చుండిపోయావేం?' రేవతి శ్యామలను కుదుపుతూ అంది.

శ్యామల త్రుళ్లిపడింది.

'ఓహ్, చీకటి పడిపోయింది నేను గమనించనేలేదు' తత్తరపాటుతో లేచినుంచుంది.

'హాల్లోకి వెళ్లిపోదాం రా అమ్మా రేవతీ!'

హాల్లో సోఫాలో కూర్చున్నారు రేవతి, శ్యామల.

టేబుల్‌పై వున్న ఫ్లవరువాజుని చూస్తూ 'శ్యామలత్తా! రేపు మనం తోటలోని రంగుల రంగుల పువ్వులుతెచ్చి ఫ్లవరువాజులో పెడదామా?'

'ఊఁ'

'రోజూ నాకు రెండు జడలు వేస్తావా?'

'ఊఁ'

'నన్ను రోజూ పార్కుకి తీసికెళతావా?'

'ఊఁ'

'మాష్టారు ఇచ్చిన హోంవర్కు నేను

వెయ్యలేకపోతే నువ్వు చేసి పెడతావా?'

'ఊ'

'మనం వారానికి ఒకసారి సినిమాకి వెళదామా?'

'ఊ'

'శ్యామలా! ఒకపాట పాడవూ?''

'ఊ'

'పాడమని'

'ఊ'

'అత్తోయ్! విన్నే!' రేవతి శ్యామల చెవిలో అరిచింది.

శ్యామల ఉలిక్కిపడింది 'అబ్బబ్బ అల్లి పోయాను రేవతీ!'

రేవతి కిలాకిలా నవ్వింది. 'పోనీయ్, పాడకపోతే పోనీలే. విన్నొకటి అడుగుతాను.



చెపుతావూ?'

'తెలిసినట్లయితే చెప్పకుండా దాచేసుకుంటానేమిటమ్మా?'

'నువ్వు కళ్లు తిప్పకుండా ఎలా చూస్తున్నావు'

శ్యామల ముఖాన్ని అరిచేతుల్లో దాచుకుంది. అస్పష్టంగా ఏదో అందామె. కానీ రేవతికి సరిగా వినిపించలేదు.

'అదేమిటి? శ్యామత్త కళ్లు తిప్పకుండా ఎలా చూస్తుంది' అప్పుడే హాల్లోకి అడుగు పెట్టిన తండ్రినీ, తల్లినీ కుతూహలంగా అడిగింది రేవతి.

క్షణంసేపు ముఖాలు చూసుకున్నారు సుమిత్ర, రాఘవరావు.

అతడు కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకోసాగాడు వణుకుతున్న చేతులతో

సుమిత్ర రేవతి తలను అక్కున చేర్చుకుంది

'తప్పమ్మా అలా అడగకూడదు. అవి... అవి మామూలు...'

శ్యామల తల అడ్డంగా వూపింది.

'నా గుండె బండ అయిపోయింది. రేవతికి చెపితే మరే నష్టమూ రాదు చెప్పేసెయ్ వదినా!'

భారంగా నిట్టూర్చి భర్త వేపు చూసింది సుమిత్ర. అతడు రేవతిని వడిలో కూర్చోబెట్టుకున్నాడు

'అమ్మా! రేవతీ! నీనుండి ఈ నిజం దాచడం అవివేకమే అవుతుంది. కానీ జరిగిన ఘోరం విని నీచిన్ని మనసు తట్టుకోలేదు తల్లీ!'

రేవతి వెక్కివెక్కి ఏడ్చేసింది.

'అదేమిటో చెప్పేయి నాన్నా! శ్యామత్త... శ్యామత్త.. ఇంత మంచి శ్యామత్తకు ఏం జరిగింది? చెప్పవూ?'

దీర్ఘంగా నిట్టూర్చాడు రాఘవరావు.

సుళ్లు తిరుగుతున్న హృదయాన్ని అదిమి పట్టింది సుమిత్ర.

శ్యామల పాలిపోయిన మోహాన్ని కిందకు వంచుకుంది.

'శ్యామత్తా.' బోరున ఏడ్చేసింది రేవతి.

'మీ రందరూ నన్నిలా ఏడిపిస్తున్నారెందుకు?'

'రేవీ!' రేవతిని హృదయానికి హత్తుకుంది శ్యామల.

'ఆరుసంవత్సరాల క్రితం దీపావళినాడు జరిగిన దుర్ఘటన నా జీవితగతినే మార్చివేసిందమ్మా!

వెలుగు రేఖలను పంచియివ్వవలసిన దీపావళి— చిమ్మచీకటిని ప్రసాదించింది తల్లీ!

విధికి ఎదురీదడం సాహసమే అవుతుంది, అందుకనే విధి బలీయం అన్నారు.

తామరాకుపై నీటిబొట్టు వున్నంతసేపే అది జారి నీటిలో కలిసిపోతే...'

'అత్తా, అత్తా! ఏమిటేమిటో అంటున్నావు. నాకు అర్థం కావటంలేదు అసలేం జరిగిందో చెప్పవూ?...' రేవతి చెంపల మీదుగా ఆగకుండా కన్నీరు ప్రవహించసాగింది.

'చెప్పేస్తానమ్మా చెప్పేస్తాను.

ఆరుసంవత్సరాల క్రితం దీపావళినాడు అంతా సరదాగా బాణసంచా కాలుస్తున్నాము అప్పుడు రఘు అన్నయ్యకూడా వున్నారు నువ్వు చిన్నదానివి. నాలుగేళ్ళు కూడా వుంటాయో లేదో. రఘూ అన్నయ్య విష్ణుచక్రం కాలుస్తుంటే నువ్వూ కాలుస్తానని పేచీ పెట్టావు. అదేమిటో చిన్నప్పటి నుండి భయమంటే ఏమిటో కూడా ఎరగవు. ఎంత చెప్పినా వినలేదు నువ్వు. రఘూ అన్నయ్య నీ చేతికి విష్ణుచక్రం ఇచ్చారు. అది గిరా గిరా తిరుగుతుంటే సంతోషంతో చప్పట్లు కొడుతూ కిందకు విసిరేసావు. అది గిరాగిరా తిరుగుతూ నీ కాళ్ళవద్దకు వచ్చేస్తుంటే, నేను చప్పున కిందకు వంగి...

'శ్యామా!' రాఘవరావు వెర్రిగా అరిచాడు.

'ప్లీజ్, శ్యామలా! జరిగిపోయింది గుర్తుకు తెచ్చి మా మనసులు బాధ పెట్టకు.' సుమిత్ర బాష్పకణాలను ఒత్తుకుంటూ అంది

కన్నీటి తెరలగుండా అత్త ముఖంలోకి చూసింది రేవతి.

'అమ్మా, నువ్వుండు. ఊఁ, అప్పుడేమయిందత్తా.'

'...నిన్ను ఎత్తుకోబోతూంటే రఘూ అన్నయ్య విసురుగా నిన్ను వెనక్కులాగేసాడు.

ఆ విష్ణుచక్రం నా కళ్ళనిండా నిప్పురవ్వలను నింపి పక్కుమంటూ నవ్వింది.

నేను కెవ్వున కేకవేసి పడిపోయాను. అదృష్టవశాత్తూ నీకేమీ అవ్వలేదు. నేనా షాక్‌నుండి కొన్ని వారాలవరకూ తేరుకోలేకపోయాను

రఘు అన్నయ్య నన్ను విశాఖపట్నం తీసుకువెళ్లారు. ఎందరెందరో డాక్టర్లు నా కళ్ళని పరీక్షించి పెదవి విరిచేశారు. కనుపాప లేనిదే కంటిచూపెట్లా వస్తుంది?

రఘు అన్నయ్యకూడ కళ్లడాక్టరే కానీ పెరట్లోని చెట్టు మందుకు పనికిరాదని అన్నయ్య నా కళ్లల్లోకి చూడటానికే భయపడేవాడు. ఇక విధిలేక కొడిగట్టుతున్న ఆశతో ఆఖరుసారిగా అన్నయ్య నా కళ్లను పరీక్షించాడు. లాభంలేకపోయింది.

అయినా నా కిక కళ్ళెందుకమ్మా రేవతీ! రామలక్ష్మణులవంటి అన్నయ్యలు, సీతమ్మవంటి వదిన, కుశలవుల గుణాలను పుణికిపుచ్చుకున్న నువ్వు వుండగా ఇక నాకు కళ్లు దేనికి?' వాత్సల్యంగా రేవతి తల నిమిరింది.

'మరి అవి....అవి...' జలజలరాలేకన్నీటిని తుడుచుకుంటూ అడగలేక అడిగింది రేవతి.


'ఇవి గాజు కళ్లమ్మా'

రేవతి కెవ్వున అరిచింది.

భూనభోంతరాలు దద్దరిల్లలేదు.

సూర్యచంద్రాదులు గతులు తప్పలేదు.

కానీ రేవతి మనసులో లేచే పెనుతుపానులను ఆపటం ఎవరికి సాధ్యం. ఆమె వూహాలు నేలమట్టాలయ్యాయి. ●



ఒకవారం విపరీతం

మూషిక కుటుంబ నియంత్రణ

న్యూయార్క్‌లో ఎలకల బాధపడలేక, శాస్త్రవేత్తలంతా చేరి, 'ఆడ ఎలక'లకు గర్భనిరోధక మాత్రలను యిచ్చి పెరిగే ఎలకలజాతిని అపుచేయాలని తీవ్రంగా నిశ్చయించారట. ఈ పథకం యీ సంవత్సరాంతంలోగా అమలకొస్తుందట ఆమాట కొస్తే న్యూయార్క్‌కన్నా ఇండియా నయం అన్నమాట! మనకి అంత ఎలకల బాధా లేదు, వున్నా అది మన బాధకన్నా ఎక్కువాకాదు

*   *   *

పదకొండువేల కిలోవోల్టుల ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి పేలి, జలంధర్‌లో ఓ ముగ్గుర్ని మొన్న ముప్ఫయో తేదీన కాల్చింది వారికి ప్రాణాపాయం లేదని, అంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకలా పగిలిందో దర్యాప్తు చేయాలనీ ఆశాఖ చెప్పింది.

దొంగలకి మనవి

గత పన్నెండు సంవత్సరాలలోనూ, తన యిల్లు పద్దెనిమిదిసార్లు దొంగలు దోచుకున్నారని కాలిఫోర్నియాలో పెప్పెట్ అనే ఆయన వాపోయారు. ఈ యేడాదికి కూడా ఆయన సిద్ధపడి, "దొంగలారా - గునపాలతో నా యిల్లు తవ్వి నాశనం చెయ్యకండి, వెనకవైపు వంటింటి కిటికీ తెరిచే వుంది— స్వాగతం" అని ఒక బోర్డు రాసిపెట్టాడట. పాపం పోన్లే అనుకుని దొంగలు ఆయన చూపించిన మార్గం ద్వారవచ్చి హాయిగా దోచుకున్నారట.

*   *   *

గండకీ నదికట్టుకు ఎలక తవ్విన ఓ సొరంగం కారణంగా ఆనదికట్ట పగిలిపోయి బీహారులో సుమారు రెండువందల ఎకరాలపంట నాశనం అయిపోయిందట. చివరికి ఎలకలు కూడా దేశనాశనానికి పూనుకుంటే యింకెలాగ...

*   *   *

ఢిల్లీ కార్పొరేషను ఎలక్షన్స్‌లో ఓటువెయ్యడానికి వచ్చిన రతన్‌లాల్‌జైన్ అనే అతన్ని ఆపి, "నువ్వు చచ్చిపోయావు. కావలసివస్తే యీ రికార్డులు చూడు" అని ఆపారట ఏడావలేదు మొర్రో అన్నా వారు వినలేదట

హత్య, హత్య, ఆత్మహత్య

తను ప్రేమించిన ఒక అమ్మాయి మరొకణ్ణి పెళ్లి చేసుకుందన్న పగతో పుట్టింటికివచ్చిన ఆ పిల్లను కసితీరా పొడిచి చంపి, ఆకేక వినివచ్చిన ఆమె తల్లిన్నీ పొడిచి, బయటికి పారిపోయివచ్చి అప్పుడేవస్తున్న రైలుక్రింద తలపెట్టి తనూ చనిపోయాడట—ప్రతీకారాగ్ని అప్పటికి కానీ చల్లారుండదు

*   *   *

బీహారు యూనివర్సిటీ పరీక్షలు జరుగుతుండగా ఒక హాలులో విద్యార్థులు కాపీలు విజృంభించి చేసుకోడమేగాక, పక్క వాళ్ళు ఏ రాశారో చదివి చూసుకునేవరకూ వచ్చిందట. వాళ్ళను అరికట్టడానికిచేసిన ప్రయత్నం బీభత్సం అయి ఓ యమ్మే విద్యార్థిని ఎవరో పొడిచేశారట 'కాని గొడవలు' అని ఆ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ తన పదవికి రాజీనామాయిచ్చి పాపం వెళ్లిపోనూరట—విద్యార్థులు యీ రోజుల్లో పెన్నుకి బదులు కత్తులు పుచ్చుకు తిరుగుతున్నారేమో!

*   *

బీదలకు, విద్యార్థులకు పంచమని పరదేశం యిచ్చిన పాలపొడిని, ఒక రవాణాశాఖ కొందరు వుద్యోగులు చేరి దొంగచాటుగా అమ్మనారంభించారట వారణాసిలో వాళ్లను, ఒక యాభై యేడు బస్తాల పాలపొడినీ పట్టుకున్నారట. ఇది వాళ్లకు తెలిస్తే — అపాత్రదానం అనుకోరూ!

(62వ పేజీ చూడండి)

వారఫలం

22-9-1967 శుక్రవారం మొదలు 28-9-1967 గురువారం వరకు.

మేషం: ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన అవరోధాలు తొలగిపోతాయి. వ్యాపారంలో ప్రయోజనం గల వ్యక్తులను కల్సుకొంటారు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృషభం: లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం వచ్చే పరిస్థితి యేర్పడుతుంది. కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది అధిక వ్యయం జరుగుతుంది.

మిథునం: భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాల కంటే మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభించగలవు. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

కర్కాటకం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరుతాయి. ఆర్థిక వ్యవహారాలు వారం మధ్యలో బాగా ఉంటాయి. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారాంతంలో చికాకులు యేర్పడతాయి. పోటీవారితో మాటపట్టింపులు రావచ్చును.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం: ఇదివరకు యేవో కారణాలవలన ఆగిపోయిన వ్యవహారాలను ఇప్పుడు పూర్తిచేయగలరు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

కన్య: వృత్తి వ్యాపారాల్లో ప్రయాస మినహా ప్రయోజనం పెద్దగా కనిపించదు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి.

స్త్రీలకు:— ఆందోళన కలుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

తుల: ఫలితం మాట యెలాగ ఉన్నా, ప్రయత్నించిన ప్రతి పనీ సులువుగా నెరవేరుతుంది. వ్యాపారంలో ప్రయోజనంగల వ్యక్తులను కల్సుకొంటారు. వారం మధ్యలో అనుకోని చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది ప్రయాణాలు వాయిదా పడతాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగ ఉంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

వృశ్చికం: వ్యాపారంలో పోటీవారితో పోటీ పెరుగుతుంది. ఇతరుల మీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారాంతంలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగానే ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు: మీకు మున్ముందు లాభించ గల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించగలరు. వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. రావలసిన డబ్బు మీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మకరం: సామాన్యమైన పనులకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు వారంమధ్యలో లాభించగలవు. ప్రయాణాలు కొంచెం శ్రమమీద లాభిస్తాయి. సాహిత్యకళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. సజ్జనసాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూల వార్తలను వింటారు.

కుంభం: వ్యాపార విస్తరణ ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో అనుకూలమైన మార్పులు వస్తాయి. వ్యాపారం భారీయెత్తున చేయడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మీనం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగ ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

—మహేష్





'ప్రతీకారం'లో చంద్రకళ

చిత్రలహరి

తియ్యబోయే షాట్‌లో చెప్పవలసిన సంభాషణలను మననం చేసుకుంటున్నది వాణిశ్రీ పూర్ణా సుబ్బారావు అటుకేసివచ్చి "ఇంకా ఫ్రెష్‌గా వున్నావేమిటే?" అని అడిగారు 'అంటే?' అన్నది వాణిశ్రీ ఆశ్చర్యంగా చూస్తూ, ఆమె జుట్టు వొంకీల కోసం పెట్టుకున్న క్లిప్పుల్ని చూస్తూ 'ఇంకా ఆ క్లిప్పులవీ ఏమిటే?' అన్నారు 'అవా. అవి మధ్య మధ్యలో వుంటాయి' అంటూ నవ్వింది ఇంతలో శోభన్‌బాబు వచ్చి మంచంమీద వాణిశ్రీ ప్రక్కన కూచున్నాడు. కెమెరామన్‌లు లైటింగ్ అరేంజిమెంట్లు చేస్తున్నారు. 'ఈ చీర నీకోసమనే కాశ్మీర్‌లో కొన్నాను' అన్నాడు శోభన్‌బాబు కొంచెం యువతలగా దర్శకుడు శ్రీ హేమాంబరధరరావు, నేనూ కూచున్నాం 'పెద్ద కాశ్మీర్ తీసుకెళ్ళినట్లు నా కోసమే కాశ్మీర్‌లో కొన్నారట!' అంది వాణిశ్రీ మావేపు చూస్తూ

ఎవరు ముందు తీసుకెళతారు?

'నెక్స్‌ట్ పిక్చర్‌కి కాశ్మీర్ వెళ్దాం!' అన్నారు హేమాంబరధరరావు. 'మాట తప్పకూడదు మరి!' అడిగింది 'ఈలోగా ఎవరు కాశ్మీర్ అవుట్‌డోర్‌కి పిలిచినా వెళ్ళకూడదు మరి!' అన్నారాయన సమాధానంగా. 'మీకు ప్రామిస్ చేశాగా యింకెందుకు వెళ్తానూ? వాణిశ్రీని మొదటిసారి కాశ్మీర్ తీసుకెళ్ళిన ఘనత మీకే దక్కుతుంది నిలబెట్టుకోండి!' అన్నది వాణిశ్రీ

శుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ వారి 'ఆడ పడుచు' సెట్సుమీదది ంగా సందడి

ఎగ్జామ్సూ—షూటింగూ

ఆ సెట్సులోంచి యివతలికి వస్తున్నపుడు చంద్రకళ మేకప్‌రూమ్‌లోకి వెళ్తూ కనిపించింది 'ఇవాళ షూటింగూ—ఎల్లుండి ఎగ్జామ్సూ' అన్నదా అమ్మాయి చదువుకుంటూ తీరికవేళల్లో సినిమాల్లో నటిస్తున్నది చంద్రకళ స్థానిక యస్. ఐ. ఇ టి ఉమెన్స్ కాలేజ్‌లో బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతోంది, 'ఈమధ్య నలుగు రయిదుగురు నిర్మాతలు తమ చిత్రాల్లో నటించవలసిందిగా అడిగారు. అన్నింటిలోనూ ఒకేసారి ఒప్పుకుంటే చదువు దెబ్బతింటుందేమోనని అంగీకరించలేదు ఒకటీ రెండా అయితే నా చదువుకి ఆటంకం ఉండదు' అన్నది చంద్రకళ



'రహస్యం'లో నాగేశ్వరరావు



'మరపురాని కథ'లో వాణిశ్రీ, సంధ్యారాణి

నిర్మాతల్ని అడగండి!

కిందటివారం ఓ సాయంకాలం పూట వీనస్ స్టూడియోలోకి వెళ్ళినపుడు మళయాళ చిత్రం సెట్స్‌పైన శారద కనిపించింది 'తెలుగు ఫీల్ గురించి ఏమీ తెలియటం లేదండీ! నేనిప్పుడు మళయాళ చిత్రాల్లో మునిగిపోయాను' అన్నది శారద. ఇంతలో షూటింగ్ చూడటానికి వచ్చిన గుంపులోని ఓ పెద్దమనిషి మాదగ్గరికివచ్చి 'శారదగారూ, మీరే తెలుగు సినిమాల్లోనూ



'ఆడపడుచు'లో యన్. టి. రామారావు చంద్రకళ

ఉండటం లేదేం?' అన్నాడు. శారద నవ్వి 'బావుంది ప్రశ్న. కాని, నన్నుకాదు యీ ప్రశ్న అడగటం. నిర్మాతల్ని అడగండి' అన్నది.

కవర్ గర్ల్?

'రక్త సిందూరం' సెట్స్‌లో విజయలలితతో మాట్లాడుతున్నపుడు దర్శక నిర్మాత సి. సీతారాం అక్కడికివచ్చి 'కవర్ గర్లా?' అని అడిగారు నవ్వాను నేను.



'పెద్దఅక్కయ్య'లో జ్యోతి లక్ష్మి

'ఎపుడూ తారలదే ముఖచిత్రాలు వేస్తారే కాని తెరవెనుక ముఖ్యులం మావి ఎపుడూ వెయ్యరేం?' అంటూ జోక్ చేశారాయన. విజయలలిత అందుకుని 'కరెక్ట్. మీరు తెరవెనుకవారు గనుకనే వెయ్యరు. మేము తెరముందు వాళ్ళం. పబ్లిక్‌కి మీరు తెలీరు' అన్నది. రక్త సిందూరం షూటింగు పునఃప్రారంభమయి వాహినీలో చకచక సాగుతున్నది.

—మోహన్‌కుమార్

సినిమా డైరీ

● వినోదపు పన్ను ప్రభుత్వం అధికంగా విధించినందున మహారాష్ట్రంలో 726 సినిమాహాళ్ళు మూతలుపడ్డాయి సెప్టెంబరు 1 నుంచి.

● సినిమాలలో ప్రేక్షకులు రానురాను కసీస్టులుగా తయారవుతున్నారని హిందీ నటుడు అశోక్‌కుమార్ వ్యాఖ్యానించారు.

● నటుడు రాజేంద్రకుమార్ దగ్గర ఏడేళ్ళ క్రితంగా పనిచేసి ఇపుడు నిర్మాతగా మారిన మదన్ సైగల్—ఒక సందర్భంలో విలేఖరితో మాట్లాడుతూ 'ధర్మేంద్ర చాలా పెద్దమనిషి. సంపూర్ణ సహకారంతో హృదయపూర్వకంగా పనిచేసే హీరో అతనొక్కడే!'' అన్నారు.

● తన తమ్ముడు శశికపూర్‌కు దర్శకత్వం చేసే టాలెంట్స్ ఉన్నాయని రాజ్‌కపూర్ ఒక చిత్రానికి దర్శకత్వం వహించవలసిందిగా కోరారు. శశి అన్న అభిప్రాయంతో అంగీకరించాడు. కాని యిప్పట్లో ఆ ఆఫర్ నిరాకరించాడు.

● నూతన్ ఓ ఎయిర్‌కండిషన్డ్ ట్రైలర్ కొన్నది. రెండు పడకలు, కిచెన్ మున్నగు వాటితో ఎన్నో ఆధునిక సౌకర్యాలను కలిగివున్నదిట, ఆ ట్రైలర్.

● న్యూథియేటర్స్‌వారు నిర్మించిన 'చండీదాసు' బాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఉన్న మొదటి చిత్రపటం.

● హిందీ సినిమాలలో బాగా ఎత్తుగా కనిపించే నటుడు షేక్ ముక్తార్ తన 17వ యేట ఒక్కోసారి రోజూ 60 కోడిగుడ్లు తినేవాడుట.

● ఎన్. ఎస్. కృష్ణన్ స్మారక నిధికి హిందీ హాస్యనటుడు మహమూద్ రు. 10,000 విరాళం యిచ్చాడు.

● రాజ్‌కపూర్ యిపుడు నిర్మిస్తున్న 'మేరానామ్ జోకర్' నాలుగు భాగాలుగా విడుదలవుతుందిట. ఈ నాలుగింటికీ లింక్ ఉన్నప్పటికీ, ఏ భాగానికాభాగం విడిగా చూసినా బాగానే ఉంటుందిట.

ఒకవారం విపరీతం

(57 వ పేజీ తరువాయి)

ఢిల్లీలో ఖూనీలు

ఢిల్లీలో రింగ్ రోడ్డుమీద మొన్న ఓ రెండు స్త్రీ శవాలు దొరికాయట. ఎక్కడో హత చేసి రింగ్ రోడ్డుమీద పడేసుంటారని, ఆ శాఖవారు అనుమానించారు. నిండా యిరవైయేళ్లు లేని యీ యిద్దరి స్త్రీలను ఎవరో బలాత్కరించి, ఆనక చంపేసుంటారనికూడ అనుమానించారు.

* * *

ఇరుగుపొరుగువాళ్లు తన పది హేను కుక్కల బాధ భరించలేమని పోలీసుశాఖకి రిపోర్టు యిచ్చి వుంటారు అనే అనుమానంతో—ఫ్రాన్స్‌లో ముప్ఫయేళ్ల ఒక యువకుడు తన పదిహేను కుక్కలను చంపేసి, తను కూడా ఆత్మహత్య చేసుకున్నాడట. తన కుక్కలులేని తన జీవితం వ్యర్థం అని భావించుకుని యీపని చేశాడట అతని స్థిరసంకల్పం అద్వితీయమేగాని, నిశ్చయం, నిర్ణయం మాత్రం తెలివైనవి కావేమో అని విన్నవారన్నారు.

మంత్రి మరణం

తను అమర్యాదకరమైన, అసహ్యకరమైన పని ఒకటి చేశానని అందుకు శిక్షగా విషం తాగి చని పోతున్నాననీ మాజీ గోవా మంత్రి శ్రీ కర్నాలీ పోలీసు అధికారులకు, తదితరులకు రాసి బొంబాయిలో నలుల మందు త్రాగి ప్రాణాలు తీసుకున్నారట, అయితే ఆ 'కారణం' తెలీదు.

* * *

జీపులో వెళుతున్న శంకర్ అనే డాక్టరును భోమియా అనేచోట యీనెల ఎనిమిదవ తేదీన నాగవిద్రోహులు క్రూరంగా చంపారు ముప్ఫయేళ్ళన్నా నిండని ఆయన — తలిదండ్రులకు ఒక్కడే కొడుకట!

—ఫాలాక్షుడు.

ధర్మపథం

(16 వ పేజీ తరువాయి)

'అవును గదా! ఒక్క చిన్నపని చేసేటప్పుడే సంసార తాపత్రయంలేని మహర్షికి, నీకు నా నామమును ఒక్కసారి స్మరించడానికైనా అవకాశం లేకపోయిందే! ఇక సంసార జంబాలంలోపడి కొట్టుమిట్టాడుతున్న జనులు ఏదో ఒకప్పుడు ఎలాగో ఒకలాగు తీరికచేసుకుని నన్ను స్మరిస్తున్నారంటే వారి భక్తి స్వల్పమంటావా?'


'అయితే సన్న్యాసులకన్న సంసారులే మేలైన భక్తులన్నమాట!'


శ్రీకృష్ణుడు నవ్వుతూ 'అన్న మాటా కాదు; తమ్ముడు మాటాకాదు. ఉన్నమాటే అన్నాను' అని అన్నాడు.


జీవన్ టోన్


గవర్నమెంటు రిజిష్టర్డు నెం 218726

Phone No. 440206


మందు తీసుకొనక ముందు


20 దినములు తీసికొన్న తర్వాత


40 దినములు తీసికొన్న తర్వాత


60 దినములు తీసికొన్న తర్వాత


పత్రికలలో ప్రకటనచేసిన ఔషధాలను సేవించి ఫలితాలను పొందని వారు అనేకులున్నారు. కాని జీవన్ టోన్‌ను కొనుక్కొని దానిని ఉపయోగించి ప్రయోజనం పొందండి. జీవన్ టోన్ కేవలం వనస్పతి కొవ్వునుంచి తయారు చేయబడినది. జంతువుల కొవ్వు చేరుటవల్లనే ఈ అనుకోనటువంటి బలిష్టతకు కారణం అని కొందరు అనుకోవటం పొరపాటు.

జీవన్ టోన్ గుణములు: ఎంత మంచి ఆహారము తిన్నా ఎముకలపోగువలె బలహీనంగా ఉండేవారు కొంతమందిఉన్నారు. అట్టివారికి జీవన్ టోన్ మంచి బలాన్ని, లావును, బరువును ఇస్తుంది. ఆకలి లేనివారికి మంచి జీర్ణశక్తినిస్తుంది. ఇది బలహీనత, కాళ్లుచేతులు తేలిపోవుట, తలతిరుగుట, రక్తహీనతలను పోగొట్టి, పరిపూర్ణమైన దేహారోగ్యాన్ని, పుష్టిని ఇస్తుంది. శరీరం ఎరుపుఛాయ పొందటానికి జీవన్ టోన్‌తో టొమాటోలు తీసుకొనండి. ఆరోగ్యవంతులకు కూడ జీవన్ టోన్ మంచిది. జీవన్‌టోన్ తీసుకొన్నప్పుడు మీరు కొంత శరీరవ్యాయామం చెయ్యటం అవసరం. లేకపోతే మీ శరీరం అనవసరంగా లావెక్కుతుంది. కావలసిన బరువు, బలిష్టత చేరినవెంటనే జీవన్ టోన్ సేవించడం నిలపడం మంచిది. స్థూలకాయులు జీవన్ టోన్ తీసుకొనుట మంచిదికాదు. అట్టివారు జీవన్ టోన్ తీసుకుంటే మేము బాధ్యులం కాము. స్త్రీలు బహిష్టు కాలంలో తీసుకొనగూడదు. ఇతర వివరాలు మందుతో పంపబడతాయి వెల: 454 గ్రాములు రూ. 10/-. పోస్టు చార్జీలు అదనం.

స్కిన్ క్రీమ్స్ యవ్వనసౌందర్యం కలిగియుండటం వరప్రసాదం. స్కిన్ క్రీమ్స్ మీ చర్మాన్ని, మొటిమలు, స్ఫోటకపు మచ్చలు, వివర్ణత, కోతలు, శోభినుంచి కాపాడుతుంది. స్కిన్‌క్రీమ్స్ ముఖమందలి మట్టి తొలగించిన తరువాత వాడవలయును. మీరు ఏ స్నోనుగాని, పౌడరునుగాని వాడవచ్చును. స్కిన్‌క్రీమ్స్ ఒక కోర్సు రు. 12/

JOTHI HOSPITAL, POST BOX No 1413 32 VENKATANARAYANA ROAD, MADRAS-17.

స్థానిక డాక్టరు: డాక్టర్ దామోదరం, M.A. I A D S



మాత్రం నాలుగోవంతుకి తగ్గించిన చిన్న నమూనా ఇటుక బరువు ఎంత ఉంటుంది?

* * *

జవాబులు

(క) తొమ్మిది రూపాయలను మూడేసి చొప్పున మూడు భాగాలుగా విడదీయాలి మూడింటిని బొత్తిగా పెట్టి 'త్రాసు'కి ఒకవైపున, ఇంక మూడు రూపాయల బొత్తి రెండోవైపున ఉంచి తూచాలి. దొంగనాణెం ఈ రెండు భాగాలలోను ఏ వైపున ఉంటే అటువైపు తేలిక అవడం చేత పైకి లేస్తుంది ఈ రెండు భాగాలూ సమానంగా తూగినట్లయితే వీటిలో దొంగ రూపాయి లేదనీ, వేరుగాఉంచిన మూడింటిలోనా ఉందని తెలుస్తుంది ఇది మొదటి తూకం

దొంగరూపాయి ఉన్నదని తెలిసినభాగంలో మూడురూపాయలున్నాయి. వీటిలో ఒక రూపాయిని వేరుగాఉంచి, ఒక రూపాయిని త్రాసుకి ఒకవైపున, మరొక రూపాయిని రెండోవైపునఉంచి తూచాలి వీటిలో ఒకటి దొంగరూపాయి అయిఉన్నట్లైతే అదిఉన్న వైపు పైకి తేలిపోతుంది ఈ రెండూ సమానంగానే తూగినట్లైతే వేరుగా ఉంచిన మూడవదే దొంగరూపాయి అని తెలుస్తుంది.

(చ) అసలు మొదట ఉన్నపనివాళ్ళు x

మెదడుకి మేత

(31 వ పేజీ తరువాయి)

అనుకో.

$(x+2)$ పనివాళ్ళతో—7 రోజులలో పని అవుతుంది

x పనివాళ్ళతో—8 రోజులతో పని అవుతుంది.

అంటే x విలువ 14 అన్నమాట.

14 మంది — 8 రోజులలో చేస్తే


ఒక్కడు — 112 రోజులలో, లేక 16 వారాలలో చేయగలడు.

అంటే 15 వారాలు ఆలస్యం అయిందన్నమాట.

* * *

(ట) ఇక్కడిబొమ్మలో చూపినట్టు సరిగ్గా రెండే రెండు ముక్కలుగా (క, చ అనే ముక్కలుగా) కోయవచ్చు కోత సరళరేఖలో కాక మెట్లు మెట్లుగా ఉంటుంది. ఆ మెట్ల కొలతలు బొమ్మలో చూపినట్టు (ఎత్తు 3 అడుగులు, వెడల్పు 4 అ॥) ఉంటాయి.

'చ' అనే భాగాన్ని కిందికి 3 అ॥, ఎడమకు 4 అ॥ జరిపి అమెటు ఒక



దానిలో ఒకటి పట్టేటట్లు చేస్తే 12 అడుగులు × 12 అడుగులు చదరం ఏర్పడుతుంది.

* * *

(త) నమూనా బరువు 1 కిలోగ్రాము కాదు సుమా! నమూనా పొడవు, వెడల్పు, ఎత్తు అసలు ఇటుకలో నాలుగోవంతు ఉంటాయి. కనుక నమూనా ఘనపరిమాణం అసలు ఇటుక ఘనపరిమాణంలో $4 \times 4 \times 4 = 64$ వ వంతు ఉంటుంది. అసలు ఇటుకను నమూనాను ఒకే పదార్థంతో చేసినట్లైతే బరువులు ఘనపరిమాణముల నిష్పత్తిలో ఉంటాయి. కనుక నమూనా ఇటుక బరువు —

$$= \frac{4}{64} = \frac{1}{16} \text{ కిలోగ్రాము.}$$

ముగ్గురు మూర్ఖులు

(23-వ పేజీ తరువాయి)

'నేను మధ్యను ఒకరింట్లో యేదో పూజ జరుగుతున్నప్పుడు వెళ్ళాను అప్పుడు 'జననీ నీ కిదే హారతీ! పార్వతీదేవీ! జననీ! నీ కిదే హారతీ, హారతి గైకొని అష్టైశ్వర్యమూ తీయవే' అంటూ మంగళహారతి పాడేరు.'

'నాకు అది చాలా పొరబాటుగా ఉన్నట్టుగా కన్పించింది. మన ప్రాంతంలో బియ్యానికి కరివేపాకు కొనేటప్పుడు కూడా కొంతమంది బియ్యాన్ని తమచేతిలోనే ఉంచుకొని కరివేపాకు పెట్టమంటారు. కరివేపాకు తగినంత యిస్తేనే బియ్యాన్ని కరివేపాకు మనిషికి యిస్తారు లేకపోతే యివ్వరు'

అటువంటప్పుడు ముందుగా హారతిని తీసికొని తరువాత అష్టయిశ్వర్యాల్ని యిమ్మని కోరడం తెలివైనపనికాదు. అందులోనూ సాలీనా రెండుకోట్ల రూపాయలు ఆదాయం వున్న తిరుపతి వెంకటేశ్వర స్వామిని కూడా మనం నమ్మడంలేదు. మనం యేమని మొక్కుకొంటున్నామంటే స్వామీ నువ్వు ముందు యీ పని జరిగేలాగ చేసినట్లయితే తరువాత మేము నీకు యీ ప్రతిఫలం ముట్టచెప్పగలమని మొక్కుకొంటున్నాం. ఆ పరిస్థితిలో పసుపు గౌరిదేవిని నమ్మి ముందుగా హారతిని యిచ్చివేసి తరువాత అయిశ్వర్యాన్ని కోరకూడదు. ముందుగానే అష్టైశ్వర్యాల్ని యిచ్చి తరువాత హారతిని తీసి కొమ్మనాలి. అందుచేత మంగళహారతి.

'అష్టైశ్వర్యమూలిచ్చి హారతీ గైకొను అంబా! నీకిదే హారతీ'

అని ఉండాలన్నాడు చిదంబరం.

అంతట్లోకి మబ్బులు దట్టంగా పట్టడంవలన వర్షం పడవచ్చునంటూ ముగ్గురు మూర్ఖులూ ఊరివేపు బయల్దేరేరు. ●

Edited, Printed and Published by S Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.